ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 305 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | ఆదివారం 1 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### మధ్యప్రాచ్యానికి మారిన భారత చమురు కొనుగోళ్లు

భారత్ ముడి చమురు కొనుగోలు విధానాల్లో మార్పులు చేస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా చమురు కొనుగోలు క్లిష్టంగా మారిన నేపథ్యంలో భారత్ ఇప్పుడు సురక్షితమైన వనరులను ఎంచుకుంటోంది. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ డేటా ప్రకారం, రష్యన్ ముడి చమురు దిగుమతి జనవరి మొదటి మూడు వారాల్లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది, ఇది గత నెలలో సగటున 1.21 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది.

### త్వరలో యాపిల్ డిజిటల్ చెల్లింపుల సేవలు ప్రారంభం

డిజిటల్ చెల్లింపులకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. ప్రధానంగా యూపీఐ లాంటి డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ కారణంగా లావాదేవీలు అత్యంత సులభంగా, త్వరగా జరుగుతున్నాయి. అయితే, ఈ విభాగంలో దేశీయంగా ఇప్పటికీ గూగుల్, మెటా, అమెజాన్ లాంటి గ్లోబల్ కంపెనీలు, ఫోన్‌పే, పేటీఎమ్, భారత్‌పే లాంటి దేశీయ చెల్లింపుల యాప్‌ల హవా జోరుగా సాగుతోంది.

# వారు లేనిదే అడుగు పడదు!



- 'పుర' సమరంలో యువ మంత్రం జపిస్తున్న రాజకీయ పార్టీలు
- ప్రచారం సహా పోలింగ్‌లోనూ ప్రధాన పాత్ర పోషించనున్న యువత
- సంబంధిత వర్గాలను ఆకర్షించే పనిలో పడిన ప్రధాన పార్టీలు
- సామాజిక మాధ్యమాల ప్రాచారంలోనూ కీలకంగా వ్యవహరించనున్న యువత

హైదరాబాద్

తెలంగాణలో ఈ నెల 11న పురపాలిక ఎన్నికలు జరగనున్నాయి. నేటితో నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల వేళ అన్ని పార్టీలు యువతపైనే తమ దృష్టిని కేంద్రీకరించాయి. ఒక్క ఓటుతో కూడా అభ్యర్థుల తలరాతలు తారుమారయ్యే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీలు యువ ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి వ్యూహాలు రచిస్తున్నాయి. మరోవైపు ప్రచారం నుంచి పోలింగ్ వరకు అన్ని పార్టీల్లో యువత పాత్ర కీలకంగా మారనుంది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విజేతల్లో యువత సంఖ్యనే అత్యధికంగా ఉండగా, బల్దియా బరిలోనూ వారికే పెద్దపీట వేసే అవకాశం ఉంది. జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, రాయికల్, కోరుట్ల, ధర్మపురి, పట్టణాల్లోని మొత్తం ఓటర్లలో - మిగతా3లో



## అణ్వస్త్ర నిల్వల్లో భారత్ ముందంజ

- మారుతున్న భద్రతా సమీకరణాలు..
- అణ్వస్త్రాల సంఖ్యలో పాకిస్థాన్‌ను అధిగమించిన భారత్
- భారత్ వద్ద 180, పాకిస్థాన్ వద్ద 170 అణు వార్‌హెడ్‌లు ఉన్నట్లు అంచనా
- అమెరికా, రష్యా మధ్య కీలక అణు ఒప్పందం వచ్చే వారం ముగింపు
- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అణ్వస్త్ర పోటీపై అంతర్జాతీయ ఆందోళన
- రష్యా, చైనా, యూకే కూడా తమ అణ్వస్త్ర నిల్వలను పెంచుకుంటున్న వైనం

# తొలి సీఎంగా నయా రికార్డు

- హార్వర్డ్ వర్సిటీలో లీడర్‌షిప్ కోర్సు పూర్తిచేసిన రేవంత్ రెడ్డి
- హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి సర్టిఫికెట్ అందుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- జనవరి 25 నుంచి 30 వరకు హార్వర్డ్‌లో జరిగిన తరగతులకు హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి
- యూఎస్‌లోని మసాచుసెట్స్ రాష్ట్రం కేంబ్రిడ్జ్ నగరంలో ఉన్న హార్వర్డ్ కెనెడీ స్కూల్‌లో రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా తరగతులకు హాజరయ్యారు
- పలు ఎసైన్‌మెంట్లు పూర్తి చేసి, హోంవర్క్‌లు సమర్పించి, గ్రూప్ డిస్కషన్‌లు, ప్రాజెక్టుల్లో ఆయన భాగస్వామ్యమయ్యారు

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలోని 'కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్'లో లీడర్‌షిప్ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి కోర్సు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. జనవరి 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ విషయాన్ని రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరైనట్లు టీచర్స్, తోటి విద్యార్థుల నుంచి ఎంతో నేర్చున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. - మిగతా3లో





## నిజాం ఆభరణాలు ఆర్‌బీఐ వద్ద అత్యంత భద్రంగా ఉన్నాయి

- నిజాం నగల తరలింపుపై కేంద్రం కీలక ప్రకటన
- ఈ విషయాన్ని రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్
- నగలను హైదరాబాద్ తరలించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న కేంద్రం
- నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని గుర్తిస్తున్నామని వెల్లడి
- 1995 నుంచి ఆర్‌బీఐ ఆధీనంలో 173 అపురూప ఆభరణాలు


## బాంబు బెదిరింపుతో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

- కువైట్-ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
- అహ్మదాబాద్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయిన విమానం
- టిష్యూ పేపర్‌పై చేతిరాతతో ఉన్న బెదిరింపు సందేశం గుర్తింపు
- ప్రయాణికులంతా సురక్షితం, తనిఖీల్లో ఏమీ లభించలేదు
- ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు, విమాన ప్రయాణంపై అనిశ్చితి



## పిల్లలకు సోషల్ మీడియా కట్టడి ఆలోచనలో కర్ణాటక సర్కారు

- పిల్లలకు సోషల్ మీడియా యాక్సెస్‌ను నియంత్రించే అంశంపై కర్ణాటక ప్రభుత్వం చర్చ
- ఈ విషయాన్ని అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి ప్రియాంక్ ఖర్గే
- మైనర్లపై సోషల్ మీడియా దుష్ప్రభావంపై బీజేపీ ఎమ్మెల్యే ఆందోళన
- ఆస్ట్రేలియా, యూకే వంటి దేశాల తరహాలో చర్యలు తీసుకునే యోచన





## కేసీఆర్ అభ్యర్థనను తిరస్కరించిన సిట్

- మరోసారి నోటీసులు ఇవ్వాలని నిర్ణయం
- కేసీఆర్‌కు మరోసారి నోటీసు ఇవ్వాలని సిట్ నిర్ణయం
- నందినగర్‌లోని నివాసంలో నోటీసులు ఇవ్వనున్న సిట్ అధికారులు
- ఎర్రవల్లి ఫాంహౌస్‌లో విచారణ చేయాలనే కేసీఆర్ విజ్ఞప్తి తిరస్కరణ




## 'ఈయూతో ట్రేడ్ డీల్‌ను కాంగ్రెస్ ఓర్వలేకపోతోంది'

- జైరాం రమేశ్‌కు పీయూశ్ గోయల్ స్ట్రాంగ్ కౌంటర్
- కాంగ్రెస్ వైఖరిపై కేంద్రమంత్రి విమర్శలు
- రాహుల్ గాంధీ, జైరాం రమేశ్ లాంటి నేతలు భారత్‌లో ఉండటం ఆందోళనకరమన్న పీయూశ్ గోయల్
- చైనాతో ఎఫ్‌టీఏ భారత ప్రయోజనాలకు వ్యతిరేకం
- దేశీయ కార్ల మార్కెట్‌ను కాపాడుకుంటాం

## తెలంగాణలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు

- ఫిబ్రవరి 1న రిజెక్ట్‌పై అప్పీల్ చేసుకున్న అభ్యర్థుల కేసులను ఫిబ్రవరి 2న అధికారులు పరిశీలించనున్నారు
- ఫిబ్రవరి 3వ తేదీ నాటికి ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుంది



# నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమే

- పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించాం
- పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగింది
- కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదు
- బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారు
- రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదు
- తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్

పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో ఇవాళ జరిగిన సమావేశంలో అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం - బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఇవాళ్టి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై - మిగతా3లో

## సంపాదకీయం

# విబి జి రామ్ జితో భారత్ వికసించేనా?

ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాటి పాలకుల విధానాలను, సంక్షేమ పథకాలను, వాటి పేర్లను మార్చడం పాలకుల రాజకీయ ఎత్తుగడలో భాగం, సహజం కూడా. అయితే మార్పు అనేది పాలకుల సర్వతోముఖాభివృద్ధికి కాకుండా ప్రజలకు కనీస జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ఉండాలి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పాలకులు రూపొందించిన అభివృద్ధి విధానాలను, సంక్షేమ పథకాలను లోప భూయిష్టమైనవిగా పేర్కొంటూ వాటిని ఆపివేయడం సర్వసాధారణమైన ప్రక్రియగా మారింది. గత ప్రభుత్వాలు ప్రారంభించి, పూర్తి కాని అభివృద్ధి పథకాల (నీటిపారుదల ప్రాజెక్టులు, విద్య, వైద్య తదితర రంగాల పనుల)ను యథాతథంగా కొనసాగిస్తే ఆ పేరుప్రతిష్ఠలు గత ప్రభుత్వానికి దక్కుతాయేమోననే అక్కసుతోనే నిలుపుదల చేయడం మూలంగా లక్షలాది కోట్ల ప్రజాధనం వృథా అవుతుంది. 2005 లో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం గ్రామాల నుండి పట్టణాలకి వలసలని నివారించడం, పేదరికాన్ని తగ్గించడం, మహిళా సాధికారతను సాధించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (కరువు పని, 100 రోజుల పని) చట్టం 2005ను ప్రముఖ ఆర్థికవేత్తలు, మేధావులు, పార్లమెంటు సభ్యులు, వివిధ కమిటీలతో అనేక మార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలను, సలహాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఎంజిఎన్ఎఆర్ఇజిఎ చట్టరూపం దాల్చి రెండు దశాబ్దాలుగా (కొన్ని లోపాలు ఉన్నప్పటికీ) నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు అడుగులు ముందుకు వేస్తున్నది. ఈ పథకం చట్ట రూపంలో ఉన్న కారణంగా ఉపాధి కూలీలకు అన్యాయం జరిగితే చట్టపరంగా న్యాయాన్ని పొందే అవకాశం, ఉపాధి (పని)ని హక్కుగా డిమాండ్ చేసే అవకాశం ఉండడం ఉపాధి కూలీలకు ప్రధాన బలాలైతే ప్రభుత్వం ఈ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి చట్టం రూపంలో హామీ పడి ఉంది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 2025 లో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (విబి జి రామ్ జి) మిషన్‌ను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలలో భాగంగా తీసుకొచ్చామని చెబుతూనే గత ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలున్న కారణంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎంజిఎన్ఎఆర్ఇజిఎ 2005 చట్టం తూచా తప్పకుండా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఉపాధి హామీని నిరాటంకంగా కొనసాగించాలి అని చెబుతోంది. కానీ విబి జి రామ్ జి 2025 మిషన్ అనేది ప్రభుత్వ ఇచ్ఛ ఉన్నంత వరకే కొనసాగుతుంది. వీటి మధ్యనున్న ఈ వ్యత్యాసాన్ని గమనించకపోతే రాబోయే రోజుల్లో ఉపాధి హామీ అనేది 'హక్కు'గా ఉండకుండా పోయే ప్రమాదముంది. నూతన పథకంలో '25 రోజుల పని దినాలను అదనంగా పెంచడం' జియో టాగింగ్ ఆధారంగా వేతనాల చెల్లింపులు తప్ప విబి జి రామ్ జి 2025 లక్ష్యాల్లో చెప్పుకోదగ్గ మార్పులేవీ లేవు. నూతన ఉపాధి పథకానికి కేటాయించే బడ్జెట్‌లో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 10% వాటాను భరించాల్సి ఉంటుంది. గత ఉపాధి హామీ పథకానికి కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో కూలీలు, సిబ్బంది వేతనాలకు 100%, సామాగ్రి కొనుగోళ్లకు వాటా 90%, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా 10శాతం వాటాలు మాత్రమే భరించాయి. ప్రస్తుతం దేశంలోని చాలా రాష్ట్రాలు ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగించలేని పరిస్థితి ఉన్నది. దానికి తోడు నూతన ఉపాధి పథకంలో రాష్ట్రాల నెత్తిన మోపిన భారం కారణంగా ఒకవేళ ఆయా రాష్ట్రాలు ఆసక్తి చూపకపోయినా, రాష్ట్రాల్లో తమకు అనుకూలమైన ప్రభుత్వాలు లేకపోయినా సదరు రాష్ట్రాలు వాటా ఇవ్వలేదనే నెపంతో ఆయా రాష్ట్రాలపై వ్యతిరేకతను కూడగట్టి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చే విధంగా కుట్రలు చేయడం వలన పథకం లక్ష్యాలు నెరవేరకుండా ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది. నూతన పథకంలో రెండవ ప్రధానమైన అంశం వర్షాకాలంలో వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఏర్పడుతుందనే కారణంతో 60 రోజుల పాటు ఉపాధి పథకాన్ని నిలిపివేయడం. దీని కారణంగా వ్యవసాయ కూలీల డిమాండ్ తగ్గి తక్కువ వేతనానికే పనికి వెళ్లాల్సి వస్తుంది. వ్యవసాయ పనులకు పోలేనటువంటి వారి జీవనోపాధి దెబ్బ తింటుంది. ఎనభై శాతం యాంత్రీకరణ జరిగిన వ్యవసాయ రంగంలో రెండు నెలల పాటు ఉపాధి పనులు నిలిపివేయడం ఉపాధి నిరోధక చర్యే అవుతుంది. నూతన ఉపాధి పథకంలో కేంద్ర నిర్ణయమే శిరోధార్యంగా ఉండే అవకాశం ఉంది. ఒకవేళ అదే జరిగితే నూతన ఉపాధి పథకం ఏ రాష్ట్రంలో జరగాలి, ఎటువంటి పనులు చేయాలనేది కేంద్రం ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. అప్పుడు రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గడమే కాక వికేంద్రీకరణ ఆదర్శం దెబ్బతిని రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయించే ప్రమాదముంది. బాధ్యత, జవాబుదారీతనం పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపడం వలన ఉపాధి హామీ అసలు లక్ష్యం నెరవేరకుండా క్రమంగా పథకం ఉనికిని కోల్పోయే ప్రమాదముంది. ఏ పథకమైనా విజయవంతం కావాలంటే పాలకుల్లో దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణ, అధికారుల్లో చిత్తశుద్ధి ఉండాలి. అప్పుడే ఉపాధి పథక లక్ష్యాలైన స్థానిక సంస్థలు బలపడడం, ఉత్పాదక ఆస్తుల సృష్టి, ఆర్థిక అసమానతల తగ్గుదల, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ కొంత మేరకైనా సఫలీకృతమై సామాజిక, ఆర్థిక అంతరాల గోడల్ని బద్దలు కొట్టగలం. పాలకులు కూడా దేశాన్ని పట్టిపీడిస్తున్న

# పట్టణ గెలుపే రేపటి రాజకీయ దిశా నిర్దేశం

తెలంగాణలో ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల నేపథ్యం రాష్ట్ర రాజకీయాలను మరో కీలక మలుపు వద్ద నిలబెడుతోంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలుగా భావించే మున్సిపల్ ఎన్నికలు ఈసారి అధికార కాంగ్రెస్ పార్టీకి, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు, అలాగే బీజేపీకి రాజకీయంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు అనంతరం తొలిసారిగా పట్టణ స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని కొలిచే అవకాశం రావడంతో ఈ ఎన్నికలు కేవలం మున్సిపాలిటీ పాలనకే పరిమితం కాకుండా, రాష్ట్ర స్థాయి రాజకీయ బలాబలాలను నిర్ణయించే పరీక్షగా మారాయి. అందువల్లే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు 'మినీ అసెంబ్లీ ఎన్నికలు'గా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణలో మున్సిపల్ పాలనకు ప్రత్యేక చరిత్ర ఉంది. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పట్టణీకరణ వేగంగా పెరిగింది. హైదరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రామగుండం వంటి పట్టణ కేంద్రాలు ఆర్థికంగా, జనాభా పరంగా విస్తరించాయి. 2011 జనగణన ప్రకారం తెలంగాణలో పట్టణ జనాభా సుమారు 38 శాతంగా ఉండగా, తాజా అంచనాల ప్రకారం ఇది 42 శాతానికి చేరువవుతోంది. అంటే రాష్ట్ర రాజకీయాల్లో పట్టణ ఓటర్ల పాత్ర రోజు రోజుకీ పెరుగుతోంది. ఈ పట్టణ ఓటర్లే మున్సిపల్ ఎన్నికల ద్వారా తమ అసంతృప్తి లేదా మద్దతును నేరుగా వ్యక్తం చేసే స్థితిలో ఉన్నారు.

గత దశాబ్దంలో తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికలను పరిశీలిస్తే, అవి రాష్ట్ర రాజకీయాలకు సూచికలుగా ఎలా మారాయో స్పష్టంగా తెలుస్తుంది. 2019?20లో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ (అప్పట్లో టీఆర్ఎస్) మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. 141 మున్సిపాలిటీల్లో 88కి పైగా చోట్ల బీఆర్ఎస్ ఆధిపత్యం కొనసాగింది. ఆ ఫలితాలు తరువాత జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ రాజకీయ వేడిని పెంచాయి. జీహెచ్ఎంసీ ఎన్నికలు బీజేపీ ఎదుగుదలకు వేదికగా మారగా, బీఆర్ఎస్ తన పట్టును నిలుపుకుంది. ఈ పరిణామాలన్నీ మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర రాజకీయ దిశను ఎలా ప్రభావితం చేస్తాయో అప్పుడే నిరూపించాయి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు ముగింపు పలకడం తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పు. ఈ నేపథ్యంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలి పెద్ద పట్టణ పరీక్షగా మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ప్రజల ముందుకు వెళ్లే ఈ ఎన్నికల్లో ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలు, పాలన శైలి నేరుగా ప్రజా తీర్పుకు లోనవుతుంది. అందుకే కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ దృష్టిలో మున్సిపల్ ఎన్నికలు రెండు విధాలుగా కీలకం. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల్లో పొందిన ప్రజాభిమానాన్ని పట్టణ స్థాయిలోనూ నిలబెట్టు కోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో బలంగా ఉన్న పట్టణ స్థానిక సంస్థలపై తన పట్టు సాధించాల్సిన రాజకీయ అవసరం ఉంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 142 మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో అధిక భాగం ఇప్పటికీ బీఆర్ఎస్ ప్రభావంలోనే ఉన్నాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంలో తన సామర్థ్యాన్ని చూపించాల్సి ఉంటుంది.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు పట్టణ ప్రజల్లో ఎంత మేరకు విశ్వాసం పొందాయన్నది కూడా ఈ ఎన్నికల్లో తేలనుంది. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం, జీవన వ్యయం, ఇంధన ధరలు, అద్దె భారం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలపై ప్రజల స్పందన కాంగ్రెస్‌కు కీలకంగా మారనుంది. ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఈ మున్సిపల్ ఎన్నికలు రాజకీయ పునరుజ్జీవనానికి అవకాశంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ ఎదుర్కొంటున్న అంతర్గత అసంతృప్తులు, నాయకుల వలసలు, కార్యకర్తల్లో నైరాశ్యం వంటి పరిస్థితుల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు పరీక్షగా నిలుస్తున్నాయి. గతంలో పట్టణ ప్రాంతాల్లో బలమైన పట్టు ఉన్న పార్టీగా పేరున్న బీఆర్ఎస్, ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తే తన రాజకీయ స్థితిని తిరిగి బలపరుచుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, ఉత్తర తెలంగాణ పట్టణాల్లో బీఆర్ఎస్‌కు ఇప్పటికీ గణనీయమైన ఓటు బ్యాంకు ఉందన్న అంచనాలు ఉన్నాయి. బీఆర్ఎస్ వ్యూహం ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల చుట్టూ తిరగనుంది. అధికారంలోకి వచ్చి తక్కువ కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు కాలేదని, అభివృద్ధి పనులు నిలిచి పోయాయని, ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని ఆరోపణలు చేస్తూ పట్టణ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మున్సిపాలిటీలకు నిధుల కొరత, పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి ఇబ్బందులు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారంలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికలు తన రాజకీయ ప్రాధాన్యత ఇంకా తగ్గలేదని నిరూపించుకునే వేదికగా మారాయి. మూడవ ప్రధాన పార్టీగా బీజేపీ కూడా తెలంగాణ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గణనీయమైన విజయాలు సాధించిన బీజేపీ, పట్టణ ఓటర్లలో తన పట్టు పెంచుకోవాలనే లక్ష్యంతో ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి, యువత, వ్యాపార వర్గాల్లో తన ప్రభావాన్ని విస్తరించేందుకు మున్సిపల్ ఎన్నికలను ఉపయోగించుకో వాలని భావిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీని ఆసరాగా చేసుకుని కొన్ని పట్టణాల్లో కీలక పాత్ర పోషించాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధానంగా చర్చకు వచ్చే అంశాలు పట్టణ జీవనానికి నేరుగా సంబంధించినవే. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, చెత్త నిర్వహణ, రహదారుల పరిస్థితి, ట్రాఫిక్ సమస్యలు, అక్రమ నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక లోపాలు వంటి సమస్యలు ఓటర్లను ప్రభావితం చేస్తాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొన్ని పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగు పడ్డాయన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, అనేక చోట్ల అసమాన అభివృద్ధి జరిగిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలను ఎంత వేగంగా పరిష్కరిస్తుందన్నది ప్రజల తీర్పులో కీలకంగా మారనుంది. గణాంకాల పరంగా చూస్తే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రాధాన్యత మరింత స్పష్టమవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి సుమారు 3,500కు పైగా వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డులో సగటున 3,000 నుంచి 5,000 వరకు ఓటర్లు ఉంటారు. అంటే దాదాపు కోటి మంది పట్టణ ఓటర్లు నేరుగా ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. ఈ స్థాయి ఓటర్ల అభిప్రాయం రాష్ట్ర రాజకీయాలకు స్పష్టమైన సంకేతాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ ఎన్నికల ద్వారా వేలాది మంది ప్రజాప్రతినిధులు ఎంపిక అవుతారు. వీరిలో భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా ఎదిగే నాయకులు ఉండే అవకాశం ఉంది. అందువల్ల అన్ని పార్టీలు ఈ ఎన్నికలను నాయకత్వ తయారీ వేదికగా కూడా చూస్తున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పార్టీలకు పెద్ద సవాల్‌గా మారింది. తెలంగాణలో పట్టణ రాజకీయాల్లో వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలపై అవగాహన కీలకంగా ఉంటాయి. పార్టీ ఇమేజ్ ఎంత బలంగా ఉన్నా, స్థానిక అభ్యర్థిపై అసంతృప్తి ఉంటే ఫలితాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో అనేక చోట్ల పార్టీ కంటే అభ్యర్థి వ్యక్తిగత ప్రభావమే గెలుపును నిర్ణయించిన సందర్భాలు ఉన్నాయి. అందువల్ల ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా కీలక సూచికగా మారనుంది. సాధారణంగా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 55 నుంచి 60 శాతం మధ్యే ఉంటుంది. అయితే ఇటీవల పట్టణ ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరగడం, సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ కావడంతో ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. అధిక ఓటింగ్ ప్రభుత్వంపై అసంతృప్తిని సూచిస్తుందా లేక ప్రజల చైతన్యాన్ని ప్రతిబింబిస్తుందా అన్నది ఫలితాల అనంతరం విశ్లేషణకు అంశంగా మారనుంది. మీడియా, సోషల్ మీడియా కూడా ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక మున్సిపాలిటీలో జరిగిన చిన్న సంఘటన కూడా రాష్ట్రవ్యాప్తంగా చర్చకు రావడం, పార్టీల మధ్య ఆరోపణలు?ప్రత్యారోపణలు పెరగడం రాజకీయ వేడిని పెంచుతోంది. పట్టణ ఓటర్లు వార్తలు, విశ్లేషణలను తక్షణమే అందుకుంటూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్థితిలో ఉన్నారు. ఇది మున్సిపల్ ఎన్నికలను మరింత సున్నితంగా, ప్రతిష్టాత్మకంగా మారుస్తోంది. మొత్తంగా తెలంగాణలో ప్రస్తుత మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థల పాలనకే పరిమితం కావడం లేదు. ఇవి కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలి పెద్ద పట్టణ పరీక్షగా, బీఆర్ఎస్‌కు రాజకీయ పునరుజ్జీవన అవకాశంగా, బీజేపీకి విస్తరణ వేదికగా మారాయి. అభివృద్ధి, సంక్షేమం, పాలన సామర్థ్యం, ప్రజల విశ్వాసం అన్నీ ఈ ఎన్నికల్లో పరీక్షకు నిలుస్తున్నాయి. అందువల్ల తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తాత్కాలిక ప్రభావంతోనే కాకుండా, భవిష్యత్ రాజకీయ దిశను నిర్ణయించే కీలక ఘట్టాలుగా నిలవనున్నాయి.

# తెలుగువారి హస్తభూషణం శంకర నారాయణ నిఘంటువు

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య సాధనే ఏకైక లక్ష్యంగా, అఖండ భారతావనిలో అడుగిడిన శ్వేత జాతీయులు, మొదటగా ప్రారంభించింది వ్యాపారమే. అయితే ముందు వ్యాపారం చేయడానికి, అనంతరం అధికారం చెలాయించడానికి. ఇక్కడి భాషలు రావు. స్థానికలకు భాష వారికి అర్థమయ్యేది కాదు, అలాగే వారి భాష ఈ దేశస్తులకు బోధపడేది కాదు. వ్యాపారం, పరిపాలన అవసరాల దృష్ట్యా, ఆంగ్ల అధికారులు మెలమెల్లగా స్థానికుల భాషల పదాలను తమ భాషలోని తర్జుమా చేసుకోవడం ప్రారంభించారు. ఈ క్రమం లోనే తెలుగు పదాలను అర్థం చేసుకుంటూ, తర్జుమా చేసుకున్నారు. తద్వారా నిఘంటువులు తయారు చేశారు. అలా1818లో విలియం బ్రౌన్ తొలి తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు తయారు చేశాడు. జాన్ కార్నిక్ మారిస్ అనే వ్యక్తి ఇంగ్లీషు తెలుగు నిఘంటువు తయారు చేశాడు. 1821లో క్యాంప్ బెల్ ఇలాంటిదే ఇంకో నిఘంటువు తయారు చేశాడు. తరువాత సీ.పీ. బ్రౌన్ దొర ఇంకో నిఘంటువు 1852 లో (ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి సరిగ్గా అయిదేళ్ల ముందు) తయారు చేశాడు. చాలా మంది తెల్ల అధికారులు ద్విభాషలను తెలిసిన వారినే పెట్టుకున్నారు. అయితే అందరికీ రెండు భాషల్లో అంత ప్రావీణ్యం ఉండక పోవడం సహజమే. వారి అనువాదం అంత కచ్చితంగా ఉండేది కాదు. ఈ సమస్యను సాధ్యమైన రీతిలో అధిగమించడానికి ఆచార్య పాలూరి శంకరనారాయణ విశేష కృషి చేశారు. తొలి ఇంగ్లీష్, తెలుగు నిఘంటువును రూపొందించాడు. ఆచార్య పాలూరి శంకరనారాయణ భాషావేత్త, నైఘంటికుడు, సంస్కృతాంధ్ర పండితుడు, రాయల్ ఏషియాటిక్ సొసైటీ సభ్యుడు. శ్రీకాకుళంలో జన్మించి, మున్సిపల్ హైస్కూల్ లో చదివి, అక్కడే కొంతకాలం ఉపాధ్యాయునిగా పని చేశారు. తర్వాత మద్రాసులో ప్రెసిడెన్సీ కళాశాలలో గణిత శాస్త్ర ఆచార్యుని గా,



మద్రాసు విశ్వవిద్యాలయంలో ప్రధాన పరీక్షల అధికారిగా కూడా పని చేశాడు. కొచ్చిన్ యువ రాజులు, యుక్తవయసులో ఉన్న పిఠాపురం రాజా వంటి వారికి విద్యాబోధన చేశాడు. శంకర నారాయణ రచించిన తెలుగు - ఇంగ్లీషు, తమిళం-ఇంగ్లీషు నిఘంటువు చాలా ప్రసిద్ధి చెందినది. శంకర నారాయణగా పేరొందిన ఆయన పూర్తిపేరు పాలూరి శంకరనారాయణ శ్రేష్ఠి. ఆయన తయారు చేసిన తొలి ఇంగ్లీషు తెలుగు నిఘంటువు పేరే శంకర నారాయణ నిఘంటువు. తన జీవిత కాలంలో ఆయన తమిళనాడు రాజధాని మద్రాసు, ఒరిస్సాలోని గంజాం, జయపురం, మన రాష్ట్రంలోని విజయనగరం, పిఠాపురం, నూజివీడు, నెల్లూరు, కేరళలోని కొచ్చి లను సందర్శించాడు. రాచబిడ్డలకు చదువులు చెబుతున్నప్పుడే ఆయన వారి సౌలభ్యం కోసం ఇంగ్లీషు పదాలు, వాటి తెలుగు అర్థాల జాబితాను తయారు చేశాడు. తరువాత దాన్నే వ్యవస్థీకరించి, ఇంగ్లీషు తెలుగు నిఘంటువుని తయారు చేశాడు. అంతే కాదు, ఆయన తమిళ - ఇంగ్లీషు, ఇంగ్లీషు - తమిళ నిఘంటువులను కూడా తయారు చేశాడు. 1900 ప్రాంతంలో తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు కూడా తయారు చేశాడు. ఆయన తయారుచేసిన తెలుగు నిఘంటువు 1897లో ప్రచురితమైంది. ఆయన బతికుండగానే అయిదు ముద్రణలకు నోచుకుంది. ప్రతి ముద్రణకీ కొత్త పదాలను కలిపారు. ఆయన 1924-25 ప్రాంతంలో చని పోయాడు. ఆ తరువాత 1927 లో గిడుగు సీతాపతి, 1951 లో చిలుకూరి నారాయణ రావు, తరువాత వేదం లక్ష్మీనారాయణ కొత్తకొత్త పదాలను జోడించారు. 1953 లో నారాయణ అయ్యర్ దీనిని పరిష్కరించారు. ఇలా 1897 నుంచి 1953 వరకూ పదకొండు సార్లు పునర్ముద్రణ పొందింది ఈ నిఘంటువు. ఇప్పటికీ ఈ నిఘంటువుయే చాలా చోట్ల ప్రామాణికం. తరతరాల విద్యార్థులకు ఇది హస్త భూషణంగా నిలిచింది. 2004 అక్టోబరులో విజయవాడకు చెందిన విక్టరీ పబ్లిషర్స్ దీన్ని మళ్లీ ముద్రించారు. ఆగస్టు 2005 నాటికి మలి ముద్రణ అవసరమైంది. మళ్లీ 2006, 2007లలో పునర్ముద్రించాల్సి వచ్చింది. కోస్తా, తమిళనాడుల్లో ఆంగ్ల భాష నేర్చు కోవడంలో ఆయన పాత్ర అనన్య సామాన్యం. ఆయన పేరుతోనే ఆయన వ్రాసిన నిఘంటువు పేరొందింది. ఇప్పటికీ శంకరనారాయణ నిఘంటువు అంటే ప్రామాణికమే. ఎస్.రామానుజం చెట్టియార్ ప్రోత్సాహంతో రూపొందిన ఈ తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు మొదటి సారిగా 1900 సంవత్సరంలో మద్రాసు నుండి ప్రచురించ బడింది. తరువాతి కాలంలో అంటే 1927 వరకు చివరి సారిగా ముద్రించారు. దీనిని వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రులు 1953లో తిరిగి ముద్రించ తల పెట్టగా, ఎస్.నారాయణ అయ్యం గార్, వేదం లక్ష్మీ నారాయణ శాస్త్రి అశేష కృషి చేశారు. అలా సదరు సమగ్ర ప్రచురణ 31 జనవరి, 1953లో ప్రచురించ బడింది. ఇది "ఆసియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్" వారు 2003 సంవత్సరంలో మద్రాసు, న్యూఢిల్లీ నుండి ప్రచురించ బడింది.

# అణ్వస్త్ర నిల్వల్లో భారత్ ముందంజ

ప్రపంచవ్యాప్తంగా అణ్వస్త్ర పోటీ కొత్త ఆందోళనలకు తెరలేపుతున్న తరుణంలో, దక్షిణాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అణు వార్‌హెడ్‌ల సమీకరణలో భారత్ తన పొరుగు దేశం పాకిస్థాన్‌ను అధిగమించింది. అంతర్జాతీయ నివేదికల ప్రకారం, భారత్ తన అణు సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటుండగా, మరోవైపు అగ్రరాజ్యాల మధ్య ఉన్న కీలక అణు నియంత్రణ ఒప్పందం ముగింపు దశకు రావడం ప్రపంచ భద్రతపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది. ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ (ఫీూూ) తాజా అంచనాల ప్రకారం, 2025 నాటికి భారత్ వద్ద అణు వార్‌హెడ్‌ల సంఖ్య 180కి చేరింది. గతేడాది ఈ సంఖ్య 172గా ఉండగా, తాజాగా మరో 8 వార్‌హెడ్‌లను సమకూర్చుకుంది. అదే సమయంలో పాకిస్థాన్ వద్ద అణ్వస్త్రాల సంఖ్య 170 వద్దే స్థిరంగా ఉంది. అణ్వస్త్రాల విషయంలో రష్యా (4,309), అమెరికా (3,700) అగ్రస్థానంలో కొనసాగుతుండగా, చైనా వద్ద 600 వార్‌హెడ్‌లు ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఇజ్రాయెల్, ఉత్తర కొరియా కూడా అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన దేశాల జాబితాలో ఉన్నాయి. పాకిస్థాన్‌తో పాటు ముఖ్యంగా చైనా నుంచి ఎదురవుతున్న భద్రతాపరమైన



సవాళ్లే భారత్ తన అణు సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. చైనాలోని సుదూర ప్రాంతాలను సైతం లక్ష్యంగా చేసుకోగల దీర్ఘశ్రేణి క్షిపణులపై భారత్ దృష్టి సారించింది. ఒకే క్షిపణితో బహుళ లక్ష్యాలను ఛేదించగల 'మల్టిపుల్ ఇండిపెండెంట్‌లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికల్స్' (వీ×=ఎ) టెక్నాలజీని కూడా అభివృద్ధి చేస్తోంది. మరోవైపు, సంప్రదాయ సైనిక శక్తిలో తనకంటే పెద్దదైన భారత్‌ను నిలువరించడమే లక్ష్యంగా పాకిస్థాన్ తన అణు కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. భారత్ 'మొదటగా అణుదాడి చేయబోమనే' (చీశీ ఫీఱతీర్ ఖంవ) విధానానికి కట్టుబడి ఉన్నట్లు చెబుతున్నా, 2019లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఈ విధానంపై కొంత అనిశ్చితిని సృష్టించాయి. అయితే, పాకిస్థాన్ మాత్రం ఇలాంటి విధానాన్ని అధికారికంగా ప్రకటించలేదు. గత ఏడాది మే నెలలో ఇరు దేశాల మధ్య 88 గంటల పాటు కొనసాగిన ఉద్రిక్తతలు, అణు దేశాల మధ్య చిన్నపాటి ఘర్షణలు కూడా ఎంతటి పెను ప్రమాదానికి దారితీయగలవో గుర్తుచేశాయి. ఈ పరిణామాలు జరుగుతున్న తరుణంలోనే, అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాల మధ్య ఉన్న 'న్యూ స్టార్ట్' అణు ఒప్పందం వచ్చే వారం ఫిబ్రవరి 4తో ముగియనుంది. దీనికి ప్రత్యామ్నాయ ఒప్పందం కుదరకపోవడంతో, గత 50 ఏళ్లలో ఇరు దేశాల మధ్య అణ్వాయుధాలపై ఎలాంటి పరిమితులు లేని పరిస్థితి ఏర్పడటం ఇదే తొలిసారి కానుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా కొత్త అణ్వస్త్ర పోటీకి దారితీయవచ్చని, ఇరు పక్షాల వ్యూహాత్మక ప్రణాళికలు "అనిశ్చితి, తీవ్ర పరిణామాల అంచనాల" ఆధారంగా నడిచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు అమెరికా తన అణ్వస్త్రాలను తగ్గిస్తుండగా, ఇప్పుడు రష్యా, చైనా, భారత్, పాకిస్థాన్, యూకే వంటి దేశాలు తమ నిల్వలను పెంచుకోవడం ప్రపంచ భద్రతకు కొత్త సవాలుగా మారింది.

# సామాజిక, ఆర్థిక అవగాహనతోనే వృద్ధికి బూస్ట్!

ప్రపంచం మొత్తమ్మీద అతివేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి. అయితే దేశీ వార్షిక వృద్ధి రేటు ఏడు శాతం కంటే ఎక్కువగా ఉండటం, అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో భారత్ ద్రవ్యలోటును తగ్గించుకోవడంతోపాటు రుణ భారాన్ని కూడా తగ్గించుకోవాలి. దీని ద్వారా ద్రవ్యపరమైన స్థిరీకరణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. మరోవైపు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలి కాలంలో చేపట్టిన చర్యలను పరిశీలిస్తే.. విధానపరమైన రేట్లను తగ్గించే దిశగా అడుగులేస్తున్నట్లు స్పష్టమవుతుంది. తద్వారా వృద్ధికి తోడ్పాటు అందించాలని వ్యాపారాలు, కుటుంబాలపై ఖర్చులను తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ఇదే సమయంలో రాజకీయ, ఆర్థికవేత్తల అభిప్రాయం కొంచెం భిన్నంగా కనిపిస్తోంది. కార్మిక, వ్యవసాయ చట్టాల సవరణ, రైల్వే, రహదారులపై భారీ పెట్టుబడులు, ఆర్థిక ప్రోత్సాహకాలు, తక్కువ పన్నుల రూపంలో ప్రభుత్వం ఇప్పటికే వృద్ధికి అవసరమైన వాతావరణం కల్పించిందని, ఇప్పుడు ప్రైవేట్ రంగం దేశీ అభివృద్ధిపై పెట్టుబడులు పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని భావిస్తోంది. అంతేకాదు.. యూరోపియన్ యూనియన్‌తో ఇటీవల కుదుర్చుకున్న ఫ్రీ ట్రేడ్ ఒప్పందం కూడా అమెరికా వాణిజ్య విధానాలు, అంతర్జాతీయ జియోపాలిటిక్స్ ద్వారా ఏర్పడుతున్న అనిశ్చితులను అధిగమించేందుకు ఉపయోగపడుతుందని అంచనా వేస్తోంది. ఇవన్నీ నాణేనికి ఒక వైపు అయితే.. వాస్తవం మరింత సంక్లిష్టంగా ఉంది.

**సామాజిక ఆర్థిక పరిస్థితులు**

భారత్ కచ్చితంగా చాలా పెద్ద ఆర్థిక వ్యవస్థ కానీ.. తలసరి ఆదాయం మూడు వేల డాలర్ల కంటే తక్కువ. చైనాసహా ఇతర ధనిక దేశాల తలసరి ఆదాయాలు మనకు నాలుగు రెట్లు ఎక్కువ. దేశంలో యాభై శాతం జనాభాకు రేషన్ బియ్యం కావాలని ప్రభుత్వం విశ్వసిస్తోంది. అలాగే దిగువ, మధ్య తరగతి వర్గాల వారు మరిన్ని కొనుగోళ్లు చేసేలా చేసే లక్ష్యంతో ప్రభుత్వం జీఎస్టీ రేట్లను తగ్గించింది కూడా. నిరుద్యోగం, తగినన్ని అవకాశాలు లేకపోవడం ఇప్పటికీ దేశంలో అధికంగా ఉంది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం చాలా తక్కువగా ఉంది. పోషకాహార లోపం సమస్యను ఇప్పటివరకూ పరిష్కరించలేకపోయారు. అలాగే ఆరోగ్య సంరక్షణకు తగిన మౌలిక సదుపాయాలు లేవు. మూలధన, శ్రామిక ఉత్పాదకత కూడా ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగానే ఉంది. ఇది ఇటీవలి కాలంలో వేగంగా తగ్గిపోతోంది. రూపాయి బలహీనపడిపోవడం, విదేశీ



పెట్టుబడిదారులు భారతీయ మార్కెట్ల నుంచి వేగంగా వైదొలగుతూండటం కూడా ఏమంత మంచి పరిణామాలు కావు. విదేశీ మారక ద్రవ్యం నిల్వలు భారీగా ఉన్నప్పటికీ విదేశీ రుణభారం తగ్గకపోవడాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. చాలాకాలంగా దేశీ ఎగుమతుల్లో పెరుగుదల లేకుండాపోయింది. పైగా చైనా ఉత్పత్తులపై ఆధారపడటం ఏటికేటా పెరిగిపోతోంది. బ్యాంకింగ్ వ్యవస్థలో రిస్క్ క్యాపిటల్ తగినంత ఉన్నప్పటికీ అందుకు తగ్గట్టుగా రుణాల కోసం డిమాండ్ పెరగడం లేదు. అయితే డిపాజిట్ల క్రెడిట్ల నిష్పత్తి మాత్రం గత కొన్ని నెలల్లో గణనీయంగా పెరిగిపోయింది. పొదుపు తగ్గడం లేదా పెట్టుబడి విషయంలో ప్రాథమ్యాలు మారిపోవడం దీనికి కారణం కావచ్చు. బంగారం, రియల్ ఎస్టేట్, క్రిప్టో తదితర ఇతర పెట్టుబడి మార్గాలను ఎంచుకుంటూ ఉండవచ్చు. పెద్ద పెద్ద వ్యాపారాలు, అధికాదాయ, ధనిక కుటుంబాలకు మినహా చిన్న, ప్రైవేట్ రంగ వ్యాపార వర్గాలు పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారు. ఎగుమతులు పెరగకపోవడం, అంతర్జాతీయ వాణిజ్య విపణిలో చైనా ఆధిపత్యం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం దిగుమతులపై ఉన్న నిబంధనలను కొన్నింటిని తొలగించింది. భారతీయ నగరాలు కొన్ని ప్రపంచంలోనే అత్యంత కాలుష్యభరిత నగరాల జాబితాలోకి చేరాయి. మహా నగరాల్లో ట్రాఫిక్ నిర్వహణ నత్తనడకన సాగుతోంది.

రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలపై రుణభారం పెరిగిపోతోంది. క్లుప్తంగా చెప్పాలంటే.. మనం భారీ ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు, తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న సమాజంగా పరిణమించేందుకు ఇంకా చాలా సమయం పడుతుందన్న మాట. కాబట్టి.. అభివృద్ధిని మరింత పెంచేందుకు ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు పెరగాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలతోపాటు చాలా కుటుంబాలు రిస్క్ తీసుకునేందుకు సిద్ధంగా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే భారీ పెట్టుబడులతో సామాజిక, ఆర్థిక పురోగతికి పునాదులు వేయాలి. ప్రజలందరికీ అవసరమైన మౌలిక సదుపాయాలను అందరికీ సమానంగా అందుబాటులోకి తేలేకపోతే మన ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతుంది. ఇది కాస్తా దీర్ఘకాలంలో మధ్యాదాయ దేశంగానే మిగిలిపోయేలా చేస్తుంది. ఈ ట్రాప్ నుంచి తప్పించుకోవాలంటే... ద్రవ్య స్థిరీకరణను వాయిదా వేయాలి. ఎందుకంటే.. వడ్డీరేట్లు స్థిరంగా ఉన్నాయి.. తగినంత లిక్విడిటీ అందుబాటులో ఉంది. స్పెక్యులేషన్‌కు అవకాశమున్న రంగాల్లో పెట్టుబడులను నియంత్రించాలి. తద్వారా అందుబాటులో ఉన్న మొత్తం రిస్క్ క్యాపిటల్‌ను మెరుగ్గా వాడుకునేందుకు వీలు ఏర్పడుతుంది. నగర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వమే భారీగా పెట్టుబడులు పెట్టాలి. కాలుష్య నివారణకు, ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు, పారిశుద్ధ్యాన్ని పెంచేందుకు, గృహ వసతి కల్పనకు ప్రయత్నాలు ముమ్మరం కావాలి. చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి ఈక్విటీ మద్దతు కల్పించాలి. రుణ సౌకర్యం కల్పించడం ఒక్కటే సరిపోదు. ప్రభుత్వ రంగ సంస్థల వద్ద వృథాగా పడిఉన్న మొత్తాలను పెట్టుబడుల రూపంలోకి మార్చేలా ప్రోత్సహించాలి. కొన్నేళ్లపాటు డివిడెండ్లను త్యాగం చేయాల్సి వచ్చిన వెనకాడరాదు. ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు లేకుండా చూడాలి. ఎనిమిదో పే కమిషన్ ద్వారా గ్రామీణ, నగర ప్రాంతాలు రెండింటిలోనూ తగిన వేతన పరిమితులు ఏర్పాటయ్యేలా చూడాలి. పరోక్ష పన్నుల భారాన్ని తగ్గించి, ద్రవ్యోల్బణ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. యూరప్‌తో కుదిరిన ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ ద్వారా గరిష్టంగా లాభం పొందేందుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలతోపాటు పెద్ద కంపెనీలకు కూడా లక్ష్యాల ఆధారిత ప్రోత్సాహకాలు అందించాలి. ఇన్నోవేషన్ ద్వారా విలువను జోడించడంలో భారీ కార్పొరేషన్ల పాత్రను గుర్తించి తగు విధంగా ప్రోత్సహించాలి. మొత్తమ్మీద చూస్తే.. ఆర్థికాభివృద్ధి విషయంలో ప్రభుత్వ, ఆర్థికవేత్తల వ్యూహంపై పునరాలోచన జరగాలి. వివిధ దేశాలతో చేసుకున్న ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ ఇస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ప్రభుత్వ సేవల రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెంచాలి. భారీ కార్పొరేషన్లకు కాకుండా చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో పాటు ఆర్థికపరమైన మద్దతుకు ప్రాధాన్యత కల్పించాలి. అంతర్జాతీయ స్థాయిలో పోటీతత్వం ఉండేందుకు కార్మిక, పెట్టుబడి ఉత్పాదకతలను పెంచే విషయమై దృష్టి పెట్టాలి.

# 'ఈయూతో ట్రేడ్ డీల్‌ను కాంగ్రెస్ ఓర్వలేకపోతోంది'

అందని ద్రాక్ష పుల్లన అనేలా కాంగ్రెస్ పార్టీ వైఖరి ఉందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ విమర్శించారు. భారత్ - యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య ఖరారైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే ఎఫ్‌టీఏపై 2006లో ఈయూతో చర్చలను మొదలుపెట్టిన నాటి కాంగ్రెస్ సర్కారు ఎలాంటి ఫలితాన్నీ సాధించలేకపోయిందని పీయూశ్ గోయల్ తెలిపారు. అప్పట్లో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హోదాలో జైరాం రమేశ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి పెను ఆటంకంగా నిలిచారన్నారు. ఈయూతో ఎఫ్‌టీఏను ఖరారు చేసుకునే చొరవను, సాహసాన్ని నాటి కాంగ్రెస్ సర్కారు చూపలేకపోయిందని ఆయన మండిపడ్డారు. కానీ తాజాగా ఈయూతో మోదీ సర్కారు ఎఫ్‌టీఏను ఖరారు చేసుకోవడాన్ని చూసి ఓర్వలేక, అందని ద్రాక్ష పుల్లన అనేలా జైరాం రమేశ్ మాట్లాడారని ధ్వజమెత్తారు. గతంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా చైనాతో ఎఫ్‌టీఏ కోసం పాకులాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని పీయూశ్ గోయల్ అన్నారు. సొంతదేశాన్ని కించపరిచేలా మాట్లాడే రాహుల్ గాంధీ, జైరాం రమేశ్ లాంటి నేతలు భారత్‌లో ఉండటం ఆందోళనకరమన్నారు.

**చైనాతో ఎఫ్‌టీఏ భారత ప్రయోజనాలకు వ్యతిరేకం**

"ట్రేడ్ డీల్‌పై 2006లో ఈయూతో చర్చలను మొదలుపెట్టిన నాటి కాంగ్రెస్ సర్కారు, 2013లో వాటిని ఆపేసింది. చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం భారతదేశ ప్రయోజనాలకు విరుద్ధమని తెలిసినా, ఆ ఒప్పందం దిశగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే అధికారాన్ని కాంగ్రెస్ పార్టీకి ఎవరు ఇచ్చారు? భారత తయారీ రంగ సంస్థలతో పోటీ పడే



దేశాలతో కానీ, భారత తయారీరంగ సంస్థల కంటే తక్కువ కార్మిక వ్యయాలను కలిగిన సంస్థలున్న దేశాలతో కానీ ఎఫ్‌టీఏను కుదుర్చుకునే ప్రసక్తే లేదు. చైనాలాంటి దేశంతో ఎఫ్‌టీఏను కుదుర్చుకుంటే, భారత్‌లోని తయారీరంగ సంస్థలకు గడ్డుకాలం ఎదురవుతుంది. ఈ అంశాలు తెలిసినా జపాన్, దక్షిణ కొరియాలతో గతంలో కాంగ్రెస్ సర్కారు ఎఫ్‌టీఏలను కుదుర్చుకుంది. దీనివల్ల భారత్‌కు ఆ రెండు దేశాల దిగుమతులు డబుల్ అయ్యాయి. కానీ మనదేశం నుంచి ఆ దేశాలకు వస్తు,ఉత్పత్తులు తగినంత చేరలేదు. దేశ పురోగతిని నిరోధించే ప్రణాళికలు మాత్రమే కాంగ్రెస్ పార్టీ దగ్గరున్నాయి. ఈయూతో ట్రేడ్ డీల్ భారత ఆర్థిక వ్యవస్థకు లాభదాయకంగా ఉంటుంది" అని కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ పేర్కొన్నారు.

**దేశీయ కార్ల మార్కెట్‌ను కాపాడుకుంటాం**

"భారత్‌లో వాహనాల తయారీని లాభదాయక వ్యవహారంగా ఈయూ దేశాల కంపెనీలు భావిస్తున్నాయి. దీనివల్ల మనదేశంలో కొత్తగా పెద్దసంఖ్యలో ఉద్యోగాలు క్రియేట్ అవుతాయి. ఇక ఇదే సమయంలో భారత్‌లోని దేశీయ కార్ల మార్కెట్‌ను మేం కాపాడుకుంటాం. గరిష్ఠంగా రూ.30 లక్షల దాకా ధర పలికే కార్ల కేటగిరీలలోకి ఈయూ వాహన కంపెనీలకు అనుమతిని ఇవ్వబోం. ఈయూ దేశాల లగ్జరీ కార్లకు మాత్రమే ఎంట్రీని ఇస్తాం. ఒకవేళ వాటి సేల్స్ జరిగితే, మనదేశంలోనే కార్ల తయారీని అవి మొదలుపెడతాయి. ఈయూతో ఎఫ్‌టీఏ భారతదేశ వస్త్ర తయారీ రంగానికి భారీ ఊతమిస్తుంది. దేశ వస్త్ర ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. ట్రేడ్ డీల్‌లో భాగంగా వాతావరణంలోకి కర్బన ఉద్గారాల విడుదలను అరికట్టేందుకు భారత్‌కు ఈయూ ఆర్థిక చేయూతను అందించబోతోంది. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల వస్తు,ఉత్పత్తులపై ఈయూ దేశాలు కార్బన్ ట్యాక్స్ విధిస్తున్నాయి. ఈ ట్యాక్స్‌లో భారత్‌కు రాయితీ లభించనుంది" అని కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ చెప్పారు.


**చిలీ, కెనడా, అమెరికాలతోనూ ఎఫ్‌టీఏలపై చర్చలు**

"భారత్‌తో ట్రేడ్ డీల్‌ను మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా ఈయూ అభివర్ణించింది. తదుపరిగా అమెరికా లాంటి దేశాలతోనూ డీల్స్‌ను ఖరారు చేసుకోవాలని భావిస్తున్నాం. చిలీతో ఎఫ్‌టీఏపై చర్చలు ప్రస్తుతం తుది దశలో ఉన్నాయి. కెనడా, అమెరికాతోనూ మా సంప్రదింపులు కొనసాగుతున్నాయి. త్వరలోనే గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)లోని 6 దేశాలతోనూ ఎఫ్‌టీఏపై చర్చలను మొదలుపెడతాం. ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయ యవనికలో అత్యుత్తమ స్థాయిలో భారత్ ఉంది. శరవేగంగా వికసిస్తున్న భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ దేశాలకు ఆసక్తి పెరుగుతోంది. 2047లో వికసిత భారత్‌ను సాధించే దిశగా మోదీ సర్కారు పట్టుదలతో పనిచేస్తోంది" అని కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ వెల్లడించారు.

## బాంబు బెదిరింపుతో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

కువైట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. దీంతో విమానాన్ని అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలో 180 మంది ప్రయాణికులతో సహా మొత్తం 186 మంది ఉన్నారు. వారందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. విమానం గాల్లో ఉండగా, ఓ టిష్యూ పేపర్‌పై చేతిరాతతో ఉన్న బెదిరింపు సందేశాన్ని సిబ్బంది గుర్తించారు. విమానాన్ని హైజాక్ చేస్తామని, బాంబు ఉందని ఆ నోట్‌లో ఉండటంతో పైలట్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఏవియేషన్ భద్రతా నిబంధనల ప్రకారం, పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి, విమానాన్ని సమీపంలోని అహ్మదాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన వెంటనే, భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ప్రయాణికులందరినీ కిందకు దించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, సీఐఎస్ఎఫ్, డాగ్ స్క్వాడ్ బృందాలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.డి. నకుమ్ మాట్లాడుతూ, "తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. విమానం తనిఖీ పూర్తయింది, తదుపరి విచారణ కొనసాగుతోంది" అని వివరించారు. అధికారులు ఈ చేతిరాత నోట్ ఎక్కడి నుంచి వచ్చింది, విమానంలోకి ఎలా చేరింది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విమానం తిరిగి ఢిల్లీకి ఎప్పుడు బయలుదేరుతుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల అహ్మదాబాద్‌లో పలు చోట్ల బాంబు బెదిరింపులు రాగా, అవన్నీ వట్టిదేనని తేలింది. అయినప్పటికీ, ప్రతి బెదిరింపును తీవ్రంగా పరిగణిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పిల్లలకు సోషల్ మీడియా కట్టడి ఆలోచనలో కర్ణాటక సర్కారు



పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించే అంశంపై కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా చర్చిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, బీటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే తెలిపారు. దీనివల్ల ఎదురయ్యే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు శుక్రవారం శాసనసభలో ఆయన వెల్లడించారు. బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే ఎస్. సురేశ్ కుమార్ ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేయగా, మంత్రి స్పందించారు. ఈ విషయం చాలా తీవ్రమైనదని, ఇప్పటికే ఫిన్‌లాండ్, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాలు పిల్లల సోషల్ మీడియా వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయని ప్రియాంక్ ఖర్గే గుర్తుచేశారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించాలనే దానిపై మేం చర్చిస్తున్నాం. ఈ అంశం ప్రస్తుతం పరిశీలనలో ఉంది" అని ఆయన తెలిపారు. ఇప్పటికే మెటా సంస్థ సహకారంతో రాష్ట్రంలో 'డిజిటల్ డిటాక్స్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో దాదాపు 3 లక్షల మంది విద్యార్థులు, లక్ష మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని వివరించారు. అంతకుముందు సభలో మాట్లాడిన సురేశ్ కుమార్, 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను ఆస్ట్రేలియా నిషేధించిందని ప్రస్తావించారు. "పిల్లలు యుక్తవయస్కులు కాకముందే అశ్లీల కంటెంట్‌కు బానిసలవుతున్నారు. ఇది చాలా ప్రమాదకరం. వెంటనే చర్యలు తీసుకోకపోతే మన పాఠశాలలు, కుటుంబ వ్యవస్థలు నాశనమవుతాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## నిజాం ఆభరణాలు ఆర్‌బీఐ వద్ద అత్యంత భద్రంగా ఉన్నాయి



నిజాం నవాబులకు చెందిన అపురూప ఆభరణాలపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ నగలు ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆధీనంలో అత్యంత భద్రంగా ఉన్నాయని, అయితే వాటిని శాశ్వత ప్రదర్శన కోసం హైదరాబాద్‌కు తరలించే విషయంపై ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నిన్న రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 1995 నుంచి 173 అపురూపమైన నిజాం ఆభరణాలు ఆర్‌బీఐ లాకర్లలో ఉన్నాయన్న విషయం ప్రభుత్వానికి తెలుసా? అని అడగగా, మంత్రి 'అవును' అని బదులిచ్చారు. ఈ నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందా అని, వాటిని సొంత గడ్డ అయిన హైదరాబాద్‌లో ప్రదర్శించాలన్న ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటుందా అని కూడా ప్రశ్నించారు. దీనికి మంత్రి బదులిస్తూ, నిజాం నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను, వాటితో ముడిపడి ఉన్న ప్రజా ప్రయోజనాలను తమ మంత్రిత్వ శాఖ గుర్తిస్తుందని తెలిపారు. అయితే, ఆర్‌బీఐతో ఉన్న ఒప్పందం ప్రకారం భద్రతా కారణాల రీత్యా ఈ ఆభరణాలు అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్నాయని షెకావత్ వివరించారు. ఈ నేపథ్యంలో వాటిని శాశ్వత ప్రదర్శన కోసం హైదరాబాద్‌కు తరలించే అంశంపై ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

## 'కాంగ్రెస్‌కు విదేశీ దోపిడీదారులంటే ఎంతో ప్రేమ

గజనీ మహమ్మద్‌ను భారతీయ దోపిడీదారుడిగా మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ అభివర్ణించడంపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్, దాని ఎకోసిస్టమ్ (మద్దతుదారులు) విదేశీ ఆక్రమణదారులను ప్రేమిస్తుందని విమర్శించింది. హిందూ వ్యతిరేక నిరంకుశ శక్తులను కీర్తిస్తుందని ఆరోపించింది. విదేశీ ఆక్రమణదారులు, దోపిడీదారుల పట్ల హమీద్ అన్సారీకి ఉన్న అభిమానం అతని సిక్ మైండ్‌సెట్‌ను ప్రతిబింబిస్తుందని విరుచుకుపడింది. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రతినిధి సుధాన్షు త్రివేది వ్యాఖ్యానించారు. చరిత్ర పుస్తకాలలో విదేశీ ఆక్రమణదారులు, దోపిడీదారులుగా చిత్రీకరించిన గజనీ మహమ్మద్ సహా చాలా మంది వాస్తవానికి భారతీయలేనని మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. "విదేశీ ఆక్రమణదారులుగా మన చరిత్ర పుస్తకాలు చిత్రీకరించే లోడీ, గజనీ ఎవరో అనే విషయం నేను ఎప్పుడూ చెబుతూనే ఉన్నాను. వారందరూ భారతీయ దోపిడీదారులు. వారు పొరుగు దేశం నుంచి భారత్‌కు రాలేదు. మనం రాజకీయంగా వారు భారత్‌లో దేవాలయాలను, ఇతర కట్టడాలను నాశనం చేశారని చెప్పడం సౌకర్యంగా ఉంటుంది. కానీ వారందరూ భారతీయులే" అని హమీద్ అన్సారీ పేర్కొన్నారు. దీంతో ఈ వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. మాజీ ఉపరాష్ట్రపతిపై బీజేపీ మండిపడింది. సోమనాథ్ ఆలయాన్ని ధ్వంసం చేసిన గజినీ మహమ్మద్‌ను పొగుడుతూ హమీద్ అన్సారీ వ్యాఖ్యలు చేయడంపై బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ హిందూ ద్వేషులను ప్రశంసిస్తూ, వారి దురాగతాలను కప్పిపుచ్చుతుందని ఆరోపించారు.

# వారు లేనిదే అడుగు పడదు!

-మొదటిపేజీ తరువాయి

18 నుంచి 39 ఏళ్ల వయసున్న వారు 45.50 శాతం మంది ఉన్నారు. వృద్ధులు, మధ్య వయసు ఓటర్ల ఆలోచనలు చాలా వరకు స్థిరంగా ఉంటాయి. అయితే యువత ఆలోచనలు వారికి కాస్త భిన్నంగా ఉంటాయి. యువత సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మొదలుకొని, పార్టీల తరఫున ప్రచారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తారు. బరిలో నిలిచే అభ్యర్థులుగానూ యువతనే అధికంగా ఉండనుండటంతో ఎన్నికల్లో వీరి పాత్రే కీలకంగా మారనుంది. పట్టణ ప్రాంత ఓటర్లలో ఎక్కువ మంది అక్షరాస్యులైన యువత ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా ఓటరు చైతన్యం, ఓటు నమోదు, పోలింగ్, పార్టీల వైఖరి తదితర అంశాలపై పెద్ద ఎత్తున ప్రచారాలు సాగుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే వారి నుంచి స్పందన వస్తోంది.

ఇన్‌స్టాగ్రాం, వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా, గ్రూపుల్లో చురుగ్గా ఉండే యువత పార్టీల ప్రచారంలోనూ ముందుంటున్నారు.

ఈ విషయాలను గ్రహించిన అన్ని పార్టీల నాయకులు ఎన్నికల్లో యువ ఓటర్లను ఆకట్టుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పుర ఎన్నికల్లో జిల్లాలో యువ మార్కు కనిపించనుండగా గెలిచిన వారు యువతకు స్వయం ఉపాధి మార్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. యువతకు ఆట స్థలాలు, వ్యాయామశాలలు, ఉద్యోగ శిక్షణ కేంద్రాలు, స్వయం ఉపాధి కల్పన, గ్రంథాలయాల ఏర్పాటు, వ్యక్తిగత రుణాలు, యువజన సంఘాలకు రాయితీపై రుణాల మంజూరు తదితర ప్రయత్నాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**పెద్ద సంఖ్యలో నామినేషన్లు**

అయితే మున్సిపల్ ఎన్నికల నామిన్షన్ల దాఖలుకు నేడే చివరి రోజు కావడంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశావహులు పెద్ద సంఖ్యలో నామిషన్లు వేశారు. అయితే అధికార పార్టీ తరఫున పోటి పడుతున్న వారిలో ప్రజాదరణ కలిగిన అభ్యర్థులను నియోజకవర్గాల వారిగా ఇన్‌ఛార్జీల నేతృత్వంలో ఏర్పాటైన స్క్రీనింగ్ కమిటీ తుది ఎంపిక చేయనుంది. ఇంకో వైపు 20 మందితో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విడుదల చేశారు. తుది దశకు అభ్యర్థుల ఎంపిక : మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తుది దశకుచేరుకుంది. నామినేషన్లకు చివరి రోజు కావడంతో లోక్‌సభ నియోజకర్గాల వారీగా స్క్రీనింగ్ కమిటీలు ఏర్పాటు చేసింది. లోక్‌సభ పరిధిలో పార్టీ ఇంఛార్జ్‌లను కన్వీనర్లుగా నియమించారు. స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్లుగా ఆదిలాబాద్‌కు పి. సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కరీంనగర్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వర రావును పీసీసీ నియమించింది. పెద్దపల్లికి మంత్రి జూపల్లి, మెదక్‌కు మంత్రి గడ్డం వివేక్, జహీరాబాద్‌కు మంత్రి అజారుద్దీన్‌కు బాధ్యతలు అప్పగించింది. దీనిలో పాటు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సైతం ఎన్నికల బరిలో నిలిచి వ్యూహ ప్రతివ్యూహాలను రచిస్తున్నాయి.

# కాంగ్రెస్ సెల్ఫ్ గోల్

**హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల వేళ సిట్ అధికారులు బీఆర్ఎస్ కు సానుభూతి తెచ్చేందుకు నడుంకట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు నోటీసులు ఇచ్చివిచారణకు పిలవడం మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపుతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. కాంగ్రెస్ శ్రేణులు ఇదే భయపడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు చోటు చేసుకున్న కీలక పరిణామం మున్సిపల్ ఎన్నికల్లో కారు పార్టీకి కలసి వచ్చేటట్లు కనిపిస్తుంది. అరవై ఐదేళ్ల వయసులో పెద్దాయనను విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం పై కాంగ్రెస్ నేతలే లోలోపల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో చేయాల్సిన పని ఇదా? అంటూ కొందరయితే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. ఎంత లేదన్నా కేసీఆర్ తెలంగాణ సాధించిన వ్యక్తిగా నేటికీ ప్రజల్లో చెరగని ముద్ర ఉంది. ఆయన అవినీతి, ఆరోపణలు గత రెండేళ్ల నుంచి ఏ మాత్రం నిరూపించలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ఏంటన్న ప్రశ్న ప్రజల నుంచి ఎదురవుతుందంటున్నారు. కాళేశ్వరంలో కోట్ల రూపాయలు అవినీతిజరిగిందని ఆరోపణలు చేసి.. కొన్ని నెలల పాటు కమిషన్ తో కాలం గడిపి, తర్వాత నింపాదిగా సీబీఐకి ఇస్తున్నట్లు చెప్పేయడంతోనే అందులో డొల్లతనం బయటపడిందన్న కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. కాళేశ్వరం అవినీతిని తేల్చలేని వాళ్లు ఇక ఫోన్ ట్యాపింగ్ కేసులో సాధించిందేమటన్న ప్రశ్నను బీజేపీ నేతలు కూడా ప్రశ్నిస్తున్నారు. ఒకరకంగా పెద్దాయనను ఇలా విచారణ పేరిట వేధించడం వల్ల కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టమే కాని, ఎటువంటి ప్రయోజనాలు ఉండవన్న విశ్లేషణలు



వినపడుతున్నాయి. రేపు ఆయన ఇంట్లో విచారణ చేసినా బీఆర్ఎస్ నేతలు చేసే హడావిడితో కొంత సానుభూతి ఆ పార్టీకి వస్తుందని, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇది అవసరమా? అన్న ప్రశ్న కూడా కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నేతల నుంచి వినిపిస్తుంది. బీజేపీ నేతలు చెబుతున్నట్లు ఇందులో సిట్ అధికారుల కానీ, ప్రభుత్వం కానీ సాధించిందేమీ ఉండదని, కాలయాపన కోసమే ఇటువంటి నోటీసులు ఇవ్వడం, పార్టీకి నష్టంకొని తెచ్చుకోవడం ఎందుకని ప్రశనిస్తున్నారు. మొత్తం మీద కేసీఆర్ ను రేపు విచారించినా తేలేది ఏముంటుందో తెలియదు కానీ.. మున్సిపల్ ఎన్నికల్లో దెబ్బ తగలడం ఖాయమన్న వ్యాఖ్యలు గాంధీ భవన్ నుంచే వినిపిస్తుండటం విశేషం.

# మున్సిపల్స్.. ఎవరి లెక్కలు వారివి

**కరీంనగర్ :** తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రభుత్వ పాలనకు రిఫరెండంగానే చూడాలి. ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మున్సిపాలిటీలు, నగరాల్లో కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతుండటంతో అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. అయితే ఎవరికి వారే గెలుపు పై ధీమాగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల తరహా మాత్రం కాదు. ఎందుకంటే పార్టీ సింబల్ మీద జరిగే ఎన్నికలు కావడంతో ఖచ్చితంగా పరిపాలన పై ప్రజా తీర్పు ఎలా ఉందన్నది స్పష్టంగా తెలుస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో గుర్తులుండవు కాబట్టి..ఎవరు గెలిచినా తమ వారిగా వారు చెప్పుకుంటారు. అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ మున్సిపల్ ఎన్నికలపై భారీ ఆశలు పెట్టుకుంది. పట్టణాల్లో పేదలతో పాటు తాము గత రెండేళ్ల నుంచి చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి తమను గట్టెక్కిస్తాయని నమ్ముతుంది. మరొకవైపు మరో మూడేళ్లు అధికారంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఉండటంతో తమ నగరాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ కే ఓటేయడమని ప్రజల ఆలోచన ఉంటుందని హస్తం పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో పాటు క్యాడర్ కూడా గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తుందని, అలాగే పట్టణ ఓటర్లు విజ్ఞతతో ఓటేస్తారని, అందుకే కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు పై ధీమాగా ఉంది. తమ నాయకత్వాన్ని కూడా పకడ్బందీగా రంగంలోకి దించింది. ఇక బీఆర్ఎస్ నాయకత్వం కూడా మున్సిపల్ ఎన్నికల్లో తమను ప్రజలు ఆదరిస్తారని భావిస్తుంది. పట్టణ ఓటర్లు చాలా తెలివిగా వ్యవహరిస్తారని, గత రెండేళ్లుగా ప్రభుత్వం వ్యవరిస్తున్న తీరుతో పాటు అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు ప్రజల్లో పనిచేస్తాయని అంచనా






వేస్తుంది. విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో తమకు తిరుగులేని ఆధిపత్యం దొరుకుతుందని భావిస్తుంది. మరొకవైపు పట్టణాల్లో తమకు తొలి నుంచి ఉన్న పట్టు ఖచ్చితంగా విజయావకాశాలను మెరుగు పరుస్తుందని చెబుతున్నారు. అయితే ఎలక్షనీరింగ్ చేయడమే ప్రధానమని, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే అతి పెద్ద టాస్క్ అని కారు పార్టీ నేతలు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. బీజేపీ కూడా ఈ మున్సిపల్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకుంది. బీజేపీకి తొలి నుంచి పల్లెల కంటే పట్టణ ఓటర్ల మద్దతు ఎక్కువగా ఉంది. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది పార్లమెంటు నియోజకవర్గాల్లో గెలుపునకు కూడా ప్రధాన కారణం పట్టణ ఓటర్లేనని అంటున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ వెయ్యికి పైగా సర్పంచ్ పదవులను కైవసం చేసుకున్నామని, ఇక పట్టణాల్లో కమలం జోరును ఆపడం ఎవరి తరమూ కాదని ఆ పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. కేంద్ర నాయకత్వం కూడా మున్సిపోల్స్ పై దృష్టి పెట్టి రాష్ట్ర నాయకులను అప్రమత్తం చేసింది.

## తొలి సీఎంగా నయా రికార్డు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి కార్యాలయం ట్వీట్ : ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం తన సోషల్ మీడియా ఎక్స్‌లో ఓ పోస్టు చేసింది. హార్వర్డ్ కెన్నడీ స్కూల్లో జరిగిన 21వ శతాబ్దంలో నాయకత్వం అనే ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు 62 మంది పాల్గొన్న వారు కోర్సును విజయవంతంగా పూర్తి చేయడంతో ముగిసిందని పేర్కొంది. ఈ కోర్సులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతిరోజూ పలు సెషన్లతో కూడిన విస్తృత విద్యా కార్యకలాపాలు జరగాయని తెలిపింది. ఈ కోర్సులో నిర్మాణాత్మక చర్చలు, బృంద చర్చల ద్వారా లీడర్‌షిప్, పరిపాలన, అధికారం పరిపాలన అంశాలపై చర్చ జరిగిందని పేర్కొంది. కోర్సు పూర్తయిన అనంతరం పాల్గొన్న వారికి హార్వర్డ్ ప్రొఫెసర్లు సర్టిఫికెట్లను ప్రదానం చేశారని తన పోస్టులో పేర్కొంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయ సందర్శన సందర్భంగా అక్కడ చదువుతున్న విద్యార్థులతో రేవంత్ రెడ్డి ముచ్చటించారని తెలిపింది.

**హార్వర్డ్‌లో జరిగిన తరగతులకు హాజరైన సీఎం రేవంత్ : సీఎం రేవంత్** రెడ్డి దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్న అనంతరం ఈ నెల 24వ తేదీన అక్కడి నుంచి బయలుదేరి అమెరికా వెళ్లారు. యూఎస్‌లోని మసాచుసెట్స్ రాష్ట్రం కేంబ్రిడ్జ్ నగరంలో ఉన్న హార్వర్డ్ కెనెడీ స్కూల్‌లో రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా తరగతులకు హాజరయ్యారు. పలు ఎసైన్‌మెంట్లు పూర్తి చేసి, హోంవర్క్‌లు సమర్పించి, గ్రూప్ డిస్కషన్‌లు, ప్రాజెక్టుల్లో ఆయన భాగస్వామ్యమయ్యారు. ఈ కార్యక్రమంలో 20 దేశాలకు చెందిన నాయకులు, విధాన నిర్ణేతలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా వివిధ దేశాలు, కాలాలు, చరిత్రలోని కీలక సంఘటనలపై ఆధారపడిన కేస్ స్టడీస్‌ను విశ్లేషిస్తూ వాటికి పరిష్కారాలను రూపొందించి తరగతుల్లో విద్యార్థులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి అధికారిక సర్టిఫికెట్‌ను అందుకున్నారు. 'పదవిలో ఉన్న భారతదేశానికి చెందిన ముఖ్యమంత్రుల్లో హార్వర్డ్ నుంచి నాయకత్వ కోర్సులో సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచారని' ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

**హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సీఎం**

అమెరికాలోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్ (హెచ్‌బీఎస్)లో చదువుతున్న ఇండియన్ విద్యార్థులతో రేవంత్‌రెడ్డి గురువారం సమావేశమయ్యారు. ఆ విశ్వవిద్యాలయానికి చెందిన కెనడీ స్కూల్‌లో ప్రత్యేక కోర్సులో శిక్షణ పొందేందుకు వెళ్లిన ఆయనను హెచ్‌బీఎస్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థుల బృందం ఆహ్వానించింది. తన తరగతులు, ఎసైన్‌మెంట్లు పూర్తయిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను కలిసి ముచ్చటించారు. ఏ రాష్ట్రం నుంచి వచ్చారు? ఏయే కోర్సులు చదువుతున్నారు? ఈ విశ్వవిద్యాలయన్నే ఎందుకు ఎంచుకున్నారు? ఇక్కడ కెరీర్ మార్గాలు, ఎదురవుతున్న సవాళ్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు వృత్తిపరమైన సమస్యలతో పాటు తన విజయానికి సోపానాలను రేవంత్ రెడ్డి వారికి వివరించారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాన్ని, ముఖ్యాంశాలను విద్యార్థులతో పంచుకున్నారు. తమ పరిచయాలు, ప్రతిభను ఉపయోగించి దేశాభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్, తెలంగాణలో అవకాశాలను, వనరులను సద్వినియోగం చేసుకోవడానికి బ్రాండ్ అంబాసిడర్లుగా పని చేయాలని రేవంత్ రెడ్డి వారిని కోరారు.

## కేసీఆర్ అభ్యర్థనను తిరస్కరించిన సిట్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. విచారణకు హాజరు కావాలని మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ 160 సీఆర్పీసీ కింద మరోసారి నోటీస్ ఇవ్వాలని ప్రత్యేక దర్యాప్తు బృందం నిర్ణయించింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో విచారణ చేయనున్నట్లు సమాచారం. విచారణకు రావాలని గురువారమే సిట్ నోటీసు ఇవ్వగా కేసీఆర్ వెంటనే స్పందించి ప్రత్యుత్తరం పంపారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో తలమునకలై ఉన్నందున మరో తేదీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అందుకు సుముఖత వ్యక్తం చేసిన సిట్ ఇవాళ రెండో విడత నోటీసు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. తనను ఎర్రవల్లిలోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించింది. కేసీఆర్ విజ్ఞప్తిపై సిట్ అధికారులు న్యాయసలహా కూడా తీసుకున్నారు. నందినగర్‌లోని ఆయన నివాసంలోనే విచారించాలని సిట్ అధికారులు నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## తెలంగాణలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారుల వద్ద సమర్పించారు. సాయంత్రం ఐదు గంటల వరకు కార్యాలయంలో ఉన్న అభ్యర్థుల నామినేషన్లను అధికారులు స్వీకరించారు. రేపు నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఈ సందర్భంగా నామినేషన్ రిజెక్ట్ అయిన అభ్యర్థులకు రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 1న రిజెక్ట్ పై అప్పీల్ చేసుకున్న అభ్యర్థుల కేసులను ఫిబ్రవరి 2న అధికారులు పరిశీలించనున్నారు. ఫిబ్రవరి 3వ తేదీ నాటికి ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుంది. అదే రోజున తుది అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు ప్రకటించనున్నారు. దీంతో ఎన్నికల పోరాటంలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా స్పష్టతకు వస్తుంది. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. అదే రోజున ఓట్ల లెక్కింపు కూడా చేపట్టనున్నారు. ఈ ఎన్నికల ఫలితాలతో మున్సిపల్ రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమే

-మొదటిపేజీ తరువాయి

చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు.

## తెలంగాణలో వ్యవసాయం భేష్...

**హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలంగాణ వ్యవసాయ రంగం సాధించిన ప్రగతి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2014 నుంచి 2023 మధ్యలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి విస్తీర్ణం.. ప్రస్తుతం 2.21 కోట్ల ఎకరాలకు చేరుకోవడం గమనార్హం. కేవలం తొమ్మిదేళ్లలోనే దాదాపు కోటి ఎకరాల అదనపు భూమి సాగులోకి రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు ప్రధాన కారణంగా నిలిచాయి. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మరియు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు భూగర్భ జలమట్టాన్ని పెంచి, బీడు భూములను సైతం పచ్చని పొలాలుగా మార్చాయి. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా ఆర్థిక సర్వే నివేదికలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం ఊహించని రీతిలో పెరగడం విశేషం. సాగు విస్తీర్ణం పెరగడమే కాకుండా.. రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు సర్వే స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అంటే.. 2014 నుంచి 2023 మధ్య వరకు రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం కేవలం 1.31 కోట్ల ఎకరాలుగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా 2.21 కోట్ల ఎకరాలకు చేరుకుందని సర్వేలో పేర్కొన్నారు. అంటే దాదాపు ఒక కోటి ఎకరాల అదనపు భూమి కొత్తగా సాగులోకి వచ్చింది. ఇది దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా నమోదైన అతిపెద్ద వృద్ధిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సాగు విస్తీర్ణం ఇంతలా పెరగడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బహుళార్థసాధక ప్రాజెక్టులు, జలవనరుల నిర్వహణ ప్రధాన కారణాలుగా ఆర్థిక సర్వే పేర్కొంది. అందులో ఒకటి మిషన్ కాకతీయ.. గ్రామాల్లోని చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది.

ధర్మఘంట


# 30 నిమిషాలు ఇలా నడిస్తే శరీరంలో జరిగే మార్పులు ఊహించలేరు



మనమందరం ఏదో ఒక సమయంలో అనుకుంటాం..నేను రేపు ఖచ్చితంగా జిమ్‌కి వెళ్తాను, లేదంటే వ్యాయామం చేస్తాను అని. కానీ ఉదయం నిద్రలేమి, చలి వాతావరణం, అత్యవసర పనులు లేదంటే, మరితనం కారణంగా ఆ వాయిదా వేయబడుతుంది. అటువంటి పరిస్థితిలో ఒక సులభమైన మార్గం ఉంది..జిమ్‌ను వదిలేసి నడవడం ప్రారంభించండి. కానీ గుర్తుంచుకోండి, ఇది కేవలం తీరికగా నడవడం కాదు. మీరు నిజంగా దాని ప్రయోజనాలను కోరుకుంటే, మీరు ప్రతిరోజూ గంటకు సుమారు 5 కిలోమీటర్ల వేగంతో 30 నిమిషాలు నడవాలి. ఇది కేవలం నడవడం మాత్రమే కాదు, సరిగ్గా నడవడం కూడా ముఖ్యం. చాలా మంది నేను రోజంతా నడుస్తాను అని అంటారు. కానీ ఇంటి పనులు చేయడం, దుకాణానికి వెళ్లడం లేదా ఆఫీసు చుట్టూ తిరగడం వ్యాయామం కాదు. ఫిట్‌నెస్ నడక భిన్నంగా ఉంటుంది. ఇందులో కొంచెం వేగవంతమైన వాకింగ్, లోతైన శ్వాస, శరీరం వెడెక్కాల్సి ఉంటుంది. గంటకు 5 కి.మీ వేగంతో నడవడం వల్ల హృదయ స్పందన రేటు సరైన స్థాయికి పెరుగుతుంది. ఇది మధ్యస్థ స్థాయి. ఇక్కడ శరీరం కొవ్వును కాల్చడం, శక్తిని పెంచడం ప్రారంభిస్తుంది. ఇది కేవలం నడవడం మాత్రమే కాదు, సరిగ్గా నడవడం కూడా ముఖ్యం. చాలా మంది నేను రోజంతా నడుస్తాను అని అంటారు. కానీ ఇంటి పనులు చేయడం, దుకాణానికి వెళ్లడం లేదా ఆఫీసు చుట్టూ తిరగడం వ్యాయామం కాదు. ఫిట్‌నెస్ నడక భిన్నంగా ఉంటుంది. ఇందులో కొంచెం వేగవంతమైన వాకింగ్, లోతైన శ్వాస, శరీరం వెడెక్కాల్సి ఉంటుంది. గంటకు 5 కి.మీ వేగంతో నడవడం వల్ల హృదయ స్పందన రేటు సరైన స్థాయికి పెరుగుతుంది. ఇది మధ్యస్థ స్థాయి. ఇక్కడ శరీరం కొవ్వును కాల్చడం, శక్తిని పెంచడం ప్రారంభిస్తుంది. అడపాదడపా నడవడం వల్ల ప్రయోజనాలను తగ్గిస్తుంది. మీరు 30 నిమిషాలు బయట ఉండి, మధ్యలో మీ ఫోన్ చూసుకున్నారనుకుందాం, ఎవరితోనైనా మాట్లాడటానికి ఆగినారనుకుందాం లేదా ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఎక్కువసేపు వేచి ఉన్నారనుకుందాం, అప్పుడు శరీరం చేసిన కృషి మళ్లీ మళ్లీ రీసెట్ అవుతుంది. ఫిట్‌నెస్ కోసం స్థిరమైన కదలిక చాలా అవసరం. మీరు ఆగకుండా కదిలినప్పుడు, మీ గుండె, ఊపిరితిత్తులు, కండరాలు ఒక లయలో పనిచేస్తాయి. ఈ స్థిరత్వం నిజమైన ప్రయోజనాలను అందిస్తుంది. మీ వేగం సరైనదని ఎలా అర్థం చేసుకోవాలి?: దీని గురించి పెద్దగా సాంకేతికంగా ఆలోచించాల్సిన అవసరం లేదు. ఒక సాధారణ నియమాన్ని గుర్తుంచుకోండి. మీరు 30 నిమిషాల్లో 2.5 కిలోమీటర్లు నడిస్తే, మీ వేగం సరైనది. ఈ వేగంతో, మీ శరీరం ఐదు నిమిషాల తర్వాత చురుగ్గా అనిపించడం ప్రారంభిస్తుంది. సరైన స్థలం, సరైన సమయాన్ని ఎంచుకోవడం ముఖ్యం. మీరు ప్రతి రెండు నిమిషాలకు ఆపవలసి వస్తే, మీరు వేగాన్ని కోల్పోతారు. కాబట్టి, నడవడానికి ప్రయత్నించండి. ఏదైనా పార్క్, లేదంటే, కాలనీలోని ప్రశాంతమైన వీధి లేదా పొడవైన కాలిబాటను ఎంచుకోండి. ట్రాఫిక్ తక్కువగా ఉన్న సమయాన్ని ఎంచుకోండి. ప్రతిరోజూ ఒకే సమయంలో నడవండి, ఉదాహరణకు ఉదయం లేదా సాయంత్రం. అది మీ దినచర్యలో భాగమైనప్పుడు, సాకులు తగ్గుతాయి. నడుస్తున్నప్పుడు మీ మొబైల్‌ను దూరంగా ఉంచండి. ప్రతి ఫోన్ నోటిఫికేషన్ కోసం వేచి ఉండటం వల్ల మీ వ్యాయామం పాడవుతుంది. అందువల్ల ఫోన్ ని సైలెంట్‌లో పెట్టండి. సమయం చూడటానికి మీ వాచ్ లేదా ఫిట్‌నెస్ బ్యాండ్‌ని చూడండి. మీ నడక తర్వాత కాల్స్ లేదా సందేశాలకు సమాధానం ఇవ్వండి. ఈ 30 నిమిషాలు మీ శరీరానికి, మనసుకు మాత్రమే ఉపయోగపడాలి. జిమ్ కంటే వాకింగ్ ఎందుకు మంచి ప్రత్యామ్నాయం అవుతుంది..? చురుకైన నడక గుండెను బలపరుస్తుంది. బరువును నిర్వహించడంలో సహాయపడుతుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా వేగంగా నడటం వల్ల కేలరీలు బర్న్ అవుతాయి. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఒత్తిడి తగ్గుతుంది. అత్యుత్తమమైన విషయం ఏమిటంటే ఇది సులభం, ఉచితం, ఎక్కడైనా చేయవచ్చు.

## పల్లీలు తిన్న వెంటనే నీళ్లు తాగితే..

## నిజంగా ఆ సమస్యలు వస్తాయా?



పేదవాడి బాదంగా పిలువబడే వేరు శనగలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. చూడ్డానికి చిన్నగానే ఉన్న పోషకాలు మాత్రం పుష్కలంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల మన శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇది అందరికీ తెలిసిన విషయమే. కానీ వీటిని తినే విషయంలో చాలా మందికి అనేక అపోహలు ఉన్నాయి. అదేంటంటే వేరుశెనగ తిన్న వెంటనే నీరు తాగడం వల్ల దగ్గు వస్తుందని చాలా మంది నమ్ముతారు. సాధారణంగా ఏవైనా తిన్న వెంటనే నీరు తాగడం చాలా మంది అలవాటు. అలానే పల్లీలు తిన్న తర్వాత కూడా చాలా మంది నీరు తాగుతూ ఉంటారు. అయితే ఆరోగ్యవంతులైన వ్యక్తులు వేరుశనగ తిన్న తర్వాత నీరు తాగితే ఎలాంటి దగ్గు సమస్య ఉండదని నిపుణులు చెబుతున్నారు. వేరుశనగకు దగ్గుతో నేరుగా సంబంధం లేదని వైద్యులు అంటున్నారు. వేరుశనగలో ప్రోటీన్, కొవ్వు అధికంగా ఉండటం వల్ల, వాటిని తిన్న వెంటనే ఎక్కువ నీరు తాగడం వల్ల కొంతమందిలో ఉబ్బరం, గ్యాస్ లేదా అజీర్ణం వంటి సమస్యలు కనిపించొచ్చని అంటున్నారు. కానీ ఈ విధంగా నీరు తాగడం వల్ల శరీరానికి హాని జరగదు. దగ్గు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు అంటున్నారు. అయితే వేరుశెనగలు ఎక్కువగా తినడం వల్ల బరువు పెరుగుతుంది. ఉప్పు కలిపి శనగలు ఎక్కువగా తినడం వల్ల రక్తపోటు సమస్యలు వస్తాయి. అలాగే, ఖాళీ కడుపుతో ఎక్కువగా తినడం వల్ల గ్యాస్ సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. కాబట్టి సరైన సమయంలో మితంగా వేరుశెనగలు తినడం చాలా మంచిదని చెబుతున్నారు.

## సోంపు ఇలా తీసుకుంటే లక్షలు ఆదా చేసినట్టే..!



సోంపు నోటికి ఎంత రుచికరంగా ఉంటుందో శరీరానికి అంతే ఆరోగ్యంగా ఉంటుంది. చాలా మంది ప్రజలు తరచుగా భోజనం తర్వాత దీనిని తింటారు. కానీ, సోంపూ నీటిని తాగితే రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చని మీకు తెలుసా.? ఇది ఆరోగ్యకరమైన మార్నింగ్ డ్రింక్‌గా ఉపయోగపడుతుంది. హైడ్రేషన్: సోంపు నీరు చాలా రుచికరంగా ఉంటుంది. అంతేకాదు.. ఇది హైడ్రేషన్ పెంచుతుంది. శీతాకాలంలో తరచూగా దాహం తగ్గుతుంది. ఇది డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. సోంపు నీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల మీ శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. జీర్ణక్రియ: ఈ రోజుల్లో కడుపు సమస్యలు సర్వసాధారణం. సోంపు గింజలలో కనిపించే అనెథోల్ జీర్ణ రసాలు, ఎంజైమ్‌ల స్రావాన్ని ప్రేరేపిస్తుంది. సోంపు నీటిని క్రమం తప్పకుండా తాగడం ద్వారా, మీరు ఉబ్బరం తగ్గించి అజీర్ణం వంటి సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. హార్మోన్ల సమతుల్యత: సోంపు గింజల్లో ఫైటోఈస్ట్రోజెన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హార్మోన్లను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. హార్మోన్ల సమతుల్యత బుతు లక్షణాలను తగ్గిస్తుంది. పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మానసిక స్థితి మార్పులను స్థిరీకరిస్తుంది. బరువు : బరువు తగ్గాలనుకునే వారికి, ఫెన్నెల్ నీరు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది శరీర జీవక్రియను పెంచుతుంది. అదనపు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. ఫెన్నెల్ నీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల ఆకలిని నియంత్రించవచ్చు, మీ బరువును అదుపులో ఉంచుకోవచ్చు. సోంపు వాటర్ ర్మం, జుట్టు కోసం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ నీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని టాక్సిన్లను తొలగిస్తాయి. ఇది చర్మానికి మెరుపును ఇస్తుంది. జుట్టుకు బలాన్ని అందిస్తుంది.

## రోజూ గ్లాస్ ఆరెంజ్ జ్యూస్ తాగితే శరీరంలో జరిగే మార్పులు



ఆరెంజ్ జ్యూస్ తాగడం వల్ల మన ఆరోగ్యానికి అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఇది తక్షణ శక్తిని అందించడంలో సూపర్‌గా పనిచేస్తుంది. అందుకే చాలా మంది ఈ జ్యూస్‌ను తాగేందుకు ఇష్టపడుతారు. నారింజ రసాన్ని తాగేందుకు చాలా మంది ఇష్టపడుతారు. ఎందుకంటే ఇది ఉప్పుగా, తీపిగా రుచికి చాలా అద్భుతంగా ఉంటుంది. అలాగే తక్షణ శక్తిని కూడా అందిస్తుంది. అయితే కొన్నాళ్లుగా చాలా మంది వెల్నెస్ ఔత్సాహికులు ఈ జ్యూస్‌ను పక్కపెట్టారు. ఎందుకంటే జ్యూస్‌లు అనేవి రిఫ్రెషింగ్‌గా ఉన్నప్పటికీ, మొత్తం పండ్లు అందించే ప్రయోజనాలను మాత్రం ఇవ్వలేవు. జ్యూస్ చేసే క్రమంలో మనం పండ్ల తొక్క, గుజ్జును తొలగించడం వల్ల వాటిలో ఉండే ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లను కోల్పోతాము. అలా ఫైబర్ లేని జ్యూస్ తాగినప్పుడు రక్తంలో షుగర్ లెవెల్స్‌లో హెచ్చుతగ్గులు ఏర్పడవచ్చు. అలాగే ఇది ఆకలి పెరగడానికి కారణం కావచ్చు. నిజానికి, వాణిజ్యపరంగా లభించే అనేక పండ్ల రసాలలో రుచిని పెంచేందుకు అదనపు చక్కెరలు యాడ్ చేస్తారు. వీటి కారణంగా ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్‌తో సహా వివిధ ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఒక గ్లాసు నారింజ రసం తయారు చేయడానికి దాదాపు 2-5 నారింజ పండ్లు అవసరం పడుతుంది. దీని నుంచి ఎక్కువ కేలరీల కలిగిన జ్యూస్‌ను తీయవచ్చు. కానీ ఈ జ్యూస్‌లో మొత్తం పండులో ఉండే ఫైబర్, పోషకాలు మాత్రం ఉండవు. అయినప్పటికీ క్రమం తప్పకుండా నారింజ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటును తగ్గించడం, శరీరంలో మంటను తగ్గించడం, గుండె ఆరోగ్యాన్ని పెంచడం గుండె జబ్బులు, మధుమేహం, అనేక దీర్ఘకాలిక అనారోగ్యాలు చాలా వరకు ఆక్సీకరణ ఒత్తిడి కారణంగా వస్తాయి. అయితే 100 శాతం ఆరెంజ్ జ్యూస్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు ఇంటర్‌లుకిన్-6 వంటి తక్కువ స్థాయి శోథ మార్కర్లతో సంబంధం కలిగి ఉండి.. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. అధిక కొలెస్ట్రాల్ లేదా ట్రైగ్లిజరైడ్స్ ఉన్న వ్యక్తులపై చేసిన ఒక ప్రయోగంలో 90 రోజుల పాటు ఆరెంజ్ జ్యూస్ తీసుకోవడం వల్ల యాంటీఆక్సిడెంట్ సామర్థ్యం పెరిగి, లిపిడ్ పెరాక్సిడేషన్ తగ్గింది. ఈ యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ప్రభావాలు రక్త నాళాలను రక్షించడంలో సహాయపడతాయి. అలాగే హృదయ, జీవక్రియ వ్యాధుల దీర్ఘకాలిక ప్రమాదాన్ని తగ్గిస్తాయి.



## సంతాన సామర్థ్యాన్ని పెంచే పండ్లు

ఉరుకులు పరుగులు ఆధునిక జీవితంలో చాలా మంది ఫెర్టిలిటీ సమస్య (సంతానలేమి)తో బాధపడుతున్నారు. చాలామంది పెళ్లైన కొన్నేకు కూడా పిల్లలు కలగకపోవడం.. లేదా ఇతర అనారోగ్య సమస్యలు.. లాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.. అయితే.. కొన్ని సహజ సిద్ధమైన పండ్లతో కూడా స్టామినాను పెంచుకోవచ్చని.. వంధత్వాన్ని దూరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉరుకులు పరుగులు ఆధునిక జీవితంలో చాలా మంది ఫెర్టిలిటీ సమస్య (సంతానలేమి)తో బాధపడుతున్నారు. చాలామంది పెళ్లైన కొన్నేకు కూడా పిల్లలు కలగకపోవడం.. లేదా ఇతర అనారోగ్య సమస్యలు.. లాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.. ఫెర్టిలిటీ అంటే పిల్లలను కనే సహజ సామర్థ్యం.. సంతానలేమి (ఇన్ ఫెర్టిలిటీ) అంటే.. పెళ్లైన ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు గర్భనిరోధక సాధనాలు వాడకుండా క్రమబద్ధమైన శారీరక కలయిక ఉన్నపటికీ గర్భం దాల్చకపోవడం.. ఇది స్త్రీ లేదా పురుషులలో.. లేదా ఇద్దరిలో ఏదో ఒక లోపం ఉండవచ్చు.. వయస్సు, వంధత్వం, జీవనశైలి, ఆహారం, వైద్య పరిస్థితులు సంతానోత్పత్తిని ప్రభావితం చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.. వంధత్వంతోపాటు.. పురుషులలో వీర్యకణాల లోపం, స్త్రీలలో అండాల ఉత్పత్తి లోపం వంటివి ప్రధాన కారణాలని చెబుతున్నారు. అయితే.. కొన్ని సహజ సిద్ధమైన పండ్లతో కూడా స్టామినాను పెంచుకోవచ్చని.. వంధత్వాన్ని దూరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్లతో ఫెర్టిలిటీ సామర్థ్యం పెరుగుతుందని పేర్కొంటున్నారు. అవకాడో: ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ ఇ, ఫోలేట్‌తో నిండి ఉంటుంది.. ఇది అండాల నాణ్యతను, స్పెర్మ్ నాణ్యతను మెరుగు చేస్తుంది.బ్లూ బెర్రీస్: వీటిలోని ఆంథోసైనిన్ వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు.. ఫ్రీ రాడికల్స్ నుంచి గర్భాశయం, శుక్రకణాలను రక్షిస్తాయి.దానిమ్మ: విటమిన్ సీ, ఫోలేట్ వంటి పోషకాలతో టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచి, స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరుస్తుంది.నారింజ: విటమిన్ సీతో నిండి, శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తుంది.. ఇంకా శక్తిని పెంచుతుంది.అరటిపండు: విటమిన్ ః6 వల్ల హార్మోన్ల సమతుల్యాన్ని ఉంచి సంతాన ఆరోగ్యానికి సహాయపడుతుంది.కివీ: కివీలోని విటమిన్ సీ, ఈ.. శరీరంలో ఫెర్టిలిటీకి అవసరమైన పోషకాలను అందిస్తాయి..జామపండు: పోషకాలతో నిండి ఉన్న జామ.. అండాలు, స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. స్ట్రాబెర్రీస్: యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండి శరీరంలోని ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి ఫెర్టిలిటీని మెరుగుపరుస్తాయి.టమాటా: లైకోపీన్‌తో నిండి ఉంది.. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పని చేసి స్పెర్మ్ నాణ్యతకు మేలు చేస్తుంది. ఈ పండ్లు సంతాన సామర్థ్యాన్ని పెంచుతాయి.. అయితే.. ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహారం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం, సరైన సమయంలో వైద్యులను సంప్రదించడం ద్వారా సంతానోత్పత్తిని కాపాడుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఏమైనా సమస్యలుంటే.. ఆరోగ్య నిపుణులను సంప్రదించి వారు చెప్పిన విధంగా చికిత్స పొందడం ఉత్తమం..

# మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి






**నోడల్ ఆఫీసర్లు,స్పెషల్ ఆఫీసర్లు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలి**

**జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు**

**జగిత్యాల :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నోడల్ అధికారులకు,ప్రత్యేక అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు పేర్కొన్నారు. శుక్రవారం రోజున కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎక్స్పెండీచర్ అబ్జర్వర్ డి. శ్రీనివాస్ లతో పాల్గొని రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై జిల్లా నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు మరియు మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు నోడల్ అధికారుల, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్ లు, ఇతర ఎన్నికలకు కేటాయించిన అధికారులందరు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో కలిసి పని చేసి మన జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత పారదర్శకంగా జరిగే విధంగా అందరు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలంటే నోడల్ అధికారుల, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్ లు, ఇతర ఎన్నికలకు కేటాయించిన అధికారులందరు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు చాలా ముఖ్యమైన అంశమని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థులు అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల వంటివి అన్నికూడా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి అధికారులతో సమన్వయం చేసుకొని అన్ని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి ఐపిఎస్, జిల్లా నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

**లలితమాత ఆలయ ఫౌండరీ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప**

**సహస్ర లింగాల దేవాలయంలో పంచామృతాభిషేకం**



**జగిత్యాల :** ప్రతి ఒక్కరు దేవాలయాలను సందర్శించి, భక్తిభావాన్నీ పెంపోందించుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని లలితమాత ఆలయ ఫౌండరి చైర్మన్ చెల్లం స్వరూప అన్నారు. పొలాస లలితామాత ఆలయం,జగిత్యాల పట్టణ సమీపం లోనిశ్రీ సూర్య ధన్వంతరి ఆలయాల్లో శుక్రవారం సుహాసినీలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు.జగిత్యాల పట్టణ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో శుక్రవారం పర్వది నాన్ని పురస్కరించుకొని, మాతలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్థోత్ర పారాయణం గావించారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు.కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం అందించి ఆలయ పూజారి ఆశీర్వచనములతో సత్కరించారు. జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని శ్రీ చక్ర సహిత లలితామాత ఆలయంలో ఫౌండరి ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప ఆధ్వర్యంలో మహిళలు లలితా సహస్రణామ పారాయణం చేసి, శ్రీ చక్రాలకు కుంకుమ పూజలు చేయగా చెల్లం స్వరూప మరకత శ్రీ చక్రానికి భక్తి శ్రద్ధాలతో కుంకుమ పూజ చేశారు.అనంతరం అన్నప్రసాధ వితరణ చేశారు.పొలాసలోని సహస్ర లింగాల దేవాలయ 11 వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.శనివారం తో కార్యక్రమాలు ముగుస్తాయని శుక్రవారం ఉత్సవ మూర్థులకు పంచామృతా భిషేకం లో పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారని ఆలయ నిర్వాహకులు నలమాస గంగాధర్ తెలిపారు. అనంతరం అర్చకులు హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమ ములో పొలాస ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ చెల్లం సత్తయ్య, చెట్ల జానకి,వొడ్న శ్రీనివాస్, వడ్లగట్ట రాజన్న ఉటూరి కళ్యాణి, హరిత, ఉటూరి అర్చన,వనజ, మహేందర్,అర్చకులు అజయ్, లత, శ్వేత,ఉషారాణి, రమ్య, స్మిత రాణి, భీమేశ్వరి, యశోద, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్ సేఫ్టీపై రెండో రోజూ హైడ్రా తనిఖీలు

**జీహెచ్ ఎంసీతో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా చర్యలు**

**6 షాపులను సీజ్ చేసిన అధికారులు**

**హైదరాబాద్ :** అగ్ని ప్రమాదాల నేపథ్యంలో ఫైర్ సేఫ్టీపై రెండో రోజూ శుక్రవారం కూడా తనిఖీలు కొనసాగాయి. జీహెచ్ఎంసి, హైడ్రా, ఫైర్, విద్యుత్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. ఫైర్ నిబంధనలను పట్టించుకోకుండా షాపులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు. సెల్లార్లను గోదాములుగా మార్చడాన్ని అధికారులు సీరియస్గా పరిగణిస్తున్నారు. కెమికల్, పెయింట్ డబ్బాలు నిలువ ఉంచడం, ఫర్నీచర్ తయారీ సామగ్రీతో పరిసరాలు నిండి ఉండడాన్ని అధికారులు గమనించారు. భవన అనుమతులు, ఫైర్ ధ్రువీకరణ పత్రాలు(ఫైర్ ఎన్వోసీలు) లేకపోవడాన్ని పలు భవనాల్లో గుర్తించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మానవ ప్రమేయం లేకుండా.. ఆటోమేటిక్గా పని చేసే వాటర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్లు లేకపోవడం.. ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కానరాని పరిస్థితుల నేపథ్యంలో నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 6 షాపులను అధికారులు సీజ్ చేశారు. షాపులుంటున్న భవనాలను గోదాములుగా మార్చరాదని చెబుతూ వస్తోంది. గోదాములు వేరే చోట పెట్టుకుని.. షాపుల్లో ఫర్నీచర్ ప్రదర్శన, అమ్మకాలు మాత్రమే ఉండేలా చూడాలని హైడ్రా చెబుతూ వస్తోంది.



**ఆరు ఫర్నీచర్ షాపులను సీజ్ చేసిన అధికారులు**

గచ్చిబౌలిలోని లుకింగ్ గుడ్ ఫర్నీచర్ షాప్ బిల్డింగ్ ను అధికారులు సీజ్ చేసిన అధికారులు. సెల్లార్లల్లో అగ్నిప్రమాదానికి ఆస్కారం ఉండే నిలువలు ఉంచినట్టు నిర్ధారించారు. పెయింట్ డబ్బులు, పరుపులు, బ్యాటరీలు, పెద్ద మొత్తంలో నిలువ ఉంచినట్టు గుర్తించారు. అనుమతి లేని భవనం తోడు ఫైర్ అనుమతులు కూడా లేని పరిస్థితి. సెల్లార్ల ర్యాంపులు మూసేసి స్టాక్ తో నింపినట్టు గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఇదే పరిస్థితి కొంపల్లి క్రాస్ రోడ్స్ లోని అను ఫర్నిచర్ షో రూంలో కూడా నెలకొంది. కూకట్పల్లితో పాటు అత్తాపూర్లోని పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వేలో ఉన్న రోయల్ ఓక్ ఫర్నీచర్ షాపులు కూడా నిలువలు ప్రమాదకరంగా సెల్లార్లలో నింపేయడంతో అధికారులు సీజ్ చేశారు. ఉప్పల్ నాగోల్లోని బాంటియా ఫర్నీచర్ షోరూం, నాచారంలోని అను ఫర్నీచర్ షోరూంను సీజ్ చేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ షాపుల పరిసరాలు ఫైర్ సేఫ్టీ లేని ప్రాంతంగా పేర్కొంటూ బోర్డులు పెట్టారు.

## పెన్షనర్స్ మరణాలు -రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

ధర్మ ఘంట జనవరి 30,సూర్యాపేట

రాష్ట్ర ప్రభుత్వానికి మూడు నుండి నాలుగు దశాబ్దాలపాటు సేవలందించిన వేలాది మంది పెన్షనర్లు, 2021 మార్చి తరువాత స్వచ్చంద ఉద్యోగ విరమణ పొందిన వారు,మరణించినవారు అలాగే 2024 మార్చి నుండి రిటైర్ అయిన ఉపాధ్యాయులుఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిలు అందక తీవ్ర ఆర్థిక, ఆరోగ్య, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పిల్లల పెళ్లిళ్లు చేయలేక, ఇంటి లోన్స్ మరియు ఇతర అప్పులు తీర్చలేక, అవసరమైన వైద్య చికిత్సలు పొందలేక, నెలనెలా వచ్చే పెన్షన్ మొత్తాన్ని వడ్డీలకే చెల్లిస్తూ, కుటుంబ నిత్యావసరాలకు డబ్బులు లేక, ఎక్కడా అప్పు దొరకక ఇప్పటివరకు 54 మందికి పైగా పెన్షనర్లు గుండెపోటు, ఆత్మహత్యలతో ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ప్రభుత్వ నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనం. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పెన్షనర్స్ బకాయిలను విడుదల చేసి, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు పెన్షనర్స్ బకాయిలు, డిఎలు, పిఆర్సీ వంటి ప్రయోజనాలను సమయానికి చెల్లిస్తోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా పెన్షనర్స్కు రావాల్సిన బకాయిలను ఆలస్యం చేయకుండా చెల్లిస్తున్నాయి. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొండి వైఖరిని అవలంబిస్తూ, తప్పుడు ప్రకటనలు చేస్తోంది. నెలనెలా 700 కోట్లు పెన్షనర్స్కు ఇస్తున్నామని చెప్పడం వాస్తవానికి దూరం. అందులో కనీసం వంద కోట్లు కూడా పెన్షనర్స్ బకాయిలుగా అందడం లేదు.



పెన్షనర్స్, ఉద్యోగులను కావాలనే ఇబ్బంది పెడితే దాని ఫలితం ఏమిటో ప్రభుత్వం తెలుసుకోవాలి. అందుకు బాధితులు, వారి బంధుమిత్రులు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 100% ఓటింగ్ ద్వారా తమ శక్తిని చాటాలని కోరుతున్నాము. సేవలు చేయించుకొని బకాయిలు చెల్లించని ప్రభుత్వానికి పెన్షనర్స్ కుటుంబాల ఆవేదన అర్థమయ్యేలా చేయాలి. నేటి పెన్షనర్స్ కూడా నిన్నటి వరకు సంఘాల నాయకులే అన్న విషయాన్ని నేటి సంఘ నాయకులు మరవకూడదు. నేటి ఉద్యోగులు రేపటి పెన్షనర్స్ అన్న విషయాన్ని గుర్తుంచుకొని, ప్రభుత్వం పెన్షనర్స్ బకాయిలు చెల్లించే వరకు ఉద్యోగఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా పోరాడాలని తీకుళ్ళ సాయిరెడ్డి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు.

## సమ్మక్క సారలమ్మల ఆశీర్వాదం తెలంగాణ రాష్ట్రంపై ఉండాలి

**చిలకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్**

**మేడారం సమ్మక్క సారలమ్మల ఆశీర్వాదం పొందిన కార్పొరేటర్**



ధర్మఘంట జనవరి 30 ఉప్పల్

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని,తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండే విధంగా,తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై అమ్మవార్ల ఆశీర్వాదం ఉండాలని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆమె డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి కుటుంబసమేతంగా మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం గీతా ప్రవీణ్ మాట్లాడుతూ మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి,ఆదివాసీల ఆత్మ గౌరవాన్ని ఇనుమడింప చేసింది కేసీఆర్ అని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి,ముద్దం శ్రీనివాస్ యాదవ్,చేర్యాల శ్రీనివాస్, బాలకృష్ణ గౌడ్,చిన్న,మహేష్ మొదలగువారు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అనువైన కేంద్రాన్ని చూడాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

ధర్మ ఘంట జనవరి 30, నల్గొండ




మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు గాను అనువైన కేంద్రాన్ని చూడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఉన్న ఎస్ డబ్ల్యూ సి గోదామును మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకై పరిశీలించారు. జిల్లాలో ఎన్నికలు నిర్వహించనున్న 6 మున్సిపాలిటీలు, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఒకే చోట చేపట్టే విధంగా ఓట్ల లెక్కింపు కేంద్రం ఉండాలని ,ప్రతి మున్సిపాలిటీకి ఒక కౌంటింగ్ హాల్ తో పాటు, స్ట్రాంగ్ రూమ్, సీలింగ్ రూమ్ తదితర సౌకర్యాలు ఉండాలని, ఆ విధంగా అధికారులు ఓట్ల లెక్కింపు కేంద్రాలను చూడాలని చెప్పారు.ఆర్జాల బావి ఎస్ డబ్ల్యు సి గోదాం తో పాటు ,ఇంకా ఏవైనా అనువైన భవనాలలో ఓట్ల లెక్కింపుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డిని ఆదేశించారు.ముఖ్యంగా అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపుకు అనువైన విధంగా హాల్స్,పోటీ చేసిన అభ్యర్థులు,ఓట్ల లెక్కింపు సిబ్బంది అందరికీ సౌకర్యంగా ఉండేలా రవాణా సదుపాయం అన్నింటిని దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి ,ఎస్ బ్ల్యుసి రీజనల్ మేనేజర్ వీరమల్లు, మేనేజర్ మురళి ,మున్సిపల్ కమిషనర్ శరత్చంద్ర, స్థానిక తహసిల్దార్ పరశురాం, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## మహాత్మాగాంధీకి ఉప్పల్ ఎమ్మెల్యే ఘన నివాళి

**ఓల్డ్ మల్లాపూర్ లో వర్ధంతి వేడుకలు**

**పాల్గొన్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి**



ధర్మఘంట జనవరి 30 ఉప్పల్:

దేశ స్వాతంత్రం కోసం అహింసా మార్గంలో స్వతంత్ర పోరాటాన్ని నడిపి,రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యపు సంకెళ్ళను తెంచిన మహాత్ముడు,జాతిపిత మహాత్మా గాంధీ అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ నియోజకవర్గం ఓల్డ్ మల్లాపూర్ లో మహాత్మాగాంధీ 78 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహాత్ముని విగ్రహానికి ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశంలోని ప్రతి పౌరుడు గాంధీ చూపిన సత్యాగ్రహం అహింస మార్గాలలో పయనించాలని,గాంధీజీ గురించి ఈ తరం పిల్లలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.గాంధీజీ ఆశయాలైన సత్యం,అహింస, సేవా భావనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని,గాంధీజీ చూపిన మార్గంలో నడుచుకుంటూ సమాజానికి సేవ చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,బస్తి వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### తిరిగి రష్యా చమురు కొనుగోలు చేయనున్న రిలయన్స్



ప్రపంచంలోనే అతిపెద్ద చమురు శుద్ధి కాంప్లెక్స్‌ను నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ మళ్లీ రష్యా చమురు కొనుగోళ్లను ప్రారంభించనుంది. కంపెనీకి చెందిన జామ్‌నగర్‌లోని కాంప్లెక్స్ తిరిగి ఫిబ్రవరి నుంచి రోజుకు 1,50,000 బ్యారెళ్ల రష్యా చమురును కొనుగోలు చేయనుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ గురువారం తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో రష్యాలోని అతిపెద్ద చమురు కంపెనీలైన రోస్‌నెఫ్ట్, లుకాయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో రిలయన్స్ ఈ కంపెనీలతో ఉన్న దీర్ఘకాలిక ఒప్పందాల కింద కొనుగోలు చేయడం కష్టంగా మారింది. రిలయన్స్ ఎగుమతులు, చెల్లింపులు, గ్లోబల్ వ్యాపారంలో సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. దీంతో డిసెంబర్ తర్వాత రిలయన్స్ రష్యా చమురు కొనుగోలు చేయడం నిలిపేసింది. తాజాగా రిలయన్స్ అమెరికా ఆంక్షల కింద లేని రష్యా కంపెనీల నుంచి ముడిచమురు కొనుగోలు చేయనున్నట్టు చెబుతోంది. అయితే, దీనిపై కంపెనీ అధికారికంగా వివరాలను వెల్లడించాల్సి ఉంది. రష్యా చమురు ఇతర దేశాల చమురు కంటే చౌకగా ఉండటంతో కంపెనీ ఆంక్షలకు అనుగుణంగా అమెరికా నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న రష్యా కంపెనీల నుంచి కొనుగోళ్లు నిర్వహించనుంది. ఇక, రష్యా నుంచే కాకుండా సౌదీ అరేబియా, ఇరాక్, కెనడా దేశాల నుంచి కూడా చమురు కొంటోంది. అయితే, పెద్ద రష్యా కంపెనీలపై ఆధారపడటాన్ని తగ్గించే ఉద్దేశ్యంతో వెనిజులా చమురును మళ్ళీ కొనుగోలు చేయాలని కూడా రిలయన్స్ భావిస్తోంది. దీనికోసం అమెరికా ఆమోదం పొందడానికి కూడా ఇది ప్రయత్నిస్తోంది.

### మైక్రోసాఫ్ట్ సంస్థకు రూ.36 లక్షల కోట్ల నష్టం




టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్‌లో భారీ నష్టాలను చవిచూసింది. కొన్ని గంటల్లోనే కంపెనీ వాల్యుయేషన్‌లో 12 శాతం నష్టపోగా, దాని విలువ 400 బిలియన్ డాలర్లకు పైగా పడిపోయింది.భారతీయ కరెన్సీలో ఇది రూ.36 లక్షల కోట్లకు సమానం. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒకే రోజులో ఇది రెండో అతిపెద్ద నష్టంగా నమోదైంది. గత ఏడాది జనవరిలో ఎన్విడియా 593 బిలియన్ డాలర్లను కోల్పోయింది. వాల్యుయేషన్ పతనానికి గ్లోబల్ మార్కెట్ ఒత్తిళ్లు, పెట్టుబడిదారుల లాభాల స్వీకరణ, భవిష్యత్ ఆదాయ అంచనాలపై అనిశ్చితి వంటి అంశాలు కారణమై ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టెక్ రంగంపై పెరుగుతున్న పోటీ కూడా ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. ఈ ఒక్కరోజు నష్టం ఉన్నప్పటికీ, మైక్రోసాఫ్ట్ యొక్క దీర్ఘకాలిక వ్యాపార బలం పటిష్టంగానే ఉందని కొందరు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. రాబోయే త్రైమాసిక ఫలితాలు కంపెనీ షేర్ దిశను నిర్ణయించే కీలక అంశంగా మారనున్నాయి.

# కొత్త రికార్డులతో బంగారం, వెండి దూకుడు

పెట్టుబడిదారుల నుంచి అధిక గిరాకీకి తోడు మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో బంగారం, వెండి ధరలు గురువారం చారిత్రాత్మక గరిష్టాలకు చేరాయి. ఫ్యూచర్ ట్రేడింగ్‌లో కిలో వెండి 6 శాతం పెరిగి రూ. 4 లక్షల మైలురాయిని దాటగా, బంగారం ధర రూ. 1.79 లక్షలుగా నమోదైంది. కొనుగోలుదారుల డిమాండ్ కారణంగా రూ. 11 వేలకు పైగా పెరిగి, పద్ గ్రాముల బంగారం ధర రూ. 1,78,850తో కొత్త గరిష్టాలను నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లోను బంగారం ఫ్యూచర్స్ తొలిసారి ఔన్స్‌కు 5,600 డాలర్ల కీలక మార్కును దాటి 5,627.50 డాలర్లను నమోదు చేశాయి. పారిశ్రామిక డిమాండ్ పెరగటం, అమెరికా డాలర్ బలహీనపడటమే వెండి రికార్డు ధరలకు కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన బంగారం పది గ్రాములు రూ. 11,770 పెరిగి రూ. 1,78,850కి చేరింది. ఆభరణాల తయారీలో ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ. 10,800 పెరిగి రూ.



1,63,950 వద్ద ఉంది. వెండి కిలో ఏకంగా రూ. 25 వేలు పెరిగి రూ. 4.25 లక్షలుగా నమోదైంది. గ్లోబల్ మార్కెట్లో వెండి ఔన్స్ ధర 120.56 డాలర్లుగా ఉంది. గురువారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విడుదల చేసిన ఆర్థిక సర్వేలో దేశ జీడీపీ వృద్ధి 6.8-7.2 శాతంగా ఉంటుందని అంచనా వేయడంతో స్టాక్ మార్కెట్లలో ర్యాలీ కనిపించింది. దీనికి తోడు కీలక ఎల్‌అండ్‌టీ లాంటి బ్లూ-చిప్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు, గ్లోబల్ మార్కెట్లలోనూ ర్యాలీ కొనసాగడం, ఆసియా మార్కెట్ల లాభాలు కొనసాగడం వంటి అంశాల కారణంగా మన మార్కెట్లు వరుసగా మూడో రోజు సానుకూలంగా ముగిశాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 221.69 పాయింట్లు లాభపడి 82,566 వద్ద, నిఫ్టీ 76.15 పాయింట్లు పెరిగి 25,418 వద్ద ముగిశాయి. ఎల్‌అండ్‌టీతో పాటు యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ కూడా లాభపడిన వాటిలో ఉన్నాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడి, ప్రపంచ మార్కెట్లలో రిస్క్-ఆఫ్ సెంటిమెంట్ మధ్య, అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మరోసారి ఆల్-టైమ్ కనిష్ట స్థాయి రూ. 91.92 వద్దకు చేరింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితి, విదేశీ నిధుల ఉపసంహరణ మధ్య రూపాయి ఆల్-టైమ్ ఇంట్రా-డే కనిష్టం రూ. 91.99ని తాకిందని ఫారెక్స్ వ్యాపారులు తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల కూడా రూపాయిపై ఒత్తిడి పెంచాయన్నారు.

# ఐసీఐసీఐ క్రెడిట్ కార్డ్ యూజర్లకు ఫిబ్రవరి 1 నుంచి ఆ సేవలు బంద్




ఈ కొత్త సంవత్సరం 2026లో అప్పుడే జనవరి నెల చివరికి వచ్చేశాం. కొత్త నెల ఫిబ్రవరి మొదలవనుంది. కొత్త నెల అంటే పలు కొత్త రూల్స్ సైతం అమలులోకి వస్తుంటాయి. ఫిబ్రవరి 1, 2026 నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ సైతం తమ క్రెడిట్ కార్డులకు సంబంధించిన పలు నిబంధనలను మార్చుతున్నట్లు తెలిపింది. క్రెడిట్ కార్డు బెనిఫిట్స్‌లో పలు ప్రయోజనాలను ఇకపై ఆపేస్తున్నట్లు తెలిపింది. తమ బ్యాంక్ కార్డుల్లోని వివిధ కేటగిరీ కార్డులపై ఈ కొత్త రూల్స్ ప్రభావం చూపనున్నాయని తెలిపింది. మరి ఆ వివరాలు తెలుసు కుందాం. ఈ కొత్త నిబంధనల్లో భాగంగా ఇప్పటి వరకు ఎం పిక చేసిన కార్డుల ద్వారా అందిస్తున్న బుక్ మై షో కాంప్లి మెంటరీ మూవీ బెనిఫిట్స్ తొలగిస్తున్నట్లు స్పష్టం చేసింది. అయితే, వివిధ కార్డుల ద్వారా ట్రాన్స్‌పోర్ట్, ఇన్సూరెన్స్ చెల్లింపులపై అందించే రివార్డ్ పాయింట్లు కొనసాగుతాయని తెలిపింది. మీ క్రెడిట్ కార్డును సినిమాలు, రోజు వారీ రవాణా లేదా ఇన్సూరెన్స్ పేమెంట్ల కోసం ఉపయోగిస్తే మీకు వచ్చే రివార్డ్ పాయింట్లలో కనిపించనున్నాయని తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్ హెచ్‌పీసీఎల్ సూపర్ సేవర్ క్రెడిట్ కార్డు కస్టమర్లకు రూ.40 వేల వరకు ఇన్సూరెన్స్ పేమెంట్లు చేస్తే రివార్డ్ పాయింట్లు వస్తాయని తెలిపింది. అలాగే రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు ట్రాన్స్‌పోర్ట్ మెర్చంట్ కేటగిరీ ద్వారా ఖర్చు చేస్తే కస్టమర్లకు రివార్డ్ పాయింట్లు లభిస్తాయని తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్ పలు కార్డులపై బుక్ మై షో కాంప్లిమెంటరీ మూవీ బెనిఫిట్స్ తొలగిస్తోంది. ఈ కొత్త రూల్స్ ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ ఇన్‌స్టాంట్ ప్లాటినం చిప్ క్రెడిట్ కార్డు, ఐసీఐసీఐ బ్యాంక్ ఇన్‌స్టాంట్ ప్లాటినం క్రెడిట్ కార్డులపై ఈ బెనిఫిట్ ఆపేస్తున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ వెల్లడించింది. మరోవైపు.. జనవరి 15, 2026 నుంచే కొన్ని నిబంధనలను ఐసీఐసీఐ బ్యాంక్ మార్చింది. అన్ని రకాల రిటైల్ ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఛార్జీలను మార్చింది. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్ ఖర్చులపై ఈ ఛార్జీలను సవరించింది. డ్రీమ్ 11, రమ్మీ కల్చర్, జంగ్లీ గేమ్స్, ఎంపీఎల్ వంటి వాటిపై ఖర్చు చేస్తే 2 శాతం ఛార్జ్ చెల్లించాలని కొత్త రూల్ తెచ్చింది.

### ఆర్‌బిఐ నియామకాలు..




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాన్పూర్ శాఖలో ఖాళీగా ఉన్న మెడికల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి తాజాగా ప్రకటన విడుదల చేసింది. మొత్తం మూడు పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయాలని నిర్ణయించింది. వైద్య రంగంలో అనుభవం ఉండి, కేంద్ర బ్యాంక్‌లో పనిచేయాలనుకునే అభ్యర్థులకు ఇది ఒక మంచి అవకాశమని చెప్పవచ్చు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఓఃబా లేదా జనరల్ మెడిసిన్‌లో పీజీ పూర్తి చేసి ఉండాలి. విద్యా?ర్హతలతో పాటు సంబంధిత విభాగంలో కనీసం కొంత పని అనుభవం ఉండటం తప్పనిసరి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొఫైల్స్ పరిశీలించి, వారి అర్హతల ఆధారంగా షార్ట్ లిస్ట్ చేస్తారు. ఎంపికైన వారికి తదుపరి దశలో వ్యక్తిగత ఇంటర్వ్యూ నిర్వహించి తుది జాబితాను ప్రకటిస్తారు. ఆర్థికంగా ఈ ఉద్యోగం ఆకర్షణీయమైన వేతనాన్ని అందిస్తోంది. ఎంపికైన మెడికల్ కన్సల్టెంట్లకు గంటకు రూ.1,000 చొప్పున గౌరవ వేతనం చెల్లించను న్నారు. పని వేళలు మరియు ఇతర నిబంధనలు బ్యాంక్ నియమావళి ప్రకారం ఉంటాయి. వైద్య సేవలు అందిం చడమే కాకుండా, బ్యాంక్ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలను వీరు పర్యవేక్షించాల్సి ఉంటుంది. కార్పొరేట్ తరహా వాతావరణంలో పనిచేయాలనుకునే డాక్టర్లకు ఇది సరైన వేదిక. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 12వ తేదీ లోపు సమర్పించాలి.

# ప్లే ఆఫ్స్ బెర్తులపై ఉత్కంఠ.. త్రిముఖ పోటీలో ముందంజ వేసేది ఎవరు?

## స్పోర్ట్స్

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో ఆఖరి ఓవర్ థ్రిల్లర్లే కాదు ప్లే ఆఫ్స్ బెర్తులు ఆసక్తి రేపుతున్నాయి. ఆరు విజయాలతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) దర్జాగా ఫైనల్ చేరగా.. చివరి రెండు బెర్తులపై ఉత్కంఠ నెలకొంది. నాకౌట్ దశకు గుజరాత్ జెయింట్స్ అతి చేరువగా ఉండగా.. ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు కూడా ముందంజ వేసే అవకాశాలులన్నాయి. లీగ్ దశలో రెండే రెండు మ్యాచ్‌లు ఉన్నందున ముంబై, ఢిల్లీ, గుజరాత్ మధ్య ప్లే ఆఫ్స్ కోసం త్రిముఖ పోరు ఏర్పడింది. అంచనాలకు అందకుండా సాగుతున్న నాలుగో సీజన్‌లో ఆర్సీబీ ఫైనల్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. చివరి లీగ్ మ్యాచ్‌లో యూపీవారియర్స్‌ను చిత్తు చేసిన స్మృతి మంధాన సేన 12 పాయింట్లతో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. ఇక మిగిలిన నాలుగు జట్లు ప్లే ఆఫ్స్ బెర్తుల కోసం చెమటోడ్చాల్సిందే. చివరి రెండు బెర్తుల కోసం మూడు జట్ల మధ్య పోటీ నెలకొంది. జనవరి 30 శుక్రవారం గుజరాత్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ మ్యాచ్ ఫలితం కీలకం కానుంది.

**గెలిచినా.. ఓడినా**

ప్రస్తుతం 8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన గుజరాత్ జెయింట్స్ ప్లే ఆఫ్స్ బెర్తుకు చేరువలో ఉంది. గత మ్యాచ్‌లో మూడు పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించిన ఆ జట్టు.. చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడిస్తే చాలు. దర్జాగా10 పాయింట్లతో బెర్తు దక్కించుకుంటుంది. ఒకవేళ ముంబై విజయం సాధిస్తే.. 8 పాయింట్లతో ఇరుజట్లు రేసులోనే ఉంటాయిది. అయితే.. చివరి లీగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్ చేతిలో ఢిల్లీ ఓడిందంటే గుజరాత్, ముంబై



నాకౌట్‌కు దూసుకెళ్తాయి.

మూడు విజయాలతో మూడో స్థానంలో కొనసాగుతున్న ముంబై ఇండియన్స్ కాస్త కష్టపడితే ప్లే ఆఫ్స్ చేరడం పక్కా. ఎందుకంటే ఢిల్లీ, యూపీ కంటే ఆ జట్టు రన్‌రేటులో మెరుగ్గా ఉంది. శుక్రవారం గుజరాత్ జెయింట్స్‌తో జరగనున్న మ్యాచ్ హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి కీలకం కానుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే.. 8 పాయింట్లతో ముంబై రేసులో నిలుస్తుంది. జనవరి 26న ఆర్సీబీపై సెంచరీతో గర్జించిన నాట్ సీవర్ బ్రంట్ గుజరాత్‌పైనా చెలరేగాలని ముంబై కోరకుంటోంది. ఒకవేళ గుజరాత్ గెలిస్తే యూపీ చేతిలో ఢిల్లీ ఓడితేనే ముంబైకి అవకాశాలుంటాయి. అలాకాకుండా 50 పరుగుల తేడాతో మ్యాచ్ చేజార్చుకుంటే.. ఢిల్లీ 7 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో యూపీపై ఓటమి చవిచూడాలి. యూపీ జట్టు 116 పరుగుల తేడాతో గెలవకూడదు. అప్పుడు.. నెట్ రన్‌రేట్ పరంగా ముంబై ముందంజ వేస్తుంది.

**యూపీపై గెలిస్తేనే**

వరుసగా నాలుగు ఓటముల తర్వాత అద్భుతంగా పుంజుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. కానీ, జనవరి 27న గుజరాత్ జెయింట్స్ చేతిలో 3 పరుగుల తేడాతో ఓడడం ఆ జట్టు అవకాశాలపై ప్రభావం చూపింది. అయినా సరే గుజరాత్, ముంబై మ్యాచ్‌తో సంబంధం లేకుండా ఢిల్లీ ప్లే ఆఫ్స్ చేరేందుకు ఛాన్సుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై గెలిస్తేనే జెమీమా రోడ్రిగ్స్ నేన ప్లే ఆఫ్స్ చేరుతుంది. ఒకవేళ యూపీ చేతిలో ఓడితే.. గుజరాత్ ధాటికి ముంబై చతికిలపడితే ఆరు పాయింట్లతో ఉత్కంఠ కొనసాగుతుంది. ముంబై, ఢిల్లీ, యూపీలో అప్పుడు నెట్‌రన్ రేటు పరంగా మెరుగ్గా ఉన్న జట్టు ప్లే ఆఫ్స్‌లో అడుగుపెడుతుంది.

**మైనస్ రన్‌రేటు**

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఎలిమినేషన్‌కు దగ్గర్లో ఉన్న జట్టు ఏదంటే అది యూపీ వారియర్స్. గురువారం ఆర్సీబీ చేతిలో ఓటమి యూపీ ప్లే ఆఫ్స్ అవకాశాల్ని దెబ్బతీసింది. ప్రస్తుతం నాలుగు పాయింట్లతో, మైనస్ రన్‌రేటు(-1.146)తో ఉన్న మేగ్ లానింగ్ బృందం ముందంజ వేయాలంటే అద్భుతం జరగాల్సిందే. చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీని భారీ తేడాతో ఓడిస్తే యూపీ 6 పాయింట్లతో పోటీలో నిలుస్తుంది. అయితే.. ముంబై, ఢిల్లీ కంటే రన్‌రేటు ఎక్కువ ఉండాలి. ముంబై జట్టు 50 పరుగుల తేడాతో గుజరాత్ చేతిలో ఓడితే.. ఢిల్లీని 117 రన్స్ తేడాతో యూపీ ఓడించాల్సి వస్తుంది. అప్పుడే ఫిబ్రవరి 3న జరుగబోయే ఎలిమినేటర్ ఆడే అవకాశం దక్కించుకుంటుంది.

### మారథాన్ మ్యాచ్‌లో జ్వెరెవ్ ఓటమి.. ఫైనల్లో అల్కరాస్..!



కొత్త ఏడాదిలో మొదటి గ్రాండ్‌స్లామ్‌లో కార్లోస్ అల్కారాస్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అదరగొడుతున్న ఈ టాప్ సీడ్ పురుషుల సింగిల్స్ సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు చెక్ పెట్టాడు. అలాఅనీ జ్వెరెవ్ అలవోకగా తలవంచలేదు. స్పెయిన్ కెరటానికి ముచ్చెమటలు పట్టించిన అతడు.. ఐదు గంటల 27 నిమిషాల పాటు పోరాడాడు. కానీ, చివరకు క్లాస్ ఆటతో చెలరేగిన అల్కరాస్‌ను విజయం వరించింది. ఓపెన్ ఎరాలో చిన్నవయసులోనే నాలుగు గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్ చేరిన ఆటగాడిగా అల్కరాస్ రికార్డు నెలకొల్పాడు. నిరుడు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోనూ చెమటోడ్చిన అల్కరాస్‌కు ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ రూపంలో కఠిన ప్రత్యర్థి ఎదురయ్యాడు. అప్పుడు సిన్నర్‌ను ఓడించేందుకు ఐదు గంటలు కష్టపడిన అతడు.. జ్వెరెవ్‌ను మట్టికరిపించేందుకు ఐదు గంటల 27 నిమిషాలు తీసుకున్నాడు. దూకుడైన ఆటతో జర్మనీ కుర్రాడికి షాకిస్తూ వరుసగా రెండు సెట్లు గెలిచిన అల్కరాస్.. నిర్ణయాత్మక సెట్‌ను ఒక్క పాయింట్‌తో కోల్పోయాడు. దాంతో.. నాలుగో సెట్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. దాదాపు ఐదున్నర గంటలు ప్రేక్షకులను అలరించిన ఈ మారథాన్ మ్యాచ్‌లో 6-4, 7-6, 6-7, 7-6, 7-5తో అల్కరాస్ విజేతగా నిలిచాడు. రెండో సెమీఫైనల్లో తలపడుతున్న జన్నిక్ సిన్నర్ , నొవాక్ జకోవిచ్‌లో ఒకరితో అతడు ఫైనల్ ఆడనున్నాడు. ఓపెన్ ఎరాలో అత్యంత చిన్నవయసు(22 ఏళ్లు)లోనే నాలుగు గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్ చేరిన ఆటగాడిగా అల్కరాస్ రికార్డు సృష్టించాడు. 1993లో జిమ్ కొరియర్ పేరుతో ఉన్న రికార్డును ఈ యంగ్ సంచలనం బద్ధలు కొట్టాడు.

### టీ20 ప్రపంచకప్ కోసం యూఎస్‌ఏ జట్టు ప్రకటన

భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ 2026 కోసం 15 మంది సభ్యుల యూఎస్‌ఏ జట్టును ఇవాళ (జనవరి 30) ప్రకటించారు. ఈ జట్టుకు సారథిగా మోనాంక్ పటేల్ ఎంపికయ్యాడు. గత ఎడిషన్‌లో (2024) ఆడిన 10 మంది ఆటగాళ్లు, ఈసారి కూడా చోటు దక్కించుకున్నారు. కొత్తగా శుభమ్ రంజనే, మహ్మద్ మొహ్సిన్, షేహాన్ జయసూర్య ప్రపంచకప్ జట్టులోకి వచ్చారు. యూఎస్‌ఏకు ఇది రెండో టీ20 ప్రపంచకప్. గత ఎడిషన్‌లో ఈ జట్టు పాకిస్తాన్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించింది. ఆ మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌లో విజయం సాధించి, సూపర్-8కు కూడా అర్హత సాధించింది. ఈసారి కూడా యూఎస్‌ఏ సంచలనాలు సృష్టించే అవకాశం ఉంది. ఆ జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో బలంగా ఉంది. ఆండ్రీస్ గౌస్, మోనాంక్ పటేల్ ఆ జట్టు ప్రధాన బ్యాటర్లుగా ఉన్నారు. బౌలింగ్‌లో నేత్రవల్కర్, నోస్తుష్ కెన్జిగే, అలీ ఖాన్ కీలకమయ్యే అవకాశం ఉంది. గ్రూప్-ఏలో



భారత్, పాకిస్తాన్ లాంటి జట్లతో పోటీపడాల్సి ఉన్న యూఎస్‌ఏ.. ఇదే గ్రూప్‌లోని నమీబియా, నెదర్లాండ్స్‌పై సంచలన విజయాలు సాధించే ఆస్కారం ఉంది. ఫిబ్రవరి 7న టీమిండియా మ్యాచ్‌తో యూఎస్‌ఏ తమ రెండో ప్రపంచకప్ ప్రయాణాన్ని ప్రారంభించనుంది.

**టీ20 ప్రపంచకప్ 2026 కోసం యూఎస్‌ఏ జట్టు..**

మోనాంక్ పటేల్ (కెప్టెన్), జెస్సీ సింగ్, ఆండ్రీస్ గౌస్, షేహాన్ జయసూర్య, మిలింద్ కుమార్, షయాన్ జహంగీర్, సాయితేజ ముక్కమల, సంజయ్ కృష్ణమూర్తి, హర్మీత్ సింగ్, నోస్తుష్ కెన్జిగే, షాడ్లీ వాన్ స్కాల్విక్, సౌరభ్ నేత్రవల్కర్, అలీ ఖాన్, మహ్మద్ మొహ్సిన్, శుభమ్ రంజనే.

# అఫీషియల్.. 'వారణాసి' విడుదల తేదీని ప్రకటించిన రాజమౌళి

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న పాన్-వరల్డ్ మూవీ 'వారణాసి' విడుదల తేదీ ఎట్టకేలకు ఖరారైంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని రాజమౌళి ఎక్స్ వేదికగా అధికారికంగా ప్రకటించాడు. ఈ సినిమాను వరల్డ్ వైడ్‌గా ఏప్రిల్ 07 2027న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు తెలిపాడు. ఉగాది, గుడి పడ్వా వంటి పండుగలతో పాటు అంబేద్కర్ జయంతి, శ్రీరామనవమి వంటి వరుస సెలవులను దృష్టిలో ఉంచుకుని ఈ తేదీని లాక్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకమైన విలన్ పాత్రలో కనిపించనున్నారు. పురాణాల నేపథ్యంతో కూడిన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నాడు. అంతేకాకుండా, భారతీయ సినిమా చరిత్రలోనే తొలిసారిగా ఈ చిత్రాన్ని 1.43:1 ×మీూశ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తుండటం విశేషం. రాజమౌళి మార్క్ ప్రమోషన్లు ఇప్పటి నుంచే మొదలవ్వడంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎన్ని రికార్డులను సృష్టిస్తుందోనని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.




# టాలీవుడ్‌లోకి రవీనా టాండన్ కూతురి ఎంట్రీ.. అజయ్ భూపతి సినిమాలో 'మంగ'గా రాషా!

ఆర్ఎక్స్ 100, మంగళవారం వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి దర్శకత్వంలో వైజయంతి ఫిల్మ్స్ సమర్పణలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమాతో సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా వెండితెరకు పరిచయమవుతుండటం విశేషం. తాజాగా ఈ మూవీ నుంచి కథానాయికను పరిచయం చేశారు మేకర్స్. ఈ సినిమాతో బాలీవుడ్ స్టార్ రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయమవుతోంది. ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామాలో ఆమె 'మంగ' అనే పవర్‌ఫుల్ మరియు ఎలిగెంట్ పాత్రలో నటిస్తుండగా, దీనికి సంబంధించిన ఆమె ఫస్ట్ లుక్ ప్రస్తుతం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. "కోటి మంది దేవతలు నా పక్కనుండి వెళ్తున్నా.. నేను మాత్రం నిన్నే చూస్తూ ఉంటా" అంటూ హీరో శ్రీను ఆరాధించే తీరును బట్టి, కథలో ఆమె పాత్ర ఎంతటి ప్రాధాన్యత కలిగి ఉంటుందో అర్థమవుతోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌ను అశ్విని దత్ సమర్పణలో వైజయంతి ఫిల్మ్స్, స్వప్న సినిమా మరియు చందమామ కథలు బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన జయకృష్ణ ఫస్ట్ లుక్ మరియు టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించగా, ఇప్పుడు రాషా తడానీ ఎథ్నిక్ లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.





# అఘాయిత్యాలను చూస్తుంటే.. సిగ్గుతో తలవంచుకోవాల్సి వస్తోంది



దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకున్న అమానవీయ ఘటన యావత్ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆరేళ్ల పసిప్రాయం అని కూడా చూడకుండా ముగ్గురు మైనర్ బాలురు ఆ చిన్నారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ ఘటనపై పౌర సమాజం నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ కల్పించాల్సిన చోటే చిన్నారులకు నరకం ఎదురవ్వడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.? తాజాగా ఈ ఘటనపై బాలీవుడ్ నటి భూమి ఫెడ్నెకర్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన ఆవేదనను వెల్లడిస్తూ.. నేరస్థులకు చట్టాలన్నా, సమాజమన్నా భయం లేకుండా పోతోందని మండిపడ్డారు. పసి ప్రాణాలకు కనీస రక్షణ కల్పించడంలో మనం ఘోరంగా విఫలమవుతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 10 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న బాలురు ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం మన విద్యా వ్యవస్థ, పెంపకం ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఫైర్ అయింది. ముఖ్యంగా దేశంలో వీధి కుక్కల సమస్యలపై గంటలు తరబడి చర్చలు జరుపుతున్న జనాలు.. అంతకంటూ క్రూరంగా ప్రవర్తించే మృగాల గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించింది. అలాగే మూగజీవాలను శిక్షించడానికి చూపించే ఆసక్తి ఆడపిల్లలకు రక్షణ కల్పించడంలో ఎందుకు కనపించదు? అని అన్నది. ఈశాన్య ఢిల్లీలోని భజన్‌పూర్‌లో జరిగిన ఈ ఘటన చిన్నారిని నిర్భందించి, నోట్లో గుడ్డలు కుక్కి హింసించడం అత్యంత దారుణం అని విమర్శించింది. మన చుట్టూ జరుగుతున్న ఇటువంటి అఘాయిత్యాలను చూస్తుంటే సిగ్గుతో తలవంచుకోవాల్సి వస్తోందని ఆమె తన పోస్ట్‌లో పేర్కొంది. ఢిల్లీలో జరిగిన ఈ ఘాతుకం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. భూమి ఫెడ్నెకర్ చేసిన పోస్ట్ వైరల్ కావడంతో, నెటిజన్లు సైతం దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం చట్టాలు ఉంటే సరిపోదని, నేరస్థుల గుండెల్లో వణుకు పుట్టించేలా శిక్షలు ఉండాలని బాధితురాలి కుటుంబానికి అండగా పోస్టులు పెడుతున్నారు.

# నేను ఇప్పటికీ ఇండస్ట్రీలో దాని కోసమే ప్రయత్నిస్తాను



విలక్షణ నటనతో 'మక్కల్ సెల్వన్'గా గుర్తింపు తెచ్చుకున్న విజయ్ సేతుపతి కొత్త చిత్రం 'గాంధీ టాక్స్'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఇక ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా డబ్బు, వృత్తిపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. కిశోర్ బెలెకర్ దర్శకత్వంలో మూకీ చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా నేడు విడుదలైన నేపథ్యంలో, ఆయన తన వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రతి ఒక్కరికీ డబ్బు చాలా ముఖ్యమని, అది ఆహారం లాంటి ప్రాథమిక అవసరమని ఆయన కుండబద్దలు కొట్టినట్లు తెలిపారు.?డబ్బుతో తనకున్న సంబంధం ఎప్పుడూ మారలేదని, ఇప్పటికీ దాని కోసమే కష్టపడుతున్నానని విజయ్ సేతుపతి పేర్కొన్నారు. "మనం కష్టపడి పనిచేసి మంచి ఫలితాన్ని ఇస్తేనే ప్రజలు మనకు తగిన పారితోషికం ఇస్తారు. లేదంటే ఇవ్వరు" అని ఆయన నిజాయితీగా చెప్పారు. కేవలం సంపాదన కోసం మాత్రమే కాకుండా, పని పట్ల అంకితభావం ఉండాలని, అప్పుడే మనకు గుర్తింపుతో పాటు ఆర్థిక భద్రత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, ఆనందాన్ని డబ్బుతో ముడిపెట్టడం సరికాదని ఈ సందర్భంగా విజయ్ సూచించారు. "పనులే మనకు అసలైన ఆనందాన్ని ఇస్తాయి, మనం పొరపాటుగా ఆ సంతోషాన్ని డబ్బుతో పోలుస్తున్నాం" అంటూ జీవిత సత్యాన్ని వివరించారు. అదితిరావు హైదరి, అరవింద్ సామి ప్రధాన పాత్రల్లో నటించిన 'గాంధీ టాక్స్' చిత్రంలో కేవలం హావభావాలతోనే మెప్పించిన విజయ్, తన మాటలతో కూడా ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# పుష్ప 2 తర్వాత బన్నీ నెక్స్ట్ స్టెప్.. జోడీగా ప్రభాస్ హీరోయిన్..!

'పుష్ప 2'తో దేశవ్యాప్తంగా అల్లు అర్జున్ స్టార్‌డమ్ ఏ స్థాయికి చేరిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాస్ ఇమేజ్‌ను పాన్-ఇండియా రేంజ్‌లో మరింత స్ట్రాంగ్‌గా ఎస్టాబ్లిష్ చేసిన ఈ సినిమా తర్వాత బన్నీ చేసే ప్రతి ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్-ఇండియా సినిమాలో నటిస్తున్నాడు. హై ఎనర్జీ యాక్షన్, గట్టి ఎమోషన్, కమర్షియల్ టచ్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా బన్నీ కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అట్లీ ప్రాజెక్ట్ పూర్తయ్యాక అల్లు అర్జున్ పూర్తిగా డిఫరెంట్ కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రావాలని ప్లాన్ చేస్తున్నాడట. అదే క్రమంలో ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన అల్లు అర్జున్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి సినిమాలతో ఇంటెన్స్ నరేషన్, స్టైలిష్ యాక్షన్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్‌తో బన్నీ సినిమా అంటే సహజంగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ సినిమా పాన్-ఇండియా స్థాయిలో రూపొందనుండగా, యాక్షన్‌తో పాటు ఎమోషనల్ డెప్త్ కూడా బలంగా ఉండనుందని సమాచారం. లోకేష్ మార్క్ రియలిస్టిక్ టోన్‌కు అల్లు అర్జున్ ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ జతకలిస్తే ఓ ఫ్రెష్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ వస్తుందని అభిమానులు భావిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్‌లు ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత గ్రాండ్‌గా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎంపికపై తాజాగా ఆసక్తికరమైన ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్‌ని ఫిమేల్ లీడ్‌గా తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ప్రభాస్‌తో 'సాహో'లో నటించడం ద్వారా తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రద్ధా, ఇటీవల 'స్త్రీ 2' సినిమాతో తన నటనకు విమర్శకుల ప్రశంసలు, అవార్డులు కూడా అందుకుంది. ఆ సినిమా తర్వాత ఆమె చేసే ప్రతి ప్రాజెక్ట్‌పై నార్త్‌తో పాటు సౌత్‌లోనూ ఆసక్తి పెరిగింది. ఇప్పుడు అల్లు అర్జున్ లాంటి పాన్-ఇండియా స్టార్‌తో, లోకేష్ కనగరాజ్ లాంటి క్రేజీ దర్శకుడితో సినిమా అంటే శ్రద్ధా కపూర్ కెరీర్‌లో కూడా ఇది ఒక కీలక టర్నింగ్ పాయింట్ అవుతుందని టాక్. పాన్-ఇండియా మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సినిమాలో నటీనటుల ఎంపిక చాలా జాగ్రత్తగా జరుగుతోందని తెలుస్తోంది. అందుకే శ్రద్ధా పేరు పరిశీలనలోకి వచ్చిందని సమాచారం.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# విద్యార్థుల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలి





**నిజామాబాద్, జనవరి 30 ధర్మ ఘంట**

ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల భద్రత, సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, హాస్టళ్ల ప్రాంతీయ సమన్వయకర్తలు (ఆర్.సీ.ఓ)లు, నిర్వాహకులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్న సంఘటనలను ఉటంకిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ తరహా ఉదంతాలు చోటుచేసుకోకుండా పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అధికారులను ఆదేశించారు.
ప్రత్యేకించి బాలికల వసతి గృహాలు, గురుకులాల నిర్వహణ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికల హాస్టళ్లలో ఇతరులు ఎవరూ ప్రవేశించకుండా కట్టడి చేయాలని, తల్లిదండ్రులు వస్తేనే వారి వెంట ఇంటికి పంపాలని సూచించారు. సీ.సీ కెమెరాలు తప్పనిసరిగా పని చేయాలని అన్నారు. వసతి గృహాల ప్రాంగణాలు, పరిసరాలలో ఎక్కడైనా గుంతలు వంటివి ఉంటే తక్షణమే పూడ్చి వేయించాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, శుభ్రమైన నీటి సరఫరా, ఆహార పరిశుభ్రత, పౌష్టిక ఆహారం అందించడానికి కావలసినటువంటి ఏర్పాట్లను అనునిత్యం పర్యవేక్షించాలన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలు, గడ్డి వంటివి పెరగకుండా చూడాలని, పాముకాటు వంటి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.
క్రమం తప్పకుండా ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం శుభ్రమైన ఆహార పదార్థాలను అందించడానికి వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించడానికి, కలుషిత ఆహారం ద్వారా వ్యాధులు సోకకుండా ఫుడ్ పాయిజన్ సమస్యను నివారించడానికి శానిటేషన్ సిబ్బందికి, వంటగదిలో పని చేసే సిబ్బందికి తగిన సూచనలు చేయాలన్నారు. వంట పాత్రలు శుభ్రంగా కడిగేలా పర్యవేక్షణ జరపాలని, నిల్వ ఉంచిన నాన్ వెజ్ ను అందించకూడదని ఆదేశించారు. విద్యార్థులతో ఆప్యాయంగా వ్యవహరిస్తూ, తమ సొంత బిడ్డలుగా వారి సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, ఆర్.సీ.ఓలు, హాస్టళ్ల నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అమాత్యున్ని అడ్డుకొని ప్రశ్నించిన అధికారిణి...!

మహారాష్ట్రలోని నాసిక్‌లో జనవరి 26,2026న జరిగిన రిపబ్లిక్ డే వేడుకలకు హాజరైన కేంద్ర మంత్రి గిరీష్ మహాజన్ తన ప్రసంగంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్.అంబేద్కర్ పేరు ప్రస్తావించకపోవడంపై అక్కడే ఉన్న ఫారెస్ట్ అధికారిణి మాధవి జాదవ్ రిపబ్లిక్ డే రోజు రాజ్యాంగ నిర్మాతకు అవమానమా...? అంటూ మంత్రిని కోపంతో నిలదీస్తూ ప్రశ్నించిన ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది.ఇది రాజ్యాంగ విలువలు, సమానత్వం మరియు పొలిటికల్ సెన్సిటివిటీల గురించి దేశంలో చర్చను లేవనెత్తింది.ఇది ఒక వైపు రాజ్యాంగ ఆదర్శాలకు కట్టుబడి ఉండటం,మరోవైపు లోపాలు (అవమానాలు లేదా లోపాలు) సరిచేసుకోవడం వంటి అంశాలను ఎత్తి చూపుతుంది. అంతేకాదు ప్రజాస్వామ్యంలో పౌరుడి వ్యక్తిగత ధైర్యం మరియు జవాబుదారీతనం యొక్క అవశ్యకతకు ఉదాహరణగా నిలుస్తోంది.అదే సమయంలో పొలిటికల్ పక్షపాతాలు మరియు మీడియా హైప్‌ను కూడా గమనించాలి.
రిపబ్లిక్ డే రోజు రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్.అంబేద్కర్ ను స్వయంగా కేంద్రమంత్రి విస్మరించడం అంటే అవమానించడమేనని రిపబ్లిక్ వేడుకల్లో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రిని ఓ అధికారిణి అడ్డుకొని మరీ నిలదీసి, ప్రశ్నించిన తీరు ప్రజాస్వామ్య విలువలను సజీవంగా నిలబెట్టింది.మహారాష్ట్రలోని నాసిక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో సోమవారం (జనవరి 26) జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జరిగిన ఈ ఊహించని పరిణామం దేశ ప్రజలను ఒక్కసారిగా నివ్వెరపరిచింది. జెండా వందన జరిగిన కొద్ది సేపటికే ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి గిరీష్ మహాజన్ తన ప్రసంగంలో



రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరును ప్రస్తావించకపోవడంపై అక్కడే ఉన్న ఫారెస్ట్ డిపార్టుమెంట్ అధికారిణి మాధురి జాదవ్ తీవ్రంగా తప్పుబట్టారు.కేంద్ర మంత్రి ప్రసంగాన్ని అడ్డుకొని బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును ఎందుకు ప్రస్తావించలేదని నిలదీశారు.కేంద్ర మంత్రి ప్రసంగిస్తుండగానే సీటులోంచి లేచి స్టేజీ దగ్గరకు వెళ్లి మంత్రి ప్రశ్నించారు.దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొడంతో మాధురి జాదవ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ వీడియోలో మాధురీ జాదవ్ తన నిరసను బలంగా వినిపించింది.అవసరమైతే తాను సస్పెన్షన్ ను కూడా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని,కానీ,మౌనంగా మాత్రం ఉండనని తెగేసి చెప్పడం దేశం పట్ల,రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల ఆమెకు ఉన్న నిబద్ధతను నిటారుగా నిలబెట్టింది. సమానత్వం,న్యాయంపై రాజ్యంగ విలువలు బీఆర్ అంబేద్కర్ రచనల నుండే వచ్చాయని,గణతంత్ర దినోత్సవం రోజున ఆయన పేరును ఎందుకు ప్రస్తావించలేదని అమాత్యున్ని ఘాటుగా ప్రశ్నించడం అంటే పాలకులు ఏం చేసినా మనం చూస్తూ ఉండవద్దని,తప్పు ఎవరు చేసినా నిలదీసే హక్కు ప్రజలకు ఉందని,దేశంలోని ప్రజలందరికీ భారత రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని, కళ్ళ ముందు తప్పు జరుగుతుంటే కళ్ళు లేనివారు చూస్తూ ఉంటారని,చెవులు లేని వారు వింటూ ఉంటారని,నోరు లేని వారు ప్రశ్నించకుండా ఉంటారని,అన్ని సరిగా ఉన్నవారు మౌనంగా ఉంటే దేశం నాశనం అవుతుందని నిరూపించడమే అవుతుంది.ఓ మహిళ,అందులోనూ ఉన్నత ఉద్యోగం చేస్తున్న అధికారిణి, అదరకుండా బెదరకుండా సివంగిలా గర్జించడం దేశ పౌరులకు ముఖ్యంగా మహిళా లోకానికి స్ఫూర్తిదాయకంగా కనిపిస్తుంది. ఎట్టకేలకు ఈ వివాదంపై స్పందించిన కేంద్ర మంత్రి గిరీష్ మహాజన్ వివరణ ఇవ్వక తప్పలేదు.తాను బీఆర్ అంబేద్కర్ పేరును ప్రస్తావించకపోవడం అనుకోకుండా జరిగిందని, ఉద్దేశపూర్వకంగా కాదని వివరణ ఇచ్చుకున్నారు.కానీ,ఈ అంశం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడం,ఇంకా చర్చ కొనసాగుతుందంటే ఎంతలా దేశాన్ని ప్రభావితం చేసిందో దేశ ప్రజలు గమనించాలి.

**గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.**

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ నామినేషన్ పర్వం





**నిజామాబాద్ జనవరి 30 ధర్మ ఘంట**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ గడువు నేటితో ముగియనుంది.మూడు రోజుల క్రితం నామినేషన్ స్వీకరణ ప్రారంభం అయిన మొదటి రోజు మందకొడిగా సాగింది.చివరి రోజు మాత్రం ఆశావహులు పెద్ద సంఖ్యలో నామినేషన్లను దాఖలు చేశారు.నిజామాబాద్ జిల్లాలో ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు మరో మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి.పార్టీ టికెట్ల కోసం ఆశావహులు ముందస్తు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక జరుగలేదు.ఎలాగైనా టికెట్ లభిస్తుందన్న వారు మాత్రం ముందస్తుగా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేస్తున్నారు. నిజామాబాద్ నగరం లోని 60 డివిజన్ లకు గాను జోన్ వారిగా నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఉదయం ప్రారంభమైన నామినేషన్ జాతర సాయంత్రం వరకు సాగింది.బ్యాండ్ మేళాల మధ్య నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు.నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.నిబంధనలను అమలు పరుస్తున్నారు.కంటేశ్వర్ జోన్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్ కు బీజేపీ,కాంగ్రెస్,టీడీపీ, అప్, బీఆర్ఎస్ పార్టీ ఆశావహులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.నామినేషన్ కేంద్రం లోకి పోటీ చేసే అభ్యర్థి తో పాటు అభ్యర్థిని బలపరిచే వారికి మాత్రమే అవకాశం కల్పించారు.అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల గెలుపు ధీమాను వ్యక్తం చేశారు.పార్టీ బీ ఫామ్ వస్తుందని ధీమాగా కనిపించారు.ఒక్కో పార్టీ నుండి ఐదుకు పైగా అభ్యర్థులు అదే డివిజన్ ఆశిస్తూ నామినేషన్ దాఖలు చేశారు.తుది జాబితా ఫిబ్రవరి 3 న వెలువడనుంది.ఆశావహులు మాత్రం నేడు గడిస్తే మళ్ళీ నామినేషన్ వేయడానికి సమయం లేనందున నామినేషన్ వేసి వారి బలం,బలగాన్ని చూపిస్తూ తమకు టికెట్ ఇవ్వాలని పార్టీ పెద్దలను కోరుతున్నారు.గత సంవత్సరం త్రుటిలో చేజారిన మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో బీజేపీ కనిపించింది.అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ అర్బన్ నియోజక అభివృద్ధితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యమంటున్నారు. నిజామాబాద్ అభివృద్ధికి ఎంపి అరవింద్,శాసన సభ్యులుగా తాను ఎంతో కృషిచేస్తున్నామని తెలిపారు.మన ఇందురు,మన మేయర్ అన్న స్లోగన్ తో ఎన్నికలలో పోటీ చేస్తున్నామన్నారు. ఇందురు ప్రజలు ఆశీర్వదిస్తారన్న సంపూర్ణ నమ్మకం ఉందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ సైతం అదే ధీమాను వ్యక్తం చేస్తుంది.జాతీయ పార్టీల మధ్య టాప్ ఫైట్ జరిగేలా నామినేషన్ దృశ్యాలు అద్దం పడుతున్నాయి.మరికొన్ని పార్టీల అభ్యర్థులు సైతం వారి భవిష్యత్ ను పరీక్షించుకోవడానికి పురపోరులో నామినేషన్ దాఖలు చేశారు.దీంతో పురపాలక సంఘాల పరిధిలోని పట్టణాలలో సందడి మొదలయ్యింది.

## 3వ వార్డు అభ్యర్థిగా పడిదల రవి నామినేషన్ దాఖలు



**ధర్మ ఘంట జనవరి 30,సూర్యాపేట**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ చివరి రోజు సూర్యాపేట మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పడిదల రవి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మాజీ వార్డ్ కౌన్సిలర్ ధారావత్ రవి, మాజీ ఎంపీటీసీ గండికోట లక్ష్మయ్య, పడిదల నగేష్, బొల్లం సైదులు, మోర శ్రీను, పడిదల వెంకన్న, పడిదల విజయ్, పడిదల సృజన్, శ్రవణ్,బిక్షం, చింటు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ పేరును లేకుండా బీజేపీ కుట్ర




**నిజామాబాద్ జనవరి 30 ధర్మ ఘంట**

గాంధీ పేరును రూపుమాపాలనే కుట్ర బీజేపీ చేస్తుందనీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కాటిపల్లి నగేష్ రెడ్డి పేర్కొన్నారు.గాంధీ వర్ధంతి నీ పురస్కరించుకొని గాంధీ చౌక్ లోని మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.భారత జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. గాంధీ చౌక్ లోని గాంధీ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తుల్లో మహాత్మా గాంధీ కీలకపాత్ర పోషించారని,శాంతి,అహింస అనే మార్గం పై బ్రిటిష్ వారిని గడగడలడించిన వ్యక్తి అన్నారు,స్వతంత్రం వచ్చిన తర్వాత 1948 లో కొందరు దుష్టశక్తులు గాంధీని హత్య చేయడం జరిగిందన్నారు.,మతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది అని నమ్మిన వ్యక్తి గాంధీ అని అన్నారు. ఈ రోజు దేశం అభివృద్ధి చెందింది అంటే ఆది గాంధీ చూపిన శాంతి మార్గం వల్లనే అని,దేశ ప్రజలు మతాలకు అతీతంగా కలిసి ఉండి గాంధీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్,మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు గణరాజ్,నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేవతి, డిచ్పల్లి సర్పంచ్ ఫోరం అధ్యక్షులు వాసు,నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు వినయ్,నగర మైనారిటీ అధ్యక్షులు ఎజాస్, మార్కెట్ కమిటీ సభ్యులు ఈసా,స్వప్న,బంటు బలరాం,సలీం, నూర్, అయ్యుబ్ పలువురు పాల్గొన్నారు

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్





**నిజామాబాద్, జనవరి 30 ధర్మ ఘంట**

మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్. సత్యనారాయణ రెడ్డి నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని 13, 14‘ 15 డివిజన్ల నామినేషన్ల స్వీకరణ కేంద్రంతో పాటు అర్సపల్లి వాటర్ ట్యాంక్ జోన్ ఆఫీసు, బోధన్, ఆర్మూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, భీంగల్ మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. నిబంధనలకు అనుగుణంగా స్వీకరణ ప్రక్రియ జరుగుతోందా అని నిశిత పరిశీలన చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, హెల్ప్ డెస్క్ లను పరిశీలించారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్ల సన్నద్ధతపై అధికారులతో చర్చించి, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల మెటీరియల్ గురించి అడిగి తెలుసుకున్నారు. టీ పోల్ యాప్ లో ఎన్నికల రిపోర్టులు అప్లోడ్ చేస్తున్న వైనాన్ని పరిశీలించారు. అబ్జర్వర్ వెంట బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు.

ధర్మఘంట

# ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించండి





నిజామాబాద్ జనవరి 30 ధర్మ ఘంట

నిజామాబాద్ నగర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులతో పాటు నగర అభివృద్ధి కొరకు పోరాడే వామపక్షవాదులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు కోరారు. నామి నేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు ప్రజలను కోరారు. 35వ డివిజన్ కార్పొరేటర్ సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న నూర్జహాన్ కార్యకర్తలతో డివిజన్లోని వివిధ వీధుల గుండా ప్రదర్శన నిర్వహించి అనంతరం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు .ఈ సందర్భంగా హాజరైన కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో సమస్యలు ఎక్కడికక్కడ పేరుకు పోతున్నాయని సమస్యల పరిష్కారం కోసం అటు అధికార పార్టీ కానీ ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు కానీ కృషి చేయకుండా కేవలం మతాలు కులాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతూ ప్రజా సమస్యలు పక్కన పెడుతున్నారని వీటి మూలంగా అనేక కాలనీలో సమస్యలు పేరుకుపోయాయని ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి కాలనీల అభివృద్ధి కొరకు ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపిస్తే నిజామాబాద్ నగరం అభివృద్ధి చెందుతుందని లేనియెడల ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని సిపిఎం నిత్యం కార్మికులు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన పోరాటాలు చేస్తున్నారని అందువల్ల 35వ డివిజన్ మరియు 10 అదేవిధంగా11 వ డివిజన్లో సిపిఎం అభ్యర్థులు వెంకట్ రాములు మరియు సుజాత పోటీ చేస్తున్నారని అదేవిధంగా నగరంలోని వివిధ డివిజన్లో వామపక్ష అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వారిని గెలిపించాలని వీటితో పాటు బోధన్ మరియు ఆర్మూర్లలో పోటీ చేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 35వ డివిజన్ అభ్యర్థి నూర్జహాన్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ జిల్లా కార్యదర్శి సిర్ప లింగం ఐద్వానాయకులు అనిత మరియు అనసూయమ్మ నగర నాయకులు నల్వాల నరసయ్య బీడీ కార్మిక సంఘం నాయకులు విమలమ్మ మరియు జిల్లా అధ్యక్షులు మోహన్ వివిధ రంగాల కార్మికులు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో వెనుకడుగులు, కనీసం తాగు నీరు అందని వార్డులు

ధర్మ ఘంట, జనవరి 30 మోత్కూరు

మోత్కూరు మున్సిపాలిటీగా రూపాంతరం చెంది ఏళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో అభివృద్ధి మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. పట్టణంలోని పలు కాలనీలు కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక ప్రజలు అల్లాడుతున్నా, అటు అధికారులు కానీ, ఇటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా తాగునీటి సమస్య పట్టణవాసులను తీవ్రంగా వేధిస్తోంది. 6వ వార్డులో మిషన్ భగీరథ పథకం కింద పైపులైన్లు వేసి కాలం గడుస్తున్నా, నేటికీ ఆ పైపుల ద్వారా చుక్క నీరు కూడా రాకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఎల్లం గార్డెన్ సమీపంలోని భువనగిరి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న సెక్రటరియట్ స్కూల్ పరిసర ప్రాంతాలు, లోర్దు నగర్ వంటి కాలనీల్లో నివసించే ప్రజలు గత ఐదేళ్లుగా మున్సిపల్ నీటి కోసం కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నామని బద్ద మల్లారెడ్డి తెలిపారు. ఇక 10వ వార్డు పరిధిలోని యాదవ కాలనీ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇక్కడి నివాసితులకు అసలు మిషన్ భగీరథ నీరు అంటే ఏమిటో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పట్టణం మొత్తం మురుగునీరు వచ్చి చేరే చెరువులో ఉన్న బోరు నీటినే వీరికి సరఫరా చేస్తుండటం ప్రజారోగ్యం పట్ల పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రతి ఏటా మున్సిపాలిటీకి క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నా, తమ గోడు వినే నాథుడే లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పరిశీలిస్తాం, చేస్తాం అనే తాత్కాలిక సమాధానాలే తప్ప, శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడటం లేదు. మున్సిపల్ పరిధిలోని ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన కనీస బాధ్యతను కూడా యంత్రాంగం మర్చిపోయిందని ఓటర్లు మండిపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైన తరుణంలో, కేవలం ఎన్నికల సమయంలోనే కనిపించే నాయకులు, తమ సమస్యలను ఎప్పుడు తీరుస్తారని నిలదీస్తున్నారు. నామమాత్రపు కనెక్షన్లు కాకుండా, ప్రతి ఇంటికీ నీరు చేరినప్పుడే అది నిజమైన అభివృద్ధి అని, అప్పటివరకు తాము ఊరుకోబోమని ఓటర్లు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, రాబోయే ప్రజా ప్రతినిధులు ఈ మౌలిక సమస్యలపై స్పందించి, తక్షణ చర్యలు చేపట్టాలని మోత్కూరు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయం లో మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడతామని అన్నారు.










# ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి

ధర్మ ఘంట జనవరి 30, నల్గొండ



ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా ఇంటర్మీడియట్,సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్ ప్రాక్టీకల్స్ పరీక్షల పై సమావేశం నిర్వహించారు.ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుండి 11 వరకు ఉంటాయని,ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని తెలిపారు.ఈ పరీక్షలకు జిల్లాలోని 143 జూనియర్ కళాశాలల నుండి మొత్తం 9,251 మంది విద్యార్థులు హాజరుకానున్నారని,ఇందులో జనరల్ విభాగంలో 6,092 మంది, వొకేషనల్ విభాగంలో 3,159 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.అలాగే రెండవ సంవత్సరం విద్యార్థుల్లో ఎంపిసి లో 3,850 మంది,బైపిసి లో 2,016 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు.పరీక్షల నిర్వహణ కు నల్గొండ జిల్లాలో మొత్తం 86 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఇందులో 57 జనరల్ జూనియర్ కళాశాలలు మరియు 29 వొకేషనల్ జూనియర్ కళాశాలలు పరీక్షా కేంద్రాలుగా గుర్తించినట్లు వెల్లడించారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద క్రమశిక్షణ, నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు.విద్యార్థులు పరీక్ష విధులు నిర్వహించే సిబ్బందికి ఇబ్బందులు లేకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) సహకారంతో ప్రత్యేక బస్సు సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షలకు సంబంధించిన పత్రాలు,రికార్డులు సకాలంలో చేరవేయడానికి స్పీడ్ పోస్టు సేవలను వినియోగించాలని చెప్పారు.పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలని, అదనంగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు అనుకూల వాతావరణంలో పరీక్షలు రాయడానికి పూర్తి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్, ప్రిన్సిపల్స్ రాకేందు కుమార్,ధనరాజ్,పద్మ,శ్రీదేవి పాల్గొన్నారు.

## అందుబాటులో ఉంటాను ఆశీర్వదించండి




ధర్మ ఘంట, జనవరి 30 మోత్కూర్

మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు బి ఆర్ ఎస్ బలపర్చిన అభ్యర్థిగా కోక రేణుక (బిక్షం) మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం ఆమె మాట్లాడుతూ, తన భర్త ఆర్.ఎం. డాక్టర్‌గా గత ఆరు సంవత్సరాలుగా మోత్కూరు మాత్రమే కాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి 5వ వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి, ప్రజలు కోరుకున్న అభివృద్ధిని తప్పక సాధిస్తామని కోక రేణుక హామీ ఇచ్చారు. తమ కుటుంబం ప్రజలతో ఉన్న అనుబంధం, వారి సేవా భావం విజయం సాధించే బలం అవుతుందన్న నమ్మకం వ్యక్తం చేసిన ఆమె, ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కోక బి.ఆర్. ఫౌండేషన్ ఛైర్మన్ కోక బిక్షం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు కొణతం యాకుబ్ రెడ్డి, చిప్పలపల్లి మహేందర్ నాథ్, స్థానికులు సామ పద్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థులు నూకమళ్ళ రామకృష్ణ మిత్ర బృందం ఏర్పాటు



మునగాల మండలం ముకుందాపురం గ్రామంలో శుక్రవారం నాడు సమ్మక్క సారలక్క జాతర సందర్భంగా గ్రామస్థులు నూకమళ్ళ రామకృష్ణ మిత్ర బృందం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న కోదాడ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి, యం యస్ విద్యా సంస్థల సీ ఈ వో యస్ యస్ రావు.ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ సమ్మక్క సారలక్క ల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు జి లక్ష్మయ్య, బ్రహ్మం, లింగయ్య, నూకమళ్ల రామకృష్ణ, ఇంద్రశేఖర్ రెడ్డి, సరికొండ నాగరాజు, రాంబాబు, ఎన్. వెంకట రెడ్డి, నాగయ్య, నరసయ్య, శనగాని ఉపేందర్ ,రవి, ఉపేందర్ మరియు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచే 'సీఎం కప్' క్రీడా సంబరాలు: ఎంపీడీఓ చిన్న మున్నయ్య

ధర్మ ఘంట జనవరి 30 మర్రిగూడ :




గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా'సీఎం కప్' క్రీడలు నిర్వహిస్తుందని ఎంపీడీఓ చిన్న మున్నయ్య అన్నారు.నల్లగొండ జిల్లా మర్రిగూడల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి ప్రారంభం కానున్నాయని స్థానిక ఎంపీడీఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కబడ్డీ,వాలీబాల్,ఖో-ఖో,అథ్లెటిక్స్ గేమ్స్ వంటి ప్రధాన క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు.ఆసక్తి గల యువతి,యువకులు మర్రిగూడ హై స్కూల్ కు చేరుకొని 9 గంటలకు క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు తదుపరి నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామని పేర్కొన్నారు.

## కేతేపల్లి గ్రామంలో నూతన విద్యుత్ పరికరాలను ప్రారంభించిన సర్పంచ్ పెరికేటి రమేష్



ధర్మఘంట జనవరి :30:నాంపల్లి

నల్గొండ జిల్లా నాంపల్లి మండలం కేతేపల్లి గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో గతంలో మంజూరు అయినటువంటి 25ఎజ విద్యుత్ పరికరాలను గ్రామంలోని కొన్ని వీధులను గ్రామ లైన్ మెన్ శ్రీతో కనెక్షన్ కల్పించి సర్పంచ్ పెరికేటి రమేష్ మరియు ఉపసర్పంచ్ పల్లేటి దీపిక వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో లైన్మెన్ సుధాకర్, వార్డు మెంబర్లు పల్లేటి కర్ణాకర్,పగిళ్ల అశోక్,ఒగ్గు యాదమ్మ వెంకటయ్య,గ్రామ యువకులు దండిగ లింగయ్య,పెరిగేటి జగన్,చేపూరి శ్రీను,కుందేల నగేష్,ఆకులపల్లి నరేష్,పోలేపల్లి ప్రదీప్, పెరికేటి మహేష్,వంగూరు నరసింహ,వడ్లకొండ పరమేశు ,పిల్లి ఎల్లయ్య,రేగోజు విగ్నేష్ పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు లైసెన్స్ పొందాలి

**ఒక్క క్షణ నిర్లక్ష్యం జీవితాంతం పశ్చాత్తాపం**

**జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.వాణి**

**ధర్మ ఘంట జనవరి 30, నల్గొండ:**

18 సంవత్సరాల నీటిన ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.వాణి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిద్దార్థ కాలేజీలో జాతీయ రహదారి భద్రత మహోత్సవంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ నిర్లక్ష్యం వల్ల ఎంతోమంది ప్రమాదాలకు గురై విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వాడాలని సూచించారు.ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు.అధిక వేగం,మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని అన్నారు.ఒక్క క్షణ నిర్లక్ష్యం జీవితాంతం పశ్చాత్తాపంగా మారుతుందని హెచ్చరించారు.ట్రాఫిక్ పోలీసుల సూచనలను గౌరవిస్తూ,రహదారిపై శాసనబద్ధంగా ప్రయాణించడమే సురక్షిత జీవనానికి మార్గమని పేర్కొన్నారు.ఈ ఈ కార్యక్రమంలో డిటివో లావణ్య,మల్లికార్జున్ రెడ్డి, స్వప్న, కాలేజ్ చైర్మన్ గుండెగోని లింగయ్య యాదవ్, జానయ్య, ప్రిన్సిపల్ రవికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా చింత నవీన్ నామినేషన్ దాఖలు



**ధర్మ ఘంట జనవరి 30,సూర్యాపేట:** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల చివరి రోజు శుక్రవారం సూర్యాపేట మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా చింత నవీన్ నామినేషన్ దాఖలు చేశారు.ఆయన వెంట మహేష్ తదితరులు ఉన్నారు.

## 31వ వార్డు నుంచి నామినేషన్ దాఖలు చేసిన మాజీ సర్పంచ్ యెర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు..

**మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి ల ఆశీస్సులతో విజయం సాధిస్తా...**



**కోదాడ, జనవరి 30, ధర్మఘంట:**

కోదాడ మాజీ సర్పంచ్ యెర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు మునిసిపల్ ఎన్నికల్లో 31వ వార్డు నుంచి నామినేషన్ దాఖలు చేసి ఎన్నికల బరిలోకి దిగారు. గ్రామ పాలనలో తనకున్న అనుభవం, ప్రజాసేవ నేపథ్యం ఆధారంగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిల ఆశీస్సులు, మద్దతుతోనే తాను ఈ ఎన్నికల్లో బరిలోకి దిగుతున్నట్లు యెర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు తెలిపారు. గతంలో సర్పంచ్‌గా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలే తనకు ప్రధాన బలమని ఆమె అన్నారు.31వ వార్డులో ప్రజల సమస్యలపై స్పష్టమైన అవగాహనతో, పారదర్శక పాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆమె పేర్కొన్నారు. స్థానిక ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, మద్దతుతో ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తానన్న ధీమాను ఆమె వ్యక్తం చేశారు. కాగా నామినేషన్ కు ముందు ఆమె దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రాంరెడ్డిపల్లి నర్సరీని తనిఖీ చేసిన ఎంపీడీఓ చిన్న మున్నయ్య



**ధర్మ ఘంట జనవరి 30 మర్రిగూడ :**

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామంలో నర్సరీని ఎంపీడీఓ చిన్న మున్నయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా నర్సరీలో పెరుగుతున్న వివిధ రకాల మొక్కలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..నర్సరీలో నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా సంరక్షించాలని,వాటికి క్రమం తప్పకుండా నీరు పోయాలని సిబ్బందిని ఆదేశించారు.రాబోయే వర్షాకాలం నాటికి లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు.ఎండ తీవ్రతకు మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని,షేడ్ నెట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు.నర్సరీ నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు.రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, మొక్కల వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లపంగి నర్సింహా,ఉప సర్పంచ్ పొగాకు పెద్ద సైదులు,పంచాయితీ కార్యదర్శి నజీర,వార్డ్ మెంబర్ లపంగి మహేందర్,ఫీల్డ్ అసిస్టెంట్ సల్వోజ్ యాదయ్య,వడ్డె లోకేష్ పాల్గొన్నారు.

# సూర్యాపేట ప్రజలు శాంతిని అభివృద్ధిని కోరుకుంటారు







**34, 36 వార్డులకు నామినేషన్లు దాఖలు చేసిన మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గండూరి ప్రవల్లిక ప్రకాష్ దంపతులు**

**ధర్మ ఘంట జనవరి 30, సూర్యాపేట:**

సూర్యాపేట పట్టణ ప్రజలు శాంతిని అభివృద్ధిని కోరుకుంటారని గత పదేళ్ల కాలంలో మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి చేసిన అభివృద్ధికి ఓటేసి పట్టణంలోని 48 వార్డుల్లో బిఆర్ఎస్ను గెలిపిస్తారని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గండూరి ప్రవల్లిక ప్రకాష్ దంపతులు అన్నారు. సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 34వ వార్డు నుంచి గండూరి ప్రకాష్, 36వ వార్డు నుంచి గండూరి ప్రవల్లికలు తమ నామినేషన్ పత్రాలను సమర్పించి మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 2014లో 11వ వార్డు నుంచి కౌన్సిలర్ గా గెలిచిన తాము ఐదేళ్లు చైర్మన్ గా ఉండి సూర్యాపేటను అభివృద్ధి చేయడంతో పాటు స్వచ్ఛభారత్లో అనేక అవార్డులు సాధించామన్నారు. 2020లో కౌన్సిలర్ గా 36వ వార్డు నుంచి బరిలో నిలిచి గెలిచామన్నారు. ప్రస్తుతం తిరిగి 2026 లో 34, 36వ కార్డుల నుంచి బి ఆర్ ఎస్ అభ్యర్థులుగా తాము బరిలో నిలుస్తున్నామని తెలిపారు. సూర్యాపేట మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపాలిటీ అని 48 వార్డుల్లో టిఆర్ఎస్ జండా ఎగరవేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీమంత్రి జగదీష్ రెడ్డిలు చేసిన అభివృద్ధి 2014కు ముందు ఎలా ఉంది తరువాత ఎలా ఉంది అనేది ప్రజలు గ్రహించాలన్నారు. సూర్యాపేట పట్టణ ప్రజలు శాంతిని అభివృద్ధిని కోరుకుంటారని వారే ఓటేసి టిఆర్ఎస్ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని అన్నారు. 34, 36 వార్డుల ప్రజలకు తాము కుటుంబ సభ్యులుగా ఉండి సేవ చేస్తామని ఆయా వార్డుల ప్రజలు తమను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## వాయిలసింగారం గ్రామంలో ఘనంగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం

**వాయిలసింగారం గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు**



**ధర్మఘంట, జనవరి30 ,అనంతగిరి:-**

అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించడం జరిగింది ఈ సంధర్భంగా గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని కొనియాడారు దేశంకోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ అహింస సత్యాగ్రహం అనే ఆయుధాలతో స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుకు నడిపించిన ఆమహనీయుని సేవలను స్మరించుకుంటూ నేటి యువత ఆయన అడుగుజాడలలో నడవాలని సూచించారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి సౌమ్య,కొల్లు సుబ్బారావు,చుండూరు మురళి,హనుమంతు లక్ష్మి నరసింహరావు,దాములూరి మురళి, శీలం చిన సైదులు,చింతా సునిత,రాములు,రేవూరి శ్రీనివాసరావు ,లింగరాజు ,కళ్యాణ్ రావు గ్రామ పంచాయితీ సిబ్బంది విజయ్ గ్రామస్తులు పాల్గొన్నారు

## అభివృద్ధి,ఆర్థిక వ్యవస్థలో కలిసిపోవడానికి విజ్మోని ప్రారంభం

**వ్యవస్థాపకుడు, గ్రూప్ సీఈఓ అమీర్ నాగమ్మి**

**ధర్మ ఘంట జనవరి 30, నల్గొండ**





నల్గొండ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో కలిసిపోవడానికి, సమాజానికి వారు అర్హులైన ఆధునిక ఆర్థిక వ్యవస్థను అందించడానికి 320వ శాఖను ప్రారంభించడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకుడు, గ్రూప్ సిఇఓ అమీర్ నాగమ్మి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు రిలయన్స్ ట్రేడ్ సమీపంలో తెలంగాణలో 30వ శాఖను విజ్మోని డైరెక్టర్, సీఈఓ సి ఏ కృష్ణన్ ఆర్ తో కలిసి,విజ్మోని నాయకత్వ బృందం సమక్షంలో అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా బోయవాడ ప్రభుత్వ పాఠశాలకు ఎల్ ఈ డి టీవీని విరాళంగా అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేసి బంగారు రుణాల నుండి ప్రపంచ చెల్లింపుల వరకు అవసరమైన ఆర్థిక సేవలను వేగవంతం చేసి మరింత పారదర్శకంగా కలుపుకొనిపోయేలా చేయడానికి సాంకేతికతను ఉపయోగించడంపై మా దృష్టి కొనసాగుతోందన్నారు.తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోందని ఈ సమాజానికి అర్హమైన సరళమైన,నమ్మదగిన ఆర్థిక సేవలను అందించడానికి మేము ఇక్కడ ఉన్నామన్నారు.ఈ కొత్త కార్యాలయం కేవలం వ్యాపార స్థలం కంటే ఎక్కువ స్థానిక కలలు,వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం మా లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలీతో వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థులు 02 నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు 03

**నల్గొండ కార్పొరేషన్ లో 582 నామినేషన్ దాఖలు**

**ధర్మ ఘంట జనవరి 30, నల్గొండ**





నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా గత మూడు రోజుల నుండి నామినేషన్లు స్వీకరిస్తున్న సందర్భంగా 48 వార్డులకు 334 అభ్యర్థులు 582 నామినేషన్లు దాఖలు చేసినట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. శుక్రవారం చివరి రోజు కావడంతో 414 నామినేషన్లు అభ్యర్థులు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ 143,బీ ఆర్ఎస్ 134, బిజెపి 123, ఇండిపెండెంట్ 100, గుర్తింపు లేని పార్టీలు 56,ఆప్ 1,బీఎస్పీ 4, సిపిఎం 4, మొత్తం 582 నామినేషన్ దాఖలు అయినట్లు తెలిపారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజా బాట

**చౌటుప్పల్ విద్యుత్ శాఖ ఏఈ సతీష్**

**ప్రజాబాటలో విద్యుత్ ఉద్యోగులు**

**దేవలమ్మ నాగారం లో నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు**





**ధర్మఘంట జనవరి 30 చౌటుప్పల్**

ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజా బాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ విద్యుత్ శాఖ ఏఈ సతీష్ అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని దేవలమ్మ నాగారంలో శుక్రవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేపట్టిన విద్యుత్ సంస్థ ఉద్యోగులు ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా ఆయన విస్తృ తంగా మరమ్మతులు చేపట్టారు.ప్రతివారం మూడు రోజులు నిర్వహించే కార్యక్రమంలో దేవలమ్మ నాగారంలో సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ లో వోల్టేజ్ కారణంగా కొన్ని ఇండ్లలో ఫ్యాన్లు తిరగడం లేదని మా దృష్టికి తీసుకురావడంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి,ఆయన సహకారంతో 100 కెవి ట్రాన్ఫార్మర్ ఏర్పాటు చేశామని,రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్నటువంటి ఐరన్ స్తంభాల ప్లేస్ లో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాబాట కార్యక్రమం ద్వారా ట్రాన్స్ ఫార్మర్ల వద్ద మరమ్మతులు చేయడం వల్ల విద్యుత్ నష్టాలు తగ్గి సరఫరా సక్రమంగా ఉంటుందని తెలిపారు.వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని చెప్పారు.ఈ కార్యక్రమంలో లైన్మెన్ సూర్యనారాయణ, అసిస్టెంట్ లైన్మెన్ కిషోర్ కుమార్,ఉప సర్పంచ్ అనూప్ రెడ్డి,వార్డ్ మెంబర్స్ ఊదరి రమేష్,బొమ్మ అమరావతి,పాక రాము, దోనూరు కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య,ఆది మహావిష్ణు దేవాలయం చైర్మన్ వరకాంతం జంగారెడ్డి,సీతా రామాలయం చైర్మన్ పన్నాల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా కొనసాగిన బార్ కౌన్సిల్ ఎన్నికల ఓటింగ్



**కోదాడ జనవరి 30,ధర్మఘంట**

తెలంగాణ బార్ కౌన్సిల్ కు జరుగుతున్న ఎన్నికల్లో కోదాడ పోలింగ్ కేంద్రం నెం.69లో ముమ్మరంగా పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రం నెం.69 కు ఎన్నికల ప్రధాన రిటర్నింగ్ ఆఫీసర్ సిహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి ,సహాయ పోలింగ్ అధికారులు గా రామిశెట్టి రామకృష్ణ, సాధు శరత్ బాబు,యడ్లపల్లి వెంకటేశ్వరరావులను తెలంగాణ బార్ కౌన్సిల్ నియమించారు. ఈ ఎన్నికల కు ఎన్నికల పరిశీలకులు గా 1ర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎండి ఉమర్,సహాయకులు గా షేక్ మోసిన్ అలీ లు వ్యవహరించారు.
ఈ సందర్భంగా ప్రధాన పోలింగ్ అధికారి లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు 115మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 23స్థానాల కోసం 203 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా కోదాడ కోర్టులో ఉన్న 117 మంది ఓటర్ల లో 115 మంది తమ ప్రాధాన్యత లు ఇస్తూ ఓటు వేశారన్నారు.పోలింగ్ కేంద్రం, ఇతర ఏర్పాట్లను బార్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు.బార్ కౌన్సిల్ కు పోటీ చేస్తున్న అభ్యర్థుల తరుపున న్యాయవాదులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు, బార్ కౌన్సిల్ అభ్యర్థి సాముల రాంరెడ్డి తన ఓటింగ్ సరళిని తెలుసుకునేందునకు వచ్చి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య,కోదూరు వెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు సుధాకర్ రెడ్డి,రాధాకృష్ణ మూర్తి,మేకల వెంకట్రావు, దేవబత్తిని నాగార్జున రావు,పాలేటి నాగేశ్వరరావు, కొండల్ రెడ్డి,ఎంవీఎస్ శాస్త్రి,రంజాన్ పాషా,సిలివేరు వెంకటేశ్వర్లు,సంపేట సుధాకర్,వాసు,కె.ఎల్.ఎన్. ప్రసాద్,షేక్ హుస్సేన్,సామా నవీన్, ఎస్.విచలం,కె మురళి,షేక్ నయిమ్,ధనలక్ష్మి, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మా! వెళ్ళిరా.. మళ్ళ రెండేళ్లకి మమ్మల్ని దీవించడానికి రా!

- జాతర ముగింపు ఘట్టం మొదలు
- సంప్రదాయ పూజలతో వన ప్రవేశం

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో వనప్రవేశం అనేది జాతర ముగింపును సూచించే అత్యంత భావోద్వేగభరితమైన మరియు ఉత్కంఠభరితమైన ఘట్టం. చివరి రోజు సాయంత్రం వేళ సమయం సాధారణంగా సుమారు 5:00 - 6:00 గంటల ప్రాంతంలో వనప్రవేశం ప్రారంభమవుతుంది.

**వనప్రవేశం అంటే ఏమిటి?**
నాలుగు రోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న దేవతలు (సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు మరియు పగిడిద్దరాజు) తిరిగి తమ నివాస స్థలాలైన అడవిలోకి (చిలుకలగుట్ట వంటి ప్రాంతాలకు) వెళ్లడాన్నే 'వనప్రవేశం' అంటారు.

**వనప్రవేశం -ముఖ్యమైన దశలు:**
దర్శనాల నిలిపివేత: వనప్రవేశానికి ముందు గద్దెల వద్ద భక్తుల దర్శనాలను పూర్తిగా నిలిపివేస్తారు. భద్రతా కారణ దృష్ట్యా పోలీసుల పహారా పెంచుతారు.
గిరిజన పూజారుల క్రతువు: గిరిజన పూజారులు సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గద్దెలపై ఉన్న కుంకుమ భరిణెలను (అమ్మవార్ల రూపాలు) అత్యంత రహస్యంగా మరియు పవిత్రంగా తీసుకుంటారు.

**ముగింపు వేడుక:**
డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు మరియు భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవార్లను గద్దెల నుంచి తీసుకుని అడవిలోకి తీసుకెళ్తారు. సమ్మక్క తల్లిని చిలుకలగుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి, గోవిందరాజులను కొండాయికి, పగిడిద్దరాజును పూనుగొండ్లకు పూజారులు తీసుకెళ్తారు.
పోలీసు గౌరవ వందనం: సమ్మక్క తల్లి వచ్చేటప్పుడు ఏ విధంగానైతే జిల్లా ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి స్వాగతం పలుకుతారో, అదేవిధంగా వనప్రవేశం సమయంలో కూడా అధికారికంగా వీడ్కోలు పలుకుతారు.

**ప్రాముఖ్యత:**
గిరిజన సంప్రదాయం ప్రకారం, అమ్మవార్లు ప్రజల కష్టాలను తీర్చి, వారు సమర్పించిన 'బంగారం'(బెల్లం) స్వీకరించి తిరిగి అడవికి వెళ్తారని నమ్మకం. వనప్రవేశంతో మహాజాతర ముగుస్తుంది. ఆ తర్వాత 'తిరుగువారం' పండుగ వరకు కొందరు భక్తులు మేడారంలోనే ఉండి మొక్కులు చెల్లించుకుంటారు. వనప్రవేశం సమయంలో భక్తజనం అత్యంత ఆవేదనతో అమ్మవార్లకు వీడ్కోలు పలుకుతారు. "మళ్ళీ రెండేళ్ల తర్వాత మమ్మల్ని ఆశీర్వదించడానికి రావమ్మా" అంటూ మొక్కుకుంటారు.

**వన ప్రవేశం వెనుక అసలు రహస్యం**
మేడారం జాతరలో వనప్రవేశం వెనుక ఉన్న రహస్యం కేవలం ఒక ముగింపు వేడుక మాత్రమే కాదు. అది ఒక వీరగాథ మరియు ప్రకృతితో ముడిపడిన ఆధ్యాత్మిక నమ్మకం. దీని వెనుక ప్రధాన రహస్యాలు ఉన్నాయి:

**కుంకుమ భరిణెగా అంతర్థానం:**
యుద్ధంలో తీవ్రంగా గాయపడిన సమ్మక్క తల్లి శత్రువులకు చిక్కకుండా చిలుకలగుట్ట వైపు వెళ్లి మాయమైందని భక్తుల నమ్మకం. ఆమె కోసం వెతికిన గిరిజనులకు అక్కడ కేవలం ఒక కుంకుమ భరిణె, గాజులు మరియు పులి అడుగుజాడలు మాత్రమే కనిపించాయి. అందుకే వనప్రవేశం సమయంలో పూజారులు అదే కుంకుమ భరిణెలను అత్యంత రహస్యంగా తిరిగి అడవిలోకి తీసుకెళ్తారు.

**పులి కావలి:**
వనప్రవేశం జరిగిన తర్వాత, ఆ ప్రాంతంలో ఒక పులి సంచరిస్తుందని, అది అమ్మవారేనని స్థానిక గిరిజనులు ఇప్పటికీ బలంగా నమ్ముతారు. ఈ సమయంలో అడవిలోకి ఎవరినీ అనుమతించరు.

**పూజారుల గోప్యత:**
అమ్మవార్లను గద్దెల నుంచి తిరిగి అడవిలోకి చేర్చే ప్రక్రియను గిరిజన పూజారులు అత్యంత రహస్యంగా నిర్వహిస్తారు. ఆ కుంకుమ భరిణెలను అడవిలో ఏ రహస్య ప్రదేశంలో ఉంచుతారో ఆ వంశస్థులకు తప్ప మరెవరికీ తెలియదు.
ప్రకృతి శక్తులుగా మార్పు: అమ్మవార్లు విగ్రహ రూపంలో ఉండరు; వారు ప్రకృతి శక్తులు (అనిమిజం). గద్దెలపై ఉన్నంత సేపు వారు ప్రజల మధ్య ఉన్నట్టు, వనప్రవేశం తర్వాత తిరిగి తమ మూలస్థానమైన అడవి (ప్రకృతి) లోకి విలీనమైనట్టు భావిస్తారు.


**శాపం మరియు రక్షణ:**
యుద్ధ సమయంలో సమ్మక్క కాకతీయ సామ్రాజ్యం అంతమైపోతుందని శపించిందని, అయితే తనను నమ్ముకున్న ప్రజలను ఎల్లప్పుడూ రక్షిస్తానని మాటిచ్చి అడవిలోకి వెళ్లిపోయిందని చరిత్ర చెబుతోంది. ఆ మాట ప్రకారమే రెండేళ్లకు ఒకసారి ఆమె అడవి నుంచి వచ్చి భక్తులను దీవిస్తుందని నమ్మకం. వనప్రవేశం అనేది అమ్మవార్లు తమ దివ్య స్థితికి తిరిగి వెళ్లే ప్రక్రియగా పరిగణించబడుతుంది.
వనప్రవేశం తర్వాత జరిగే 'తిరుగువారం' పండుగ గా జరుపుతూ మొక్కులు చెల్లిస్తారు.

**'తిరుగువారం' పండుగ విశిష్టత**
మొక్కులు ఎలా చెల్లించాలి?
వనప్రవేశంతో జాతర అధికారికంగా ముగిసినప్పటికీ, ఆ తర్వాత వచ్చే బుధవారం ఫిబ్రవరి 4 నాడు 'తిరుగువారం' నిర్వహిస్తారు.

**ప్రాముఖ్యత:**
జాతర ముగిసిన వారం రోజులకు స్థానిక గిరిజనులు మరియు పూజారులు నిర్వహించే ముగింపు క్రతువు ఇది.

**శుద్ధి కార్యక్రమాలు:**
జాతరలో కోట్లాది మంది రాకవల్ల అపవిత్రమైన గద్దెల ప్రాంతాన్ని పూజారులు పసుపు నీళ్లు, ఆవు పేడతో శుద్ధి చేస్తారు. శాంతి పూజ: దేవతలు తిరిగి అడవిలోకి వెళ్లిన తర్వాత, గ్రామానికి మరియు భక్తులకు ఎలాంటి ఆపదలు రాకుండా గిరిజన సంప్రదాయంలో శాంతి పూజలు నిర్వహిస్తారు. తక్కువ రద్దీ జాతర సమయంలో రద్దీ వల్ల దర్శనం చేసుకోలేని భక్తులు చాలామంది ఈ తిరుగువారం రోజున మేడారం వచ్చి ప్రశాంతంగా దర్శనం చేసుకుంటారు.

**రహస్యాలు**
మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో అనేక సంప్రదాయాలు



మరియు ఆచారాలు ఉంటాయి. వీటిలో కొన్ని వంశపారంపర్యంగా వస్తున్నవి, వాటిని పూజారులు గోప్యంగా ఉంచుతారు.

**గద్దెల రహస్యం:**
మేడారంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే జాతరలో, గద్దెలపై దేవతా మూర్తులకు బదులుగా పసుపు, కుంకుమ భరిణెలను ఉంచి పూజిస్తారు. ఈ భరిణెలు వనప్రవేశం సమయంలో అడవిలోకి తీసుకెళ్లి, తిరిగి జాతర సమయంలో తీసుకువస్తారు. ఈ ప్రక్రియలో కొన్ని రహస్యాలు పాటించబడతాయి.

**పూజా విధానాలు:**
అమ్మవార్లను గద్దెలపైకి తీసుకురావడం, వనప్రవేశం చేయడం వంటి ముఖ్యమైన ఘట్టాలలో పూజారులు కొన్ని ప్రత్యేకమైన, గోప్యమైన పూజా విధానాలను పాటిస్తారు. ఇవి వారి వంశ ఆచార సంప్రదాయాలుగా పరిగణిస్తారు.

**పవిత్ర స్థలాలు:**
జాతరతో సంబంధం ఉన్న కొన్ని ప్రదేశాలు మరియు వనప్రవేశం జరిగే మార్గాలు పవిత్రంగా భావించబడతాయి మరియు వాటి వివరాలు అందరికీ తెలియవు. ఈ రహస్యాలు ఆ సంప్రదాయంలో అంతర్భాగం మరియు వాటిని కాపాడటం పూజారుల బాధ్యత.

**రహస్య పూజలు**
మేడారం జాతరలో రహస్య పూజలు అత్యంత ప్రాధాన్యత కలిగినవి. గిరిజన ఆచారాల ప్రకారం, ఈ పూజలు జాతర ప్రారంభం నుండి ముగింపు వరకు వివిధ దశల్లో చేస్తారు.

**గద్దెల శుద్ధి:**
జాతర ప్రారంభానికి ముందు 'మండ మెలిగే' పండుగ రోజున పూజారులు గద్దెలను శుద్ధి చేస్తారు. ఈ సమయంలో సామాన్య భక్తులను గద్దెలపైకి అనుమతించరు మరియు పూజారులు రాత్రంతా 'జాగారం' ఉండి రహస్యంగా ప్రత్యేక క్రతువులు నిర్వహిస్తారు.

**దేవతల ఆగమనం:**
సమ్మక్క తల్లిని చిలుకలగుట్ట నుంచి తీసుకువచ్చే ముందు గిరిజన పూజారులు (వడ్డెలు) కొండపై రహస్య పూజలు నిర్వహిస్తారు. ఆ కుంకుమ భరిణెను తీసుకువచ్చే మార్గంలో విద్యుత్ దీపాలను ఆర్పేసి, చీకటిలో అత్యంత గోప్యంగా గద్దెలపైకి చేరుస్తారు.

**వనప్రవేశం:**
జాతర చివరి రోజున అమ్మవార్లు తిరిగి అడవిలోకి వెళ్లే సమయంలో కూడా గద్దెల వద్ద పూజారులు రహస్య పూజలు చేస్తారు. ఈ సమయంలో భక్తుల దర్శనాలను నిలిపివేస్తారు. అమ్మవార్ల రూపాలైన ఆ కుంకుమ భరిణెలను అడవిలో ఏ రహస్య ప్రదేశంలో ఉంచుతారనేది కేవలం ఆ వంశానికి చెందిన పూజారులకు మాత్రమే తెలిసిన రహస్యం.

**పూజారుల నిష్ఠ:**
ఈ పూజలు నిర్వహించే కోయ పూజారులు కఠినమైన నియమాలను, ఉపవాసాలను పాటిస్తారు. వారి సంప్రదాయాల ప్రకారం, ఈ క్రతువులు గిరిజనేతరులకు లేదా సామాన్య ప్రజలకు కనిపించకుండా జరగాలి.

**బ్రాహ్మణ పూజారులు ఉండరు:**
ఈ జాతరలో వైదిక లేదా బ్రాహ్మణ పూజారులు ఉండరు. కేవలం కోయ పూజారులు (వడ్డెలు) మాత్రమే వారి పురాతన గిరిజన పద్ధతుల్లో ఈ రహస్య పూజలు నిర్వహిస్తారు. ఈ రహస్య పూజలు అమ్మవార్ల శక్తినీ, జాతర యొక్క పవిత్రతనూ కాపాడతాయని భక్తుల నమ్మకం.

**వన ప్రవేశం అనంతరం మహిమలు**
మేడారం జాతరలో వనప్రవేశం తర్వాత కూడా అనేక మహిమలు మరియు నమ్మకాలు ఉన్నాయని భక్తులు, ముఖ్యంగా గిరిజనులు బలంగా విశ్వసిస్తారు.

**పులి సంచారం:**
వనప్రవేశం పూర్తయిన తర్వాత, అమ్మవార్లు వెళ్ళిన అడవి ప్రాంతంలో ఒక పెద్ద పులి సంచరిస్తుందని నమ్మకం. ఆ పులి అమ్మవార్ల రూపమని లేదా వారిని కాపాడే వాహనమని భావిస్తారు. ఆ సమయంలో అడవిలోకి ఎవరైనా వెళ్తే ప్రమాదం జరుగుతుందని స్థానికులు హెచ్చరిస్తారు.

**అకాల వర్షం:**
వనప్రవేశం జరిగిన రోజు లేదా మరుసటి రోజు అడవిలో మరియు మేడారం పరిసరాల్లో ప్రాంతాలలో వర్షం కురవడం ఒక మహిమగా భావిస్తారు. ఇది అమ్మవార్లు తమ నివాసానికి చేరుకున్నారని మరియు ప్రకృతిని చల్లబరిచారని సంకేతంగా నమ్మకం.

**ఆరోగ్య నమ్మకాలు:**
వనప్రవేశం ముగిసిన తర్వాత కూడా మేడారం గడ్డపై ఉన్న మట్టిని లేదా వాగు నీటిని ఇంటికి తీసుకెళ్తే దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని, పశువులకు ఉన్న వ్యాధులు తొలగిపోతాయని గిరిజనుల విశ్వాసం.

**తిరుగువారం మహిమ:**
జాతర ముగిసిన వారం తర్వాత జరిగే 'తిరుగువారం' పూజ సమయంలో గద్దెల వద్ద ఇప్పటికీ కొందరు భక్తులు పూనకాలు రావడం, వారు చెప్పే విషయాలు నిజమవ్వడం ఇక్కడి మహిమలలో ఒకటి.

**వన సంరక్షణ:**
వనప్రవేశం తర్వాత అమ్మవార్లు అడవిలో ఉండటం వల్ల, ఆ అటవీ సంపదకు ఎలాంటి హాని జరగదని, అడవి జంతువులు గ్రామాలపై పడవని గ్రామస్థులు నమ్ముతారు. ఈ మహిమలన్నీ శతాబ్దాలుగా వస్తున్న మౌఖిక సంప్రదాయాలు మరియు భక్తుల అచంచలమైన నమ్మకం మీద ఆధారపడింది.

**వన ప్రవేశం ఎలా చేస్తారు?:**
మేడారం జాతరలో వన ప్రవేశం ఘట్టాన్ని ఎవరూ పబ్లిక్‌గా "చూపించరు." ఇది అత్యంత రహస్యంగా మరియు గోప్యంగా నిర్వహించబడే క్రతువు.

**నిర్వహించేది ఎవరు:**
ఈ వన ప్రవేశం ప్రక్రియను కేవలం కోయ గిరిజన పూజారులు (వడ్డెలు) మాత్రమే నిర్వహిస్తారు. తరతరాలుగా వస్తున్న వారి వంశపారంపర్య హక్కుగా దీనిని పాటిస్తారు.

**ఎందుకు చూపించరు:**
గిరిజన సంప్రదాయం ప్రకారం, అమ్మవార్లు తిరిగి వెళ్లే సమయంలో సామాన్య భక్తులు లేదా గిరిజనేతరులు ఆ రూపాన్ని చూడకూడదు. అలా చూస్తే అమ్మవార్ల శక్తికి మరియు చూసిన వారికి ఇబ్బంది కలుగుతుందని వారి నమ్మకం.

**ముగింపు వేడుక:**
గద్దెల వద్ద తుది పూజలు పూర్తయ్యాక, జాతర ప్రాంగణంలోని విద్యుత్ దీపాలను ఆర్పేస్తారు. చీకటిలో లేదా వెన్నెల కాంతిలో పూజారులు ఆ కుంకుమ భరిణెలను అత్యంత జాగ్రత్తగా అడవిలోకి తీసుకువెళ్తారు.

**చట్టపరమైన ఆంక్షలు:**
వన ప్రవేశం సమయంలో పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటారు. భక్తులను గద్దెల వద్దకు రాకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తారు. సంక్షిప్తంగా చెప్పాలంటే, పూజారులు మాత్రమే ఈ క్రతువును నిర్వహిస్తారు కానీ ఎవరికీ ప్రత్యక్షంగా చూపించరు. అమ్మవార్లు అడవిలోకి వెళ్ళిన తర్వాత, పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి జాతర ముగిసినట్లు అధికారికంగా ప్రకటిస్తారు. 2026 మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ముగింపు షెడ్యూల్ గా కొనసాగింది. ముగింపు నేడు శనివారం జరగనుంది. ఈ ముగింపు వేడుక రోజున దేవతలు (సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు మరియు పగిడిద్దరాజు) తిరిగి అడవిలోకి వెళ్లే "వనప్రవేశం" ఘట్టంతో జాతర అధికారికంగా ముగుస్తుంది. 2026 జాతరలో ఫిబ్రవరి 4న నిర్వహించే 'తిరుగువారం' పండుగతో ఉత్సవాలు పూర్తిగా సమాప్తమవుతాయి.

**ప్రధానంగా 2026 జాతర షెడ్యూల్**
జనవరి 28న కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజులు గద్దెలపైకి చేరుకున్నారు. జనవరి 29 నాడు చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి గద్దెపైకి రాకతో జాతరలో ఇది అత్యంత కీలక ఘట్టం గా చెప్పవచ్చు. జనవరి 30 న భక్తులు దేవతలను దర్శించుకుని తమ మొక్కులను (బంగారం/బెల్లం) సమర్పించుకుంటారు.
జనవరి 31నాడు సమ్మక్క-సారలమ్మల వనప్రవేశంతో జాతర ముగింపు పలికి ఫిబ్రవరి 4న తిరుగువారం తో సమాప్తం చేస్తారు. వనప్రవేశం అనేది ఆధ్యాత్మిక ప్రాముఖ్యత మేడారం జాతరలో అత్యంత ఆసక్తికరమైన అంశం. దీని వెనుక ఉన్న పురాణగాథ మరియు రహస్యాలు ఉన్నాయి.
**కుంకుమ భరిణెగా మార్పు:** కాకతీయ సైన్యంతో జరిగిన యుద్ధంలో తన కుటుంబం మొత్తం వీరమరణం పొందిందని తెలుసుకున్న సమ్మక్క, తీవ్ర గాయాలతోనే శత్రువులపై విరుచుకుపడింది. అనంతరం ఆమె రక్తం చిందిస్తూనే సమీపంలోని చిలుకలగుట్ట వైపు వెళ్ళింది. ఆమె కోసం వెతికిన గిరిజనులకు అక్కడ కేవలం ఒక కుంకుమ భరిణె, గాజులు మరియు నెమలినార చెట్టు కింద ఒక పుట్ట మాత్రమే కనిపించాయి. ఆ తల్లి కుంకుమ భరిణె రూపంలో అదృశ్యమైందని (మాయమైందని) భక్తుల నమ్మకం.
**పులి రాక (అతీంద్రియ నమ్మకం):**
వనప్రవేశం ముగిసిన తర్వాత, దేవతలు తిరిగి వెళ్ళిన ఆ అటవీ ప్రాంతంలో ఒక పులి సంచరిస్తుందని గిరిజనులు మరియు స్థానికులు బలంగా నమ్ముతారు. ఆ పులి రూపంలో అమ్మవారే అడవిని కాపాడుతుందని వారి విశ్వాసం.

**రహస్య పూజలు:**
వనప్రవేశానికి ముందు మరియు అమ్మవార్లను గద్దెల నుంచి తిరిగి అడవిలోకి తీసుకెళ్లే సమయంలో గిరిజన పూజారులు అత్యంత గోప్యంగా సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. ఈ సమయంలో గద్దెల వద్దకు సాధారణ భక్తులను, కెమెరాలను అనుమతించరు. ఆ కుంకుమ భరిణెలను ఎక్కడ ఉంచుతారో, ఆ రహస్యం కేవలం ఆ వంశానికి చెందిన పూజారులకు మాత్రమే తెలుస్తుంది.
**అదృశ్య శక్తిగా తిరిగి వెళ్లడం:** సమ్మక్క మరియు సారలమ్మలు సాధారణ విగ్రహాలు కావు. వారు అడవి నుంచి వచ్చి, నాలుగు రోజులు ప్రజల మధ్య ఉండి, తిరిగి తమ నివాసమైన ప్రకృతిలోకి (వనంలోకి) వెళ్తారనేది ఇక్కడి సంప్రదాయం. వనప్రవేశం అంటే దేవతలు మళ్ళీ తమ అతీంద్రియ స్థితికి చేరుకోవడమే.

**ఆకాశవాణి మాటలు:**
పురాణాల ప్రకారం, సమ్మక్క అదృశ్యమైన తర్వాత గిరిజనులకు ఆకాశం నుంచి కొన్ని మాటలు వినిపించాయని, ప్రతి రెండేళ్లకు ఒకసారి తాము భక్తులను ఆశీర్వదించడానికి వస్తామని హామీ ఇచ్చారని కథనం ఉంది. వనప్రవేశం అనేది కేవలం జాతర ముగింపు మాత్రమే కాదు, అది ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి, అమ్మవార్ల శాశ్వత ఉనికికి నిదర్శనం.
గద్దెల నుండి వన ప్రవేశం జరిగే విధానం అత్యంత నియమబద్ధంగా, గిరిజన సంప్రదాయాల ప్రకారం జరుగుతుంది. ఈ ప్రక్రియ కొన్ని దశలుగా సాగుతుంది. జాతర చివరి రోజున మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళ ఈ ఘట్టం ప్రారంభమవుతుంది. సాధారణంగా వన ప్రవేశానికి కొన్ని గంటల ముందు గద్దెల వద్ద భక్తుల దర్శనాలను అధికారికంగా నిలిపివేస్తారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు క్యూ లైన్లను నియంత్రిస్తారు. అనంతరం గిరిజన పూజారులు (వడ్డెలు) గద్దెలపై ఉన్న కుంకుమ భరిణెలను (దేవతల రూపాలు) అత్యంత భక్తిశ్రద్ధలతో సేకరిస్తారు. ఈ సమయంలో పవిత్రమైన డోలు వాయిద్యాలు, 'అక్కుం' అనే ప్రత్యేక సంగీత వాయిద్యం మారుమోగుతుంది. సమ్మక్క తల్లిని చిలుకలగుట్ట వైపుకు పూజారులు భుజాల మీద మోస్తూ తీసుకెళ్తారు. సారలమ్మను ఆమె నివాసమైన కన్నెపల్లి గ్రామానికి తరలిస్తారు. గోవిందరాజు మరియు పగిడిద్దరాజు వీరిని వరుసగా కొండాయిపల్లి మరియు పూనుగొండ్ల ప్రాంతాలకు తీసుకువెళ్తారు. వన దేవతలు గద్దెల నుండి కదిలే సమయంలో, జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి అధికారికంగా వీడ్కోలు (గౌరవ వందనం) పలుకుతారు. పూజారులు దేవతలను అడవిలోకి తీసుకెళ్ళే మార్గంలో మరియు ఆ కుంకుమ భరిణెలను నిక్షిప్తం చేసే చోట అత్యంత గోప్యత పాటిస్తారు. ఆ ప్రదేశాన్ని భక్తులు చూడకుండా జాగ్రత్త పడతారు. దేవతలు గద్దెల నుండి కదిలిన వెంటనే, మేడారంలోని కోట్లాది మంది భక్తులు తమ ఇళ్లకు తిరుగు ప్రయాణమవుతారు. దీనితో మహాజాతర సమాప్తమవుతుంది.
అమ్మవార్లు అడవిలోకి వెళ్ళిన తర్వాత కూడా గిరిజన పూజారులు (వడ్డెలు) కొన్ని ప్రత్యేకమైన మరియు గోప్యమైన సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు.

**నిక్షిప్త ప్రక్రియ:**
గద్దెల నుండి తీసుకువెళ్ళిన కుంకుమ భరిణెలను (దేవతల రూపాలు) అడవిలోని ఒక రహస్య ప్రదేశంలో లేదా ఒక నిర్దిష్ట వృక్షం వద్ద నిక్షిప్తం చేస్తారు. ఈ సమయంలో గిరిజన తెగలకు మాత్రమే తెలిసిన ప్రాచీన మంత్రోచ్ఛారణలు మరియు పూజలు జరుగుతాయి.

**శాంతి పూజ:**
జాతర అంతా ఎటువంటి విఘ్నాలు లేకుండా పూర్తయినందుకు కృతజ్ఞతగా, మరియు వచ్చే రెండేళ్ల పాటు గ్రామాలను, అడవిని రక్షించాలని కోరుతూ అడవిలోనే శాంతి పూజ నిర్వహిస్తారు

**కోయ పూజారులు అధీనం**
మేడారం జాతరలో గద్దెల వద్ద మరియు వనప్రవేశం తర్వాత కూడా అమ్మవార్ల రూపాలైన ఆ కుంకుమ భరిణెలు పూర్తిగా మరియు శాశ్వతంగా కోయ పూజారుల (వడ్డెల) అధీనంలోనే ఉంటాయి. జాతర ముగిసిన తర్వాత కూడా వనప్రవేశం ముగిశాక, అమ్మవార్లను అడవిలోని ఏ రహస్య ప్రదేశంలో ఉంచాలి, ఏ చెట్టు కింద భద్రపరచాలి అనేది కేవలం పూజారులకు మాత్రమే తెలిసిన రహస్యం. రెండేళ్ల పాటు ఒక జాతర ముగిసినప్పటి నుండి మళ్ళీ రెండేళ్ల తర్వాత వచ్చే మహా జాతర వరకు, ఆ కుంకుమ భరిణెలు పూజారుల పర్యవేక్షణలోనే అడవిలో "అజ్ఞాతంగా" ఉంటాయి.

**ప్రభుత్వ పాత్ర:**
ప్రభుత్వం కేవలం జాతర ఏర్పాట్లు, భద్రత మరియు రవాణా సౌకర్యాలను మాత్రమే చూస్తుంది. కానీ, పూజా కార్యక్రమాలు మరియు అమ్మవార్ల రూపాలను భద్రపరిచే విషయంలో ప్రభుత్వానికి కానీ, దేవాదాయ శాఖకు కానీ ఎటువంటి అధికారం ఉండదు. ఇది పూర్తిగా గిరిజన పూజారుల హక్కు.

**వంశపారంపర్యం:**
ఈ అధికారం ఒక తరం నుండి మరో తరానికి వంశపారంపర్యంగా బదిలీ అవుతుంది. పూజారి కుటుంబానికి చెందిన వారు మాత్రమే ఆ రహస్య ప్రదేశానికి వెళ్ళగలరు. సంక్షిప్తంగా చెప్పాలంటే, అమ్మవార్లు గద్దెలపై ఉన్నా, అడవిలో ఉన్నా వారు ఎల్లప్పుడూ కోయ పూజారుల రక్షణలోనే ఉంటారు. పూజారి కుటుంబాలు మరియు వారి చారిత్రక నేపథ్యం పూజారి కుటుంబాలు మేడారం జాతర నిర్వహణ కేవలం కొన్ని నిర్దిష్ట కోయ గిరిజన గా కుటుంబాల హక్కు. వీరు వంశపారంపర్యంగా ఈ బాధ్యతలను నిర్వహిస్తారు:

**సిద్ధబోయిన వంశం:**
సమ్మక్క తల్లికి పూజలు చేసే హక్కు సిద్ధబోయిన వంశీయులకు ఉంటుంది. వీరు మేడారం గ్రామానికి చెందినవారు.
కొక్కెర వంశం: సారలమ్మ తల్లికి పూజలు చేసే హక్కు కొక్కెర వంశీయులది. వీరు కన్నెపల్లి గ్రామానికి చెందినవారు.

**ఇతర వంశాలు:**
పగిడిద్దరాజుకు పెనక వంశస్థులు, గోవిందరాజులకు దుబ్బ వంశస్థులు పూజారులుగా వ్యవహరిస్తారు.

**గిరిజన పూజారుల ప్రత్యేకత**
వీరు ఎటువంటి జీతాలు తీసుకోరు. భక్తులు ఇచ్చే కానుకల మీద కాకుండా, అమ్మవార్ల మీద ఉన్న భక్తితో ఈ సేవ చేస్తారు. జాతర సమయంలో వీరు అత్యంత కఠినమైన నిష్టతో (ఉపవాసం, నేల మీద పడుకోవడం) పాటిస్తారు.
వీరి వద్ద ఎటువంటి రాతపూర్వక మంత్రాలు ఉండవు, అన్నీ నోటి మాట ద్వారా ఒక తరం నుండి మరో తరానికి అందుతాయి.

**వంశం వారీగా ఎంత మంది**
మేడారం జాతరలో పూజా కార్యక్రమాలు మరియు దేవతలను గద్దెలపైకి తీసుకువచ్చే కీలక ఘట్టాలలో ఆయా వంశాలకు చెందిన నిర్దిష్ట సంఖ్యలో ముఖ్య పూజారులు మరియు వారి సహాయకులు పాల్గొంటారు.

**సమ్మక్క (సిద్ధబోయిన వంశం):**
ప్రధాన పూజారితో పాటు సుమారు 10 నుండి 15 మంది వరకు వంశీయులు ఈ క్రతువులో పాల్గొంటారు. వీరిలో ప్రధాన పూజారి (వడ్డె) కుంకుమ భరిణెను మోస్తారు.
సారలమ్మ (కొక్కెర వంశం): కన్నెపల్లి నుండి సారలమ్మను తీసుకువచ్చే సమయంలో సుమారు 10 మంది ముఖ్య పూజారులు మరియు సహాయకులు ఉంటారు.

**పగిడిద్దరాజు & గోవిందరాజులు:**
వీరిని తీసుకువచ్చే క్రతువులో పెనక, దుబ్బ వంశాలకు చెందిన సుమారు 5 నుండి 8 మంది చొప్పున పూజారులు పాల్గొంటారు.

**వంశాల వారీగా మహిళల పాత్ర:**
పూజారుల భార్యలు (ఆడపడుచులు) గద్దెల వద్ద శుద్ధి కార్యక్రమాలు మరియు కొన్ని ప్రత్యేక సంప్రదాయ పూజల్లో పాల్గొంటారు.

**వంశపారంపర్య అధికారం:**
పూజారి చనిపోతే, ఆ వంశంలోని పెద్ద కుమారుడికి లేదా తగిన అర్హత ఉన్న వారసుడికి ఆ బాధ్యతలు అందుతాయి.
వారసులకు చిన్నప్పటి నుండే ఈ రహస్య పూజా పద్ధతులను పెద్దలు నేర్పిస్తారు. ఇది పూర్తిగా మౌఖికంగా (నోటి మాట ద్వారా) జరుగుతుంది. ఈ నియమాలను పాటించడం ద్వారానే వారు అమ్మవార్ల శక్తిని భరించగలరని మరియు భక్తులకు వారి ఆశీస్సులు అందజేయగలరని గిరిజనుల విశ్వాసం.
2026 సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా....

బత్తుల గణేష్
జర్నలిస్టు (9177108128)